# ప్రజాకళ ప్రజాస్వామిక సాహిత్య పత్రిక

## కాళోజి నారాయణరావు: నవంబరు 13 వర్థంతి



అతిథివోలె వుండి వుండి
అవని విడిచి వెళ్ళుతాను
పల్లె పట్టణంబులనక
పల్లేరై తిరిగినాను

- కాళోజి

## రెండవ సంచిక

నవంబరు 2006

మీ రచనలు, అభిప్రాయాలు పంపించండి, నిర్మాణాత్మక చర్చలో పాల్గొనండి
Editor@Prajakala.org

# సూచిక

## కవితలు


బతకమ్మా! బ్రతుకు - కాళోజి ............ 4
చమ్కీ - షాజహానా ............ 11
సదా మీ సేవలో - డా. ఎం. హరికిషన్ ............ 12
మూడు కవితలు - తమ్మినేని యదుకుల భూషణ్ ............ 13
స్వగతం - కాళోజి ............ 15


## కథలు


తెలియక ప్రేమ తెలిసి ద్వేషము - కాళోజి ............ 17
సమిధ - జి. వెంకటకృష్ణ ............22


## నవల / ధారావాహిక


ప్రజల మనిషి - వట్టికోట ఆళ్వార్‌స్వామి ............ 27


## వ్యాసాలు


కాల్మొక్కని కాళోజీ – నగ్నముని ............ 6
ఆలోచనలు, అవగాహన : ముందుమాట - కొడవటిగంటి రోహిణీప్రసాద్ ............39
బుద్ధి, భౌతికవాదమూ - కొడవటిగంటి రోహిణీప్రసాద్ ............41
'కక్క' నవల: పది దళిత మార్క్సిస్టు సూత్రీకరణలు - జిలుకర శ్రీనివాస్ ............44


## ఇంటర్వ్యూ


ప్రత్యామ్నాయ స్త్రీపురుష సంబంధాల అన్వేషణే అరి సీతారామయ్య కథలు ............49

## సాహిత్య వార్తలు


సతీష్ చందర్ ‘ చంద్రహాసం’ ఆవిష్కరణ – ప్రశాంత్ ........................................ 56

కె. గీత ‘ శీతసుమాలు’ ఆవిష్కరణ – ప్రశాంత్ ..........................................58

కిరణ్ దేశాయి నవల్ ‘ లాస్ ఆఫ్ ఇన్ హెరిటెన్స్ ‘ కు బుకర్ బహుమతి ...............................61


## ప్రపంచ సాహిత్యం / అనువాదాలు


నేటివ్ అమెరికను చరిత్ర – మమత ........................................ 62

కథ రాయడం కష్టం... - గాబ్రియెల్ గార్సియా మార్కెజ్ ..54

ఆమె పాల పళ్ళు పోతున్నాయి ................................................ 68

ఆశ - ఏరియల్ డార్ఫ్ మేన్ ................. 69

యుద్ధోన్మాద పాలకుల్లారా! - బాబ్ డిలాన్ .................................... 71


Disclaimer:

ప్రజాకళలో ప్రచురించిన రచనల్లో ఆయా రచయితలు వెలిబుచ్చిన అభిప్రాయలతో ప్రజాకళకు అంగీకారం కానీ తిరస్కారం కానీ లేవు. ఒక ప్రజాస్వామిక సాహిత్య వాతావరణం ఏర్పాటు చేసే ప్రయత్నంలో అన్ని రకాల ప్రజాస్వామిక అభిప్రాయాలకు జాగా ఇవ్వాలనేదే మా ప్రయత్నం. అందుకనే విభిన్న అభిప్రాయాలని ప్రకటించే రచనలని మేము ప్రచురిస్తున్నాం. ఈ రచనల పై పాఠకులనుండి నిర్మాణాత్మక చర్చను ఆహ్వానిస్తున్నాం. దయచేసి మీ అభిప్రాయాలని తెలుగులో రాయండి. ఉపయోగకరమైన చర్చ జరిగేందుకు తోడ్పడండి.

# బతకమ్మా! బ్రతుకు

- కాళోజీ

గుమ్మడిపూలు పూయగ బ్రతుకు

తంగెడి పసిడి చిందగ బ్రతుకు

గునుగు తురాయి కులుకగ బ్రతుకు

కట్ల నీలిమలు చిమ్మగ బ్రతుకు || బతకమ్మా! బ్రతుకు … ||

అమ్మను మరవని సంతానము కని || బతకమ్మా! బ్రతుకు … ||

పచ్చని పసరిక బయళ్ళ బ్రతుకు

పల్లెపట్టుల పంటల బ్రతుకు

పసుపుతోట మరియాదగ బ్రతుకు

పున్నమ వెన్నెల మాదిరి బ్రతుకు || బతకమ్మా! బ్రతుకు … ||

మూడుముళ్ళ బిగియింతల పద్దుల

జంట బ్రతుకు తాహత్తుల హద్దుల

మమతల, మమతల పెంచెడి సుద్దుల

తీరుతీరు చవులూరెడి చద్దుల || బతకమ్మా! బ్రతుకు … ||

పసుపు కుంకుమల వసతుల తేలుచు

పారాణిలో మారాణిగ పారుచు

ఆలమంద గొంతుల 'అంబా'డుచు

దాంపత్యపు దివ్వెల వెలయించుచు || బతకమ్మా! బ్రతుకు … ||

తండ్రుల తాతల జేయుచు మురియుచు

కొడుకుల తండ్రుల జేయుచు వెలయుచు

అమ్మల అవ్వల జేయుచు కాయుచు

బిడ్డల తల్లుల జేయుచు సాకుచు || బతకమ్మా! బ్రతుకు … ||

నొసటి కుంకుమల తళుకుల నీనుచు

మంగళసూత్రము వలపుల పేనుచు

గాజుల గలగల నవ్వుల తేలుచు
కాలిమట్టియల పలుకుల కులకుచు || బతకమ్మా! బ్రతుకు … ||
మక్కలరాసుల పసిడిగ బ్రతుకు
గేగుల కండల జవగా బ్రతుకు
'సీతాఫల' కనుగ్రుడ్డుగ బ్రతుకు
పాలుపట్టి గింజూరగ బ్రతుకు || బతకమ్మా! బ్రతుకు … ||

నల్లపూసల నడుమనె బ్రతుకు
పాలతిన్నియల దాపునె బ్రతుకు
నొసటి మధ్య మందారమ! బ్రతుకు
కాళ్ళపసుపు పారాణి! బ్రతుకు || బతకమ్మా! బ్రతుకు … ||

పాటపాడి పాటల పాడిస్తూ
ఆటలాడి ఆటల ఆడిస్తూ
జంటగూడి జంటల కూరుస్తూ
బతుకు బ్రతికి బతుకుల బ్రతికిస్తూ || బతకమ్మా! బ్రతుకు … ||

చెలిమి చెలమలు ఊరేదాకా
చెలిమి కలుములు నిలిచేదాకా
చెలిమి వెన్నెలలు కాసేదాకా
చెలిమి రాగములు ఒలికేదాకా || బతకమ్మా! బ్రతుకు … ||

మన్నూ మిన్నూ ఉండే దాకా
సూర్యుడు చంద్రుడు వెలిసే దాకా
చుక్కలు మింటిలో కులికే దాకా
కాలచక్రము తిరిగేదాకా || బతకమ్మా! బ్రతుకు … ||

అమ్మను మరవని సంతానము కని || బతకమ్మా! బ్రతుకు … ||
కాళోజి నా గొడవ కవితలు, 2001 సెప్టెంబర్‌లో నుండి
కాళోజీ ఫౌండేషన్, వరంగల్, హైదరాబాద్

# కాల్మొక్కని కాళోజీ

\- నగ్నముని

నవంబరు 13, మధ్యాహ్నం. ఓ కార్యక్రమంలో పాల్గొనడానికి చెన్నయ్‌లో ఉన్నాను. రిమోట్‌తో స్పృశించగానే టి.వి. తెరమీద హఠాత్తుగా విస్ఫోటనంలా ప్రసారమైన వార్త. మన కాళోజీ భౌతికంగా మనను వీడి వెళిపోయారనే వార్త. ఆయన వయసెంతో తెలుసు. ఆయన అస్వస్థత గురించి తెలుసు, ఆసుపత్రిలో వున్నారని తెలుసు. త్వరలోనే యింటికి వస్తారని అనుకుంటుండగా, ఆయన మరోలా అనుకుని, యీ జీవితం తలుపులు బార్లా తీసుకుని వెళిపోయారనేది మాత్రం నమ్మలేని నిజం.

నమ్మడానికి యిష్టంలేని నిజం. చాలాసేపు చుట్టే ఆవరించిన శూన్యం, లోపల శూన్యం, ఘనీభవించిన మహా శూన్యం అనుభవిం చాను. బహుశా, యిది నా ఒక్కడి అనుభవమే కాదు. కాళోజీని తెలిసిన తెలుగుజాతి అనుభవం.

సూర్యుడు ఒక్కడే, ఒక్కొక్కరికీ ఒక్కొక్కడుగా భాసించినట్లు, కాళోజీ కూడా ఒక్కడే. ఒక్కొక్కరికి ఒక్కొక్కనిగా, కాలంతో సమానంగా నడుస్తూ, కార్యశీలిగా గమిస్తూ అనేక ఉద్యమాలలో మమేకమై, తన మాటతో, చేతతో, కవితతో కరుకుగా, కనికరంగా అందరి హృదయాల్లో గాఢంగా చోటు చేసుకున్న వాడు. మానవత్వాన్ని నిండా నింపుకున్నవాడు. మానవ విలువల్ని సర్వత్రా వెదజల్లినవాడు.

ఆయన చేసిన ప్రయాణం సుదీర్ఘమైంది. ఎక్కడా ఆగిపోలేదు. అలసి పోలేదు. మాసిపోలేదు. మడం తిప్పలేదు. నాటి నైజాం నిరంకుశ రాచరికం దురాగతాల నుండి నేటి హై హైటెక్ స్లో పాయిజన్ ఆధిపత్య అన్యాయాల వరకు దేనికీ కాల్మొక్కనివాడు. ప్రజల్ని బానిసలుగా మార్చి కాలికింద తొక్కిపట్టిన రాజరిక, భూస్వామ్య వ్యవస్థల్నీ, వాటి విలువలనే సరికొత్త రూపంలో కొనసాగిస్తూ పౌరహక్కుల్ని కాలరాచే, ‘సర్కార్ సంస్కృతి’కి - ప్రభుత్వ సంస్కృతికీ కాల్మొక్కనివాడు. అంతేకాదు, ఈ అమానవీయ విలువలకి కాల్మొక్క వద్దని, ఎదురించమని ప్రబోధించినవాడు. వివక్షను ఎండగట్టినవాడు. ప్రజా స్వామ్యానికీ, ప్రశాంతికీ, స్వేచ్ఛకీ, సమానత్వానికీ, సహృదయతకీ, సామాజిక న్యాయానికీ తప్ప దేనికీ కాల్మొక్కవద్దని కోరినవాడు, శాసించినవాడు, శ్వాసించిన వాడు కాళోజీ. సామాన్యుల కోసం అసామాన్యంగా నిలబడినవాడు కాళోజీ. అందుకే అతనంటే అంత గౌరవం, ప్రేమ, అభిమానం.

అతని ఊహల్లో వ్యూహాలు లేవు, వ్యామోహాలు లేవు. అతని మాటల మీద ముసుగులు లేవు. పలుకుల మధ్య పరదాలు లేవు. నడకలో నడతలో తారట్లాడే నీడల్లేవు, క్రీనీడల్లేవు. చేతల్లో, రాతల్లో పదవులకై, పురస్కారాలకై మెట్లెక్కడానికై నేడు పదుగురు చేసే చిత్రవిచిత్ర విన్యాసాలు లేవు. ఆత్మగౌరవాన్ని తాకట్టు

పెట్టుకునే లక్షణాలు లేవు. అతని నిజాయితీకి వెలలేదు. అట్టడుగు జనం కోసం, వారికి చెందవలసిన న్యాయం కోసం తుదికంటా నిలకడగా నిలిచినవాడు. సూటిగా మాట్లాడినవాడు. అతనిది అక్రమాలపై గురిపెట్టిన ధిక్కార స్వరం. అధిక్షేపణా రచనతో ఈ విలోమ విలువల లోకంలో అనులోమ క్రమం కోసం అవిశ్రాంతంగా సమరం సాగించినవాడు మన కాళోజీ.

ఒక్కసారిగా కళ్ళముందు గతం నిలబడింది.

కాళోజీతో నా సాన్నిహిత్యం నాలుగు దశాబ్దాలపై మాటే. చిన్నప్పట్నుంచీ నాకు పత్రికలుచదివే అలవాటుంది. అట్లా కాళోజీ పేరుతో పరిచయముంది.

1956 నవంబరు ఒకటిన, భాషా ప్రాతిపదికపై విశాలాంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడింది. అదే నెల 2వ తేదీన నేను బందరు నుండి హైదరాబాద్‌కు వచ్చాను. తెలుగు అన్నదమ్ముల ఏకీకరణ సంఘటనలో ఉద్భవించే కాంతులు గమనించడానికి, 'ఢిల్లీకి వచ్చి ఉద్యోగంలో చేరమని' పిలుపు అప్పటికే నాకు వచ్చి వుంది. తెలుగువారి కలయిక పులకరింతతో చూసి పోదామని హైదరాబాద్‌కు వచ్చాను. నా ప్రయత్నం లేకుండానే, చిత్రంగా నవంబరు నెలలోనే, 26వ తేదీన శాసనసభలో తాత్కాలిక ఉద్యోగిగా నియమించబడ్డాను. తర్వాత పబ్లిక్ సర్వీస్ కమీషన్ వారు ప్రకటన ద్వారా నిర్వహించిన ప్రత్యేక పరీక్షలో ఎంపికచేసి నన్ను శాశ్వత ప్రాతిపదికపై శాసనసభలో వెర్బాటిమ్ రిపోర్టరుగా నియమించడం జరిగింది. దీనికీ, పత్రికా విలేఖరి ఉద్యోగానికీ సంబంధం లేదు. ఆ విధంగా తెలుగు ప్రేమతో, తెలుగు రాజధానిలో స్థిరపడ్డాను.

1958లో శాసనమండలి (లెజిస్లేటివ్ కౌన్సిల్) ఏర్పడింది. అటు శాసనసభకు స్పీకర్‌గా అయ్యదేవర కాళేశ్వరరావుగారు ఉన్నారు. ఇటు శాసనమండలికి ఛైర్మన్‌గా మాడపాటి హనుమంతరావుగారు ఉన్నారు. ఇద్దరూ స్వాతంత్ర్య సమరయోధులే. అదే సంవత్సరం ఉపాధ్యాయుల నియోజకవర్గం నుండి కాళోజీ ఎన్నికై ఎం.ఎల్.సి. అయినారు? 1960 వరకూ కొనసాగారు. ఆనాటి, రాష్ట్రారంభ ప్రారంభ సంవత్సరాలు మేరువులతో నిండిన సభల సన్నివేశాల సమావేశాలు చూసి తీరవలె. ఆ అదృష్టం నాకు కలిగింది. బయట నుండి చూడడం కాదు, అంతర్భాగంగా ఉండి వీక్షించే అవకాశం కలగడం మామూలు విషయం కాదు.

శాసనసభ, శాసనమండలి సమావేశాలు జరుగుతున్నప్పడు వెర్బాటిమ్ రిపోర్టర్లు హాజరై, సభల కార్యక్రమంలో భాగంగా, సభ్యుల ఉపన్యాసాలు యథాతథంగా కవర్ చేస్తారు. అంతకుముందు పత్రికల ద్వారా కాళోజీ గురించి విని ఉన్నాను. శాసనమండలి ప్రాంగణంలో సన్నిహితం కావడం జరిగింది. ఆయన ఉపన్యాసాలు వినడం, యథాతథంగా రికార్డు చేయడం జరిగింది. అప్పడు నా వయస్సు 19 సంవత్సరాలు. వయసులో మామధ్య చాలా తేడా ఉంది. మేం కలిసినప్పడు అది ఎన్నడూ అడ్డు రాలేదు. దానికి ఆయనే కారణం. ఆయనలోని సహృదయ సాదర దృక్పథమే ఇందుకు కారణం.

ఆయన స్థల, కాల, ప్రాంతీయ విభేదాల్లేకుండా నిత్యం వర్తమానంలో జీవించే వ్యక్తి. ఆయన కళ్ళ వెనుక కన్నీటి జలపాతాలున్నాయి. దురాగతాలపై కన్నీటి కాండవ జ్వాలలున్నాయి. అన్నింటినీ తనలోనే ఇముడ్చుకొని, 'నా గొడవ'గా చెప్పుకున్నాడు. ఎన్నిసార్లు, ఎంతగా చెప్పినా అది 'అతని గొడవ' కాదని, 'లోకం గొడవ'ని అందరికీ తెలుసు. అదే ఆయన సృష్టించిన సరికొత్త కవితా సమయం.

కొన్నేళ్ళ తర్వాత, ఉద్యోగక్రమంలో నేను జాయింట్ సెక్రటరీ అయ్యాను. అప్పటికి కొంతకాలం క్రితం ప్రభుత్వం వారు మాజీ శాసనసభ్యులకు పెన్షన్ పద్ధతి ప్రవేశపెట్టారు. నా విధుల్లో భాగంగా, మాజీ సభ్యుడిగా కాళోజీకి నా సంతకంతో పెన్షన్ చెక్కులు పంపేవాడిని. ఆయన ఉన్నది రెండేళ్ళ కావడం వల్ల, పంపేది పెద్ద మొత్తమేమీ కాదు. అయినా, ఆ మాత్రమైనా, నా సంతకంతో వెంట వెంటనే పంపుతున్నందుకు సంతోషించేవాణ్ణి. కాళోజీ, నేనూ ఎక్కడ కలుసుకున్నా మా కుశల ప్రశ్నల్లో భాగంగా అడిగేవాన్ని, 'పెన్షన్ చెక్ సక్రమంగా అందుతున్నదా?' అని. 'అందుతున్నది నగ్నమునీ,' అనేవాడాయన నవ్వుతూ.

1957 నవంబరు నెలలో, నా మొదటి కవిత, గోరాశాస్త్రి గారి సంపాదకత్వాన వెలువడిన 'తెలుగు స్వతంత్ర' వారపత్రికలో అచ్చయింది. తర్వాత గోలకొండ పత్రిక, భారతి, కృష్ణాపత్రిక, ఆంధ్రప్రభ మొదలైన పత్రికలలో అచ్చయ్యాయి. దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు ప్రొడ్యూసర్గా ఉండగా,

'ఆకాశవాణి'లో ప్రసారమయ్యాయి. ఏ కవికయినా ఇవి సంతోషం కలిగించేవే. అయితే, అంతకంటే ముఖ్యమైన విషయం మరొకటి ఉంది. ఆ రోజుల్లో హైదరాబాద్లో కవి సమ్మేళనాలు ముమ్మరంగా జరిగేవి. ప్రతిష్టాత్మకంగా జరిగేవి. వచన కవిత్వ ప్రాచుర్యం కోసం, శ్రోతకు నా ప్రయోగ పరిచయం కోసం రెండు ఉద్దేశాలూ మనసులో పెట్టుకుని నేను ఈ కవి సమ్మేళనాల్లో విరివిగా పాల్గొనేవాడిని.

ఇందులోనూ రెండు విధాలైన కవి సమ్మేళనాలు జరిగేవి. మొదటిది- పద్యం, గేయం. ఇవిగాక, అప్పుడప్పుడే పూతకిస్తున్న ఆధునిక వచన కవిత్వం. ఈ ప్రక్రియలన్నింటిలోనూ రాసే కవులు పాల్గొనేవారు. రెండవది, అరుదైనది- ద్విభాషా కవి సమ్మేళనాలు. ఇవి తెలుగు, ఉర్దూ రెండు భాషలకు చెందిన కవులు పాల్గొనే సమ్మేళనాలు. అంటే, ఏ భాషకు చెందిన కవులు, ఆ భాషలో తమ కవితలు చదివి వెళ్ళిపోవడం కాదు. ఇందులోని విశిష్టత ఏమిటంటే- ఈ రెండు భాషలూ, వాటి సంప్రదాయాలు, సాహితీ చరిత్రలు క్షుణ్ణంగా తెలిసినవారు దీనికి అధ్యక్షులుగా ఉంటారు. తెలుగు కవి తన కవిత చదవగానే, లేక వినిపించ గానే, అధ్యక్షుల వారు అప్పటికప్పుడు దీనిని ఉర్దూలోకి, మూలానికి అతి దగ్గరగా ఉండేట్లు అనువదిస్తారు. అలాగే ఉర్దూకవి తన కవిత వినిపించగానే, లేక గానం చెయ్యగానే దీని వెనువెంటనే తెలుగులోకి అనువదిస్తారు అధ్యక్షుల వారు. ఈ విధంగా తక్షణం అనువాదం చెయ్యడం అంత సులభమైన పని కాదు. ఈ పద్ధతి వల్ల కవి సమ్మేళనానికి హాజరైన వారంతా ప్రతి కవితనూ ఆస్వాదిస్తారు. అంతకంటే ముఖ్యంగా- రెండు భాషల కవులూ నేరుగా పరిచయమవుతారు. ఏ భాషలో కవితా ప్రయాణం ఏ విధంగా సాగుతున్నదో అర్థం చేసుకోవడానికి

అవకాశమేర్పడుతుంది. దీనివల్ల ఆయా భాషల మధ్య ఉండే అడ్డుగోడ ఆ కాసేపయినా అదృశ్యమవుతుంది. అధ్యక్షులవారు భాషల మధ్య వంతెన వేస్తారు. ప్రజలను సన్నిహితం చేసే సాంస్కృతిక రాయబారి అవుతారు. ఇది అతి క్లిష్టమైన పని. ఇటువంటి ఒక ద్విభాషా కవి సమ్మేళనంలో నేను పాల్గొన్నాను. దీనికి కాళోజీ అధ్యక్షుడు. ఆయన అత్యంత జయప్రదంగా నిర్వహించాడు. అదొక ఉత్సాహభరితమైన కవుల పండుగ. ఆద్యంతం ఆలింగనల హేల. కారణం కాళోజీ నిర్వహణ.

ఎమర్జెన్సీకి ముందు రోజుల్లో, నేనింకా ప్రభుత్వ సర్వీసు నుండి డిస్మిస్ కాకముందు రోజుల్లో, మేం హైదరాబాదులోని మలక్‌పేట కాలనీలోని ప్రభుత్వ క్వార్టరు ఎం.ఎస్. ౮౮లో ఉండేవాళ్ళం. అది మేడమీది భాగం. మా పక్క క్వార్టరు పై భాగంలో- ఎం.ఎస్. ౯౦లో రాఘవేంద్రరావు కుటుంబం ఉండేది. మా కుటుంబానికి సన్నిహితులు, కాళోజీకి దగ్గరి బంధువులు. మా క్వార్టర్ల కిటికీలు ఎదురుబొదురుగా ఉండేవి. అంతకు క్రితంరోజు రాత్రి కాళోజీ వాళ్ళింట్లో దిగి ఉంటే, తెల్లవారిక ముందే, కోడి కూయకముందే, 'నగ్నమునీ' అని గట్టిగా పిలుపు వినిపించేది. 'ఎవరబ్బా, ఇంత పొద్దున్నే,' అని లేచి చూస్తే ఎదురుగా కిటికీ దగ్గర కాళోజీ, కాసేపు కిటికీల దగ్గరే ఉండి సాహిత్యం, రాజకీయాలు అనేకం ముచ్చట్లు చెప్పుకునేవాళ్ళం. ముఖాలు కడుక్కున్నాక అక్కడనో, ఇక్కడనో టీ చప్పరిస్తూ సంభాషణ సాగించేటోళ్ళం. ఆయనక్కడికొచ్చి నప్పడల్లా ఆ పిలుపు వినపడుతూనే ఉండేది. ఇందులో ఏముంది గుర్తు పెట్టుకోడానికి అని ఎవరికైనా అనిపించవచ్చు. ఇదింత ముఖ్యంగా చెప్పకోవాల్నా అని కూడా మరికొంతమందికి అనిపించవచ్చు. ఆయన పిలుపులోని ఆత్మీయత, స్నేహంలోని స్వచ్ఛత చవిచూసిన వారికి ఇవి అపురూపాలే.

అటు ఆంధ్రలోగాని, ఇటు తెలంగాణలో కాని మొత్తం దేశంలోనే స్వాతంత్ర్యం కోసం పోరాడిన యోధులనేకమంది ఉన్నారు. వారు త్యాగమూర్తులు. ధనమాన ప్రాణాలను తృణప్రాయంగా చూసినవారు. తమ కోసం, తమ కుటుంబాల కోసం, పదవుల కోసం, సంపద కోసం, భద్రజీవనం కోసం కలలో కూడా ఆలోచించనివారు. అది దేశప్రజల కోసం పరితపించిన త్యాగమయ సంస్కృతిలో విలసిల్లిన కాలం. ఈ మహోజ్వల కాలానికి చెందినవాడే కాళోజీ.

ఒకవైపు నైజాం రాచరిక నిరంకుశత్వానికి వ్యతిరేకంగాను, స్వాతంత్ర్యం కోసం సత్యాగ్రహం, వందేమాతరం, ఆర్యసమాజ్, స్టేట్ కాంగ్రెస్ (తెలంగాణ) ఉద్యమాలు ఒక ఎత్తు, మరొక ముఖ్యమైనది- రజాకార్ల ఊచకోతకు వ్యతిరేకంగా నడిపిన ఉద్యమం. వీటిలో పాల్గనడం ఎంత కష్టమో- ఇవాళ ఊహకు అందని విషయాలు. ఆయన అంతటితో ఆగలేదు. తదనంతర కాలాన వీటిని పెట్టుబడిగా పెట్టుకుని రాజకీయ పదవుల కోసం వెంపర్లాడలేదు. పైనున్న వారంతా తనకు దగ్గరగా తెలిసినవారియినప్పటికీ ఎవరినీ, 'ఇది నాకు ఇప్పించమని' యాచించలేదు. పైగా- పౌరహక్కుల కోసం రాజకీయ, సామాజిక న్యాయం కోసం, శాంతి కోసం కృషి చేస్తూ ప్రయాణం సాగించిన ఘనుడు మన కాళోజీ.

స్వాతంత్ర్యానంతరం మొదటితరం పాలకుల వరకు ప్రభుత్వం, యంత్రాంగంతో పట్టాల మీద సక్రమంగానే నడిచింది. ఆ తర్వాతి తరం నుండే పట్టాలు తప్పింది. అవినీతి ఇసుకలో కూరుకుపోవడం ప్రారంభమైంది. ఇది కూడా పట్టాల మీద ప్రయాణమేనని నమ్మించడానికి అనేక సంక్షేమ జేబు స్కీములు ప్రవేశపెట్టారు. పెడుతున్నారు. సహజంగానే అవి స్కాములుగా బయటపడుతున్నాయి. తమ కోసం, తమ పిల్లల, మనవల, మునిమనవల కోసం దేశసంపదను దోచెయ్యడం కోసం అధికార పదవుల్లో కదురుకుని ప్రభుత్వాన్ని, అన్ని వ్యవస్థల్నీ తమ సొంత ఆస్తులుగా మలుచుకోవడంలో ప్రావీణ్యత సంపాదించారు. పెద్దలు సాధించి అప్పగించిన స్వాతంత్ర్యాన్ని పణంగా పెట్టి, అందమైన లేబుల్స్ అతికించి, అప్పుల కోసం పాశ్చాత్య దేశాల చుట్టూ తిరుగుతూ, ఆత్మ గౌరవాన్ని మంటగలిపి, సామాన్యుడి నుండి మేధావుల వరకు అందర్నీ తరిమేసి, వలసలు పోయే స్థితి తీసుకురావడం జరిగింది. పాలనలో దేనినైనా ప్రజల వైపు నుండి గాక, అధికారం, ఎన్నికల వైపు నుండి చూసే ఒక ఆధిపత్య 'సర్కారు సంస్కృతి' తీసుకువచ్చి, ఈ నేలలో నాటి, అవినీతి నీళ్ళు పోసి పెంచడం జరుగుతోంది. అధికారంతో, ప్రచారంతో ఈ భువిలో దేనినైనా సాధించవచ్చు. తిమ్మిని బమ్మిని చేయవచ్చుననే గోబెల్స్ మంత్రం పఠిస్తూ పుట్టించినదే ఈ 'సర్కారు సంస్కృతి.' దీనికీ ప్రజలకీ ఏమి సంబంధం లేదు. దీనికీ దేశం పునరుజ్జీవనానికీ ఏమీ సంబంధం లేదు. ఇదొక ఆక్టోపస్. ముందుగా మూలాల్ని కొడుతుంది. దేశ దేహంలోని సున్నితమైన భాగాల్ని ఆక్రమిస్తుంది. తన అధీనంలో ఉంచుకుంటుంది. సాహిత్యం నుండి మానవత్వం వరకు అన్ని రంగాల్నీ చెనక్కుండా పట్టుకుని మొత్తం సమాజ జీవితాన్ని ఆవహించింది ఈ ఆధిపత్య విష సంస్కృతి. ప్రస్తుతం చాలామంది ఈ పడగనీడలో ఉన్నారు. ఈ ప్రజా వ్యతిరేక 'సర్కారు సంస్కృతి'కి కాళోజీ లోబడలేదు. అక్కడే ఉంది అతని బలం. ఈ నల్ల ప్రభుత్వ నల్ల సంస్కృతి అతన్ని కాటువేయలేకపోయింది. అక్కడే ఉంది అతని నిబద్ధత, నిజాయితీ. పోరాట పటిమ.

కొందరికి ఆయన వరంగల్లువాడు. మరికొందరికి తెలంగాణ ప్రాంతీయవాది. నాకు మాత్రం వాడిగల తెలుగువాడు. మమతల పూసే మనసున్న మానవుడు.

నిజాయితీని కాలమేఘ: కాసేపు దాయగలదేమోగాని ఎన్నటికీ జయించలేదు.

కాళోజీకి జేజేలు.

'కాళోజీ యాదిలో' నుండి, ప్రచురణ 2002
కాళోజీ ఫౌండేషన్, వరంగల్, హైదరాబాద్

# చమ్కీ

- షాజహానా (8-09-2006)

కలల కుచ్చుముడివీడి
దారాలు దారాలుగా జీవితం
నాలుగ్గోడలకు రోజులను బిగించి
పట్టి పట్టి చేస్తున్న కలల కార్చోప్

రాత్రి చిక్కటి చీకటి మీద
మెరుపులుగా మెరుస్తున్న
కట్ దానా కుందన్లను
ఆలోచనల జరీతో కలబోసి చేస్తున్న కార్చోప్

సాదా చమ్కీ.... దేవదాసి చమ్కీ
రకరకాల రంగుల మెరుపు కలలు
సాదా జీవితానికి
అరబ్ దీనార్ల రంగుల కలలు
రాకుమారుడి రాకకోసం
ఆకాశం తానులో నేసిన నక్షత్రాల స్వాగతం

అన్ని చమ్కీలు చీరమీదకు చేరవు
దారితప్పి కింద పడి
ఊడ్పులో మాసి
బజారులో ఎండకు మెరిసి
ఏ గాలి వేగానికో
బురదగుంటల్లో ఆత్మహత్యించుకుంటాయి

బతుకు
చీరకు వేసిన కట్ దానాలానో
బజారున పడ్డ చమ్కీలానో
ఏ ఎగుమతిలో ఎక్కడిదాకా వెళ్తుందో తెలియదు

ఏ బురద గుంట వడిలో మునుగుతుందో తెలియదు

కానీ మెరవడం దాని జీవలక్షణం

పాతబస్తీ నిండా మెరుస్తున్న చమ్కీలే

# సదా మీ సేవలో !

- డా. ఎం. హరికిషన్

ప్రవహించీ... ప్రవహించీ
నవ్వుల నది నిదురపోతా వుంది
లాగేసే అయస్కాంత చూపులకు
మత్తు జల్లే నవ్వుల పరిమళాలకు
కాసేపు ఆటవిడుపు
టీవీలో అత్తాకోడళ్ళైనా
ప్రేమికుల్లా గుసగుసగానే వాదులాడుకొంటున్నారు.
వంటింట్లో గిన్నెలైనా
పువ్వుల్లా మృదువుగానే శబ్దిస్తున్నాయి.
నిశ్శబ్దాన్ని ధ్వంసంచేసే
రేపటి వెలుగుల కోసం
సేవకులంతా స్వచ్ఛంద మౌనవ్రతం పాటిస్తున్నారు.

# మూడు కవితలు

- తమ్మినేని యదుకుల భూషణ్

1.
దారి తప్పాను

ఊరినిండా ఉప్పులా

పేరుకుపోయిన మంచు

ఉరుముతోంది కుక్క..

2.
మండుటెండ

పలుకరింపుతో

మంచుకరిగి నీరై

ప్రవహించాక

చీకాకు ఎరగని చెట్టును

ఆకులా అతుక్కున్న

ఏకాకి పిట్ట

ఎగిరిపోయింది

3.
దిగబడ్డ మేకు

ఎగరడం అటుంచి

అడుగులో అడుగేసి

కూడా నడవలేను

# స్వగతం

- కాళోజి



అతిథివోలె వుండి వుండి
అవని విడిచి వెళ్ళుతాను
పల్లె పట్టణంబులనక
పల్లేరై తిరిగినాను

మురికి నీటి నడుమవున్న
ఇరుకులలో ఇరికినాను
కూటిపేద తన కబళము
నోటకీయ గుడిచినాను

పూలవాసనలు నిండిన
పాలరాతి మేడలలో
ఆయాసము కలిగించెడి
పాయసాలు మెక్కినాను

వాయువుతో పోటీపడు
వాహనాలు ఎక్కినాను
కంటకాల మధ్యనేను
కాలినడక నడిచినాను

కాలు బైట పెట్టకుండ
కాలమెంతో గడిపినాను
గుట్టలపై ఎక్కి ఎక్కి
గట్టుల దిగజారినాను

లోయలలో దూకిదూకి
లోతులెన్నో చూసినాను
నేపాకని ఎత్తులేదు

నేజారని లోతులేదు

మూలజేరి మునులవోలె
మూగనోము బట్టినాను
ఈగవోలె దోమవోలె
వాగుచు తిరుగాడినాను

అతిథివోలె వుండి వుండి
అవని విడిచి వెళ్ళుతాను

# తెలియక ప్రేమ తెలిసి ద్వేషము

- కాళోజి

"ఎంత బాగుందోయి పాట. కొంతసేపాగి, విని, మరిపోదామా?"

"నాకు విందామనే వుంది కాని సమయానికక్కడ చేరకపోతే దయాదాక్షిణ్యం లేక దండన విధిస్తాడు ఆ యమధర్మరాజు తెలుసా?"

"ఆ భయం మనకు లేనిదెప్పుడు. వైతరణి  దాటితే  యమపురి ఎంతదూరం. కొంచెం తొందరగా నడిస్తే వేళకందలేమా  ఏమి?"

"సరే నీ ఇష్టం . కాని, పాశాల్లో జీవాలున్నావే, వెంట తీసుకుని ఎలా వెళ్ళడం గంధర్వులగానం వినేటందుకు?"

"వానిని వైతరణీ తీరాన వదిలేద్దాం. తిరుగుతాయి పాపం కొంచెం స్వేచ్ఛగా . ఎట్లైనా పారిపోతాయన్న భయమూ లేదు. మళ్ళీ ఎన్నాళ్ళకో స్వేచ్ఛ. తలచుకుంటాయి కూడానూ."

"సరే, నీవు చెప్పినట్లు చేయుటకు నాకేం అభ్యంతరం లేదు. కాని, అక్కడకెళ్ళి ఆ పాట వింటుంటే మనకు యమపురి సంగతి ఈ
ప్రాణులసంగతి జ్ఞాపకం వుంటుందా అని?"

"నేను చెపుతాను  లేవోయి   కొంతసేపు కాగానే. నీవు నడుద్దూ ఈ పాశాన్ని నాదానితోపాటిక్కడ వదలి."

" సరే, నడువు అట్లాగయితే."

***

"ఇదేమిటి? ఇప్పటికి నేనొక్కడనే అనుకుంటున్నాను ఈ ప్రదేశంలో కాని, మీరెవరో  వున్నారే నాతోపాటు? మనమెక్కడ వున్నది మీకేమైన తెలుసా?"

" నేను అదే అలోచిస్తున్నాను. ఈప్రదేశం నాకు కొత్తే. ఎక్కడున్నది ఏమి బోధపడడం లేదు కూడాను."

" సరే కాని, ఎక్కడివాడవు నాయనా నీవు?"

“ అయ్యా, నేను భారతీయుడను.”

“ ఏమి, భారతీయుడవా, నా తండ్రీ! మా  దేశీయుడవేనా  నీవు?”

“ మహాభాగ్యం, మీరు భూలోక స్వర్గమగు భరతదేశం వారేనానండి?”

“ అవును కాని, ఏ ప్రాంతం నాయనా నీది?”

“ అయ్యా, నేను  నిజాం రాష్ట్రంలోని తెలంగానా మనిషిని.”

“ ఏమిటి? ఏమంటివి! నిజాం రాష్ట్రంలోని  తెలంగానా   వాడవే? స్వదేశీయుడవే కాకుండా స్వప్రాంతీయుడవు కూడానా నాయనా? మరి, నీవు మాట్లాడేభాష ఏది, తండ్రీ, ఈ ప్రాంతంలో?”

“ ఇంకేభాష మాట్లాడమంటారు మమ్మల్ని? మేము మాట్లాడేది అచ్చం తెలుగండి మహాప్రభో.”

“ ఏమి! ఏమి! తెలుగే. అట్లయితే నీవు నిజాం     రాష్ట్రాంధ్ర సోదరుడవేనా తండ్రీ? అందుకే , నిన్ను చూడడంతోనే ఒక విధమైన సోదరప్రేమ కలిగింది, నాయినా. అయితే ఇక్కడికెలా రావడమైంది, బాబూ?”

“ ఏమోనండి, అదే బోధపడడం లేదు నాకూను. ఉదయం మాఊళ్ళో జరిగిన కొట్లాటలో  నాతలపైన దుడ్డుకట్టె పడ్డాక నాకు స్పృహతప్పింది. తర్వాత ఏమి జరిగిందో తెలియదు. ఇప్పుడు చూస్తే ఇక్కడున్నాను.”

“ ఎంత చిత్రం, మీ ఊళ్ళో కూడా ఉదయం గోల జరిగిందా. మా ఊళ్ళో జరిగిందే నా తల పైన గొడ్డలిపడడం వరకు జ్ఞాపకం వుంది. తర్వాత ఏమి జరిగినదీ నాకు  తెలియదు . ఇప్పుడు చూస్తే ఎక్కడున్నది బోధపడడం లేదు.”

“ సరే బాగానే వుంది. అయితే మీ ఊళ్ళో జరిగినసంగతేమిటో చెప్పండి. నేను మా సంగతి చెపుతాను తర్వాత. చాలా అన్యాయంగా వుందండి కథ. ప్రపంచంలో దయ అనేది లేకపోవడం సత్యమని బోధపడుతుంది మీకే తర్వాత. మీరు కూడా  నాతో  మరియు నాతోటివారితో సహానుభూతి చూపకమానరు నా కథ విన్నాక.”

“ నా కథా అలాగే వుంది అబ్బాయి. ప్రపంచంలో ధర్మమనేది నాశనమయిపోతున్నది దినదినం. ఆచార వ్యవహారాలు మంటగలుస్తున్నాయి లోకంలో. మా ఊళ్ళో జరిగినకథ చెప్పితే ఆశ్చర్యపడడమే కాకుండా నమ్మనైనా నమ్మవేమో  అని  అనుమానిస్తున్నాను. అందుకే, నీవే నీ కథ మొదలు చెప్పితే బాగుంటుందని నా అభిప్రాయం.”

“ నిజమేనండి . ప్రపంచంలో మనుష్యత్వమే లేకుండా అయింది. ఏమి చెప్పేది మా ఊళ్ళో అవస్థ. ఏదో చెపుతాను వినండి. మా ఊళ్ళో ఒక దేవాలయం వుంది. అది మా ప్రాంతంలో చాలా పురాతనమైనది , ప్రసిద్ధికెక్కినది కూడానూ . ప్రతిసంవత్సరము పెద్ద తీర్థం సాగుతుంది. ఈ ఏడు జాతర అప్పుడు దేవాలయం ప్రవేశవిషయంలో వచ్చింది తగాదా అస్పృశ్యులకు సవర్ణ హిందువులకు. సవర్ణులలో కొందరు హరిజనులపక్షం వహించి దేవాలయ ప్రవేశానికి సాయపడతాం అన్నారు. దాంట్లో ఒకరిద్దరు బ్రాహ్మణులు కూడా వుండడం తటస్థించింది. జాతరకంటె ఒక వారం ముందే హరిజనులందరు నిరసన వ్రతంతో దేవాలయప్రవేశ విషయమై సత్యాగ్రహం మొదలుపెట్టారు. బ్రాహ్మణులు, యితర హిందువులూ లాఠీలతో గుడిచుట్టూ కాపలా కాస్తున్నారు. ఈరోజు ఉదయం హరిజనులు కూడా సత్యాగ్రహానికి స్వస్తి చెప్పి జబర్దస్తీగా దేవాలయ ప్రవేశం చేద్దామని లాఠీలతో తయారైనారు. జరిగింది సవర్ణ అవర్ణ హిందువులకు లాఠీలతో సంగ్రామం.”

“ఏమి! నీవూ ఆ దేవాలయ ప్రవేశసందర్భములోనే నెత్తిపగిలి స్పృహదప్పిన మహావీరుడవా నాయనా? ధన్యుడవు. స్వర్గంలో ఇంద్రవైభవము పొందగలవు. ధర్మసంగ్రామంలో పాల్గొన్నవాడవు. పుణ్యాత్ముడవు. నీ తల పగులగొట్టిన ఆ పాపాత్ముడెవడు? వానికి నరకం తప్పునా? నేనూ ఆ ధర్మయుద్ధంలో పాల్గొన్న వీరుడనేతండ్రీ. ఇంతకూ , మనమిరువురము ఒక్క ఊరివారమే నాయనా. అయిన నిన్ను కొట్టిన ఆ దుర్మార్గుడెవరో జ్ఞాపకమున్నదా?”

“కష్టమన్నది తెలియక రోజు మూడుపూటలూ అన్యాయంగా మమ్మల్ని దోచుకొని తిని బాగా బలిసిన ఒక లావాటి బాపనయ్య , ప్రక్కనుండి, నా తలపై దుడ్డుకఱ్ఱ వేసాడు. అతనికీ తగినశాస్తి అయిందనే నా అభిప్రాయం. మా వెంకడు అప్పుడే గొడ్డలితో అతని బుఱ్ఱపై కొట్టినట్లు చూడడం నాకు జ్ఞాపకం.”

“ఒరి ముండాకొడుకా! మాదిగవెధవవు ఇక్కడా దాపరించావు? పొద్దున్న కసితీర లాఠీతో కొట్టి దేవాలయ ప్రవేశంకంటె మొదలు యమపురి ప్రవేశం చేయిస్తామని అనుకుంటే ఆ గొడ్డలిదెబ్బ నా తలపై పడడం చేత తప్పించుకుపోయావు. కాని ఇప్పుడెటు పోతావురా? గొంతుకపిసికి పారేస్తాను చూడు.”

“ఆ బాపనయ్యవు నీవేనా? బొర్రపై ఒక లాఠీతో కొట్టానంటే నిన్న సంతర్పణలో తిన్న భక్షాలన్నీ బయటపడాలే. జాగ్రత్త నా మెడ పిసకడమంటే పిండాలకూడు పిసకడం అనుకున్నావా”

“అబ్బా! ఎంత తన్ను తన్నితివిరా?”

“అయ్యో చస్తి! చేతకాక కొడుతావటయ్యా? ఉండు నీపని పట్టిస్తా”

“అబ్బా ఎంత గుద్దు గుద్దితివిరా. పేగులు వెళ్ళేటట్టు తొక్కుతానుండు.”

“ఏడ్చావు బాపనయ్య కిందపడ్డా నాదే గెలుపంటావు. చూడు నీవు చేస్తానన్నపని నేనే చేస్తా.”

"అయ్యో చస్తి! చస్తి! ఎవ్వరన్నా రక్షించండి బ్రాహ్మణ్ణి, చచ్చిపోతున్నాను పుణ్యానికి."

***

"అరే చాలురా పాటవినడం. నదీతీరాన ఏవో కేకలు వినవస్తున్నాయి. ప్రాణాలను పాశాల్లోంచి వదిలివచ్చాం. అలవాటు చొప్పున ఇక్కడా కొట్లాడుకుంటున్నాయో ఏమో."

"అవునురా ఈ కేకలక్కడివే. ఆ బ్రాహ్మణ మాదిగపంచాయితేరా ఇక్కడ కూడా."

"నడువుమరి"

"మంచిది"

"………………."

"……………….."

"……………….."

"…………………"

"వీరికాపరంమండా. ఇక్కడేదోపోనీ పాపమని కొంతస్వేచ్ఛ యిస్తే మళ్ళీ తన్నుకుంటున్నారేమిరా?"

"చచ్చి ఇంకా సరిగా పదిగంటలు కాకపోయే.ద్వేషం అప్పుడే పోతుందా?"

"వీరి ద్వేషం చట్టుబండలు గాను. ఇదేం కావరంరా చచ్చినా ఈ మతపిచ్చి ఈ వర్ణభేద శతృత్వం పోలేదేం? యమపురిలో తీర్పుచెప్పిన తరువాత తెలుస్తుందిలే సంగతి."

"ఇంకా అలోచిస్తున్నావేమి నేను పాశంలో వేసుకొని నడవటానికి సిద్ధంగా వుంటే?"

"సరే నడువు నేనూ ఇదే బందిస్తున్నాను ఈ బాపనయ్యను.."

"తొందరగా నడవాలి టైము ఎంతో లేదు మనకు."

"నీవు కదిల్తేగా మాటలతోనే సరిపోయె?"

"సరే నడువవోయి. "

***

“ఏమి ఇతడు ఆ అమాయకులైన హరిజనులు దేవాలయ ప్రవేశం చేస్తామంటే అడ్డుపడడమే కాకుండా ఒక హరిజనుని కర్రతో బాది చంపినాడా ?”

“అవును మహాప్రభో”

“ఏమోయి, మావాడు నీ విషయమై చెప్పేది నిజమేనా?”

“అయ్యా నిజమే కాని ధర్మసంరక్షణ”

“ నోరుమూయి ధర్మాధర్మములు ధర్మరాజునైన నాకా నీవు చెప్పేది? ఒరే ఇతనిని పదిరోజులూ అగ్నిగుండంలో పడవేసి తరువాత ఒక పరయా(మాదిగ) కుటుంబంలో పడెయ్యి సుఖపడతాడు. ధర్మం తెలుస్తుంది కూడాను.”

“చిత్తం మహాప్రభో.”

“అయ్యో అగ్నిగుండమా? మాదిగజన్మమా? అన్యాయం! ఘోరం……”

“……………….”

“వీడెవరురా?”

“దేవాలయ ప్రవేశానికి లాఠీతో పోయి ఇప్పటి బాపనయ్యతో చంపబడ్డ హరిజనుడు.”

“అట్లాగా ….. ఒరే నీవు మహాత్ముడు చెప్పిన అహింసావిధానం మాని లాఠీ సహాయమెందుకపేక్షించావు దేవాలయ ప్రవేశానికి?”

“ఎన్నిరోజులు ఊరికే ప్రయత్నించినా ఆ బాపనయ్యలకు దయరాలేదు. విసికి వేసారి జబర్దస్తీకి దిగాం మహరాజా.”

“అది తప్పే…. ఒరే వీడిని రెండురోజులు ఆ మంచులో పడవెయ్యి. కోపం అంతాపోయి శాంతమలవడుతుంది. మూడోరోజు తిరువాన్ కూరులో హరిజన కుటుంబంలోకి పంపించు.”

“తెనుగుదేశంలో కాక మలయాళదేశంలో ఎందుకు తండ్రీ జన్మం?”

“మళ్ళీ దేవాలయ ప్రవేశపు చిక్కులేకుండా. లేకపోతే ఏ బ్రాహ్మణిచేతనో తలపగులకొట్టించుకొని చేరుకుంటావు నావద్దకు.”

# సమిధ

- జి. వెంకటకృష్ణ

కలెక్టరేట్‌లోని ఆఫీసుల సిబ్బంది ఒక్కొక్కరూ ధర్నాను నిరాసక్తంగా చూస్తూ దాటిపోతున్నారు. వీళ్ళంతా తమ సీట్ల కిందా, టేబుల్మీదా వేసుకొన్న వేలాది ఫైళ్లలోని అభ్యర్థనలే- గేటు ముందు ఆర్తనాదాలై, నిరసనలై, ధర్నాలై, ఆత్మహత్యా యత్నాలై, పోలీసు లాఠీఛార్జీలై వర్తమాన చరిత్ర అవుతున్నాయని వీళ్ళకు తెలుసా? తెలిసే నిరాసక్తంగా దాటిపోతుంటారు కదా!

అంతలో దూరంగా పోలీసులు ధర్నా వైపు వస్తూ కన్పించారు.

నిన్న సరిగ్గా ఈ సమయానికి, చాలామంది నిరుద్యోగ యువకులు, ముంపు గ్రామాల్లో భూమి కోల్పోయిన కుటుంబాల నుండి ఉద్యోగాన్ని హామీగా పొందినవాళ్ళు, ఏళ్ళ తరబడి హామీ నెరవేరక నిరసనలు, ధర్నాలు చేస్తున్నవాళ్ళు, అర్ధనగ్నంగా ఊరేగింపు జరిపి, కలెక్టరేట్ ముందు ధర్నా చేస్తూ, కలెక్టరేట్ కారు అడ్డుకొన్నందుకు అరెస్టయ్యారు. ఇప్పుడు ఆ కొడుకుల కోసం తల్లులు రంగంలోకి దిగినట్టున్నారు.

ఈ తల్లిని ఇంతకుమునుపు రెండు సందర్భాల్లో చూసినట్లు గుర్తు. శ్రీశైలం ప్రాజెక్ట్ ముంపు గ్రామాలను చూడాలని వెళ్ళినప్పటి జ్ఞాపకాలలో ఈ తల్లి నన్నెప్పుడూ వెంటాడుతూనే వుంటుంది.

మొదటిసారి ఆమె కన్పించిన సన్నివేశం గుర్తు చేసుకొంటే నా ఒళ్ళు జలదరిస్తుంది. అవి జులై నెల ఆఖరి దినాలు, వరుసగా వర్షాలు కురవని మూడో సీజన్. జులై చేస్తున్న జుడాస్ ద్రోహంతో, క్రీస్తు ఆచూకి దొరికినట్టు శ్రీశైలం ప్రాజెక్ట్ నీళ్ళమట్టం తగ్గీ తగ్గీ, ముంపు భూములు ఒక్కొక్కటి బయల్పడుతుంటే, అలా బయల్పడ్డ ఒక పెద్ద గుడిని చూద్దామని ఒక మిత్రుడితో పాటు ఆ బురుజు నేలల్లోకి నడిచి వెళ్ళాను. కొన్ని సంవత్సరాలుగానీట మునిగిన నేల తేలీ, ఎండీ, మానవ పాదాలను, వాళ్ళ శ్వాసలను స్వప్నిస్తోంది. ఆ స్వప్నాలను సాకారం చేయడానికన్నట్లు మా నడక. ఆ బురుజులో, ఆ పూడికలో కాలు పెడితే పాదాలు కూరుకుపోతున్న వదులు మట్టిలో, అట్లాంటి నిర్జన ప్రదేశంలో కొన్ని శిథిలాల మధ్య ఆమె కన్పించింది. యేదో శిథిలమైపోయిన, మట్టి పేరుకుపోయిన దిబ్బను తడుముతూ ఏడుస్తూ వుంది. ఒక్కక్షణం స్థాణువునై భయంతో ఒక అడుగు వెనక్కు వేసి, ఆ ఏడ్పు మనిషిదేనని నా మిత్రుడు నిర్ధారణ చేశాక, 'ఎందుకమ్మా ఇక్కడున్నా'వని అడిగితే, 'కాస్త దూరంగా కన్పిస్తున్న శిథిలాలు తమ ఊరివనీ, ఆమె నిల్చున్న ప్రదేశంలో తన భర్త సమాధి ఉండా'లనీ చెప్పింది.

దూరంగా కన్పిస్తున్న బయల్పడిన నల్లని గుడి, ఎన్నో యేళ్ళు నీళ్ళలో నానీ నానీ కూడా చెక్కుచెదరని దాని శిఖరంలా, నల్లని ఈ ఆడమనిషిలో భర్త మరణం పట్ల చెక్కుచెదరని దు:ఖం, నేలతల్లి కన్నీళ్ళతో మునిగిపోయే ఆమె నిల్చున్న నేలలా ఎంత పురాతనమైందో అర్థమైంది. మునిగిన ఊర్లూ, మునిగిన పొలాలు, మునిగిన మనుషులు, మునిగిన గుడి, సమాధులు అన్నీ తేలీ, ఎండీ ఈ నేలతో, స్వగతంలో మాట్లాడుతున్న సవ్వడి, ఆమె ఏడ్పులో విన్పించి, అంత దు:ఖాన్ని మోస్తున్న ఆమె దైన్యపు చిత్రం ఎప్పటికీ అలానే నా మనసులో నిలబడిపోయింది.

ధర్నా ముందు పోగుబడుతున్న గుంపును చెదరగొట్టడానికి, పోలీసులు ఆ ప్రాంగణంలో చొరబడ్డారు. చూస్తుండగానే ధర్నా చుట్టూ పోలీసులు, ధర్నా చేస్తున్న స్త్రీలను ఒకవైపు తోసేస్తూ. ఆ తోపులాటతో ఆ స్త్రీలు ఇస్తున్న నినాదాలతో, అరుపులతో ఆ ప్రాంతమంతా అలజడిగా మారుతోంది. అంతే అలజడిని ఆమె ముఖంలో, ఆమెను రెండోసారి వాళ్ళూరిలో చూసినప్పుడే గమనించాను.

మా డెస్క్‌కు కొత్తగా వచ్చిన బాస్‌తో పాటు, ఒకరోజు వరల్డు బ్యాంకు నిధులతో జరుగుతున్న పునరావాస కార్యక్రమాల గురించి, రిపోర్టింగ్ చేద్దామని ఆ ఊరెళ్ళాను.

ముంపులో మునిగిపోయిన ఊరును, అదే పేరుతో కొత్తగా నిర్మించుకొన్నాను. ఊర్లోకి అడుగుపెట్టినప్పటి నుండీ ఏదో తెలియని కృత్రిమత్వం ఆ పరిసరాల్లో కన్పిస్తోంది. వీధులన్నీ నల్లమట్టితో, బురదతో, చేలల్లో తిరిగినట్టుంది. ఒక వీధి మలుపులో ఒక చిన్న మిద్దె, బయటి గోడల మీద చుట్టూ ఎర్రమట్టితో పట్టీలు పూశారు. తీరా చూస్తే అది గుడి! మేం తిరుగుతుంటే ఆడా మగా నిరాసక్తంగా మావైపు చూస్తున్నారు. పిల్లలూ, అక్కడక్కడ ముసలివాళ్ళే మా గురించి అడుగుతున్నారు. ఊరంతా ఒకసారి కలియదిరిగి ఒక చెట్టు కింద అరుగు మీద కూర్చున్నాము. మా చుట్టూ చేరుతున్న వాళ్ళను, ఆ ఊరివాళ్ళు ఏ స్కీముల కింద లబ్ధిదారులయ్యారో అడుగుతుంటే, ఒకామె, "ఈ స్కీములో యేమిచ్చినా కమీషన్లు తీసుకోకుండా యేమన్నా యిస్తిరా నాయనా, యాదానికీ లంచాలే. ఆపీసర్లకీ, మధ్యన పైపైన తరిగే మధ్య మనుషులకీ. మాకొచ్చిందాంట్లో సగం కరిగిపాయనే."

"వీళ్ళూ, వాళ్ళు కాదంటలే, పేపరోల్లంటలే జేజీ," ఒకమ్మాయి సర్దిచెప్తుంటే, "యెవురైనా వొగటేలే, యివన్నీ యినిపోయి, వాళ్ళను బెదిరిచ్చుకోని దుడ్లు గుంజనీకె వీళ్ళొచ్చిండేది," అంది.

దానికి స్పందిస్తూ మా బాస్, "అది కాదవ్వా, ఈ ప్రాజెక్ట్ వొచ్చినాక, మీకేమన్నా మేలు జరిగిందా, పాత వూరు మునిగింది కదా, కొత్త వూర్లో యేమనిపిస్తుంది, యిట్లాంటివి తెలుసు కుందామని మేమొచ్చింది," అన్నాడు.

"యీ ప్రాజెక్టు వొచ్చి మాకు మేలు జరిగిందంటావా, ఆ మాటనేకి నీకు నోరెట్లా వొచ్చింది సారూ. మమ్మల్ని చూస్తే, పచ్చగా బతుకుతాన్నెట్లు అగుపిస్తుందా, పచ్చనిచెట్టును వేర్లతోపాటు గుంజుకొచ్చి వేరేచోట పాతితే

దానికి యెంతమాత్రం ప్రాణముంటుందో, అంతమాత్రమే ప్రాణంతో వుండామయ్యా యీ కొత్తూర్లో. యీ ప్రాజెక్టు వొచ్చి మా భూముల్ని ముంచింది, వూరిని ముంచింది, మమ్మల్నే ముంచింది సారూ…"

ఎంతో ఆవేశంతో ఒక ఆడగొంతు మమ్మల్ని నిలదీస్తుంటే అటువైపు చూశాము. నన్ను ఆశ్చర్యపరుస్తూ, ఆమె! ఆరోజు శిథిలాల మధ్య కన్పించిన ఆడమనిషి!

అంతలో యింకో ఆయన, కాస్త చదువుకున్న వాడిలా కన్పిస్తున్న వాడు అంటున్నాడూ,
"అది కూడా కాద్సార్, భూములు పోయినవాళ్ళకీ, యిండ్లు పోయిన వాళ్ళకీ అంతో యింతో కాంపన్సేషన్ యిచ్చినారు, అయితే యేమీ లేనివాళ్ళకు ఏమిచ్చినారు. పాత వూర్లో బతకడాని కుండే వెసులుబాటుకొత్తూర్లో దొరక్క, ఎంతోమంది చెల్లాచెదురైనారు."

ఆయన మాటల్లో ఎంతో వాస్తవముంది.

యింతలో యింకో ముసలామె, "కాదు నాయనా మా వాయన యింటి ముందట అరుగు మీదనే కూర్చుంటండా, ఆడ్నే ప్రాణమిడిసిండా, ఆ బండ దగ్గర కూర్చుంటే మా వాయన్తో మాట్లాడినట్టే అనిపిస్తాండా, ఆ బండ యీ కొత్తూర్లో వుందా, అది కావల్లమల్లా, దాన్నిస్తుందా మీ గోర్నమెంటు."

"సార్, మా పాతూర్లో ఎంత మంచి గుడి వుండా, పాతకాలం గుడి దాంట్ల కుచ్చుంటే సల్లగా వుంటుండా, ఎప్పుడో మా తాతల కాలంల కట్టింద్రంటా దాన్ని, వాళ్ళ చేతల కష్టం నీళ్ళపాలాయా," అని ఒక మధ్య వయస్కుడు అంటున్నాడు.

"సార్, నాకు నా మొగుడి సమాధి కావల్ల సార్, నాకే కాద్సార్ మావూర్లో వాళ్ళందరికీ వాళ్ళ పెద్దల సమాధులు కన్పించొద్దా సార్, దాండ్లను చూస్తా వాళ్ళను తలచుకుంటా మేము బతుకుతుంటిమి గదా, అవి ల్యాకుండా జేస్తిరి గదా సార్, మాకు మా సమాధుల్ని యిప్పిమని, గోర్నమెంటుకు చెప్పండి సార్…"

శిథిలాల మధ్య కన్పించినామెనే, అలా అడుగుతూంటే, నేను ఉక్కిరి బిక్కిరి అయిపోయాను. ఎన్నో ప్రశ్నలతో, ఊరి పేరు అదే అయినా, పాత ఊరి జ్ఞాపకాలు, అవిచ్చే అనుభూతులు కొత్తగా వెలసిన ఊర్లో దొరుకుతాయా? భౌతికంగా వూరు వెలసినా ఆత్మ ఆవిష్కరింపబడిందా? మనుషుల ఆత్మీయా నుభూతులు వాటి గుర్తులు, వాళ్ళ మనసుల్లో కొన్ని స్థలాల్లో వాళ్ళు ముద్రించు కున్న చిత్రాలు యథాతథంగా కొత్త వూర్లో దొరుకుతాయా? యిట్లాంటి ప్రశ్నలకు సమాధానం చెప్పలేని పునరావాస కార్యక్రమాలు ఎంత భౌతికమైనవో, యెంత శుష్కమైనవో కదా! అన్పించింది.

"యింతకీ, నీ మొగుడెవరమ్మా…" ఆయనంత గొప్పవాడా అన్న ధ్వనితో అడిగాడు మా బాస్.

ఆ మాటకు వొకాయన అందుకొని, “వాదాల వెంకట్రాముడు సార్,” అన్నాడు.

“కలెక్టరాఫీసు ముందు ధర్నా చేస్తుంటే పోలీసాయన విసిరిన లాఠీ దెబ్బకు గాయపడి మరణించిన వెంకట్రాముడా,” ఆశ్చర్యంతో అడిగాను.

“అవుసా. వాడే యీ యమ్మ మొగుడు, వాడు పోయినప్పట్నుంచీ యీమె పరిస్థితి బాగాలేదు.”

“యింతకీ యీమె కొడుక్కి వుద్యోగమివ్వలేదా...” అప్పట్లో గవర్నమెంట్ హామీ గుర్తొచ్చి అడిగాను.

“యాదీ యీలా సార్. యీ యమ్మ కొడుకు వొక్కనికేకాదు, యీ చుట్టుపక్కల ముంపులో భూములు పోయిన ప్రతి యింటికీ ఒక వుద్యోగ మిస్తామని చెప్పిరి. అన్నీ వుత్త మాటలే.”

“పేదోళ్ళ కడుపులు కొట్టినోళ్ళు నాశనమైపోతారు, మన భూముల్ని ముంచినోళ్ళ కొంపలు పాములు, తేళ్ళ పాలవుతాయి...”

నెర్రులు చీలిన రేగడి నేలలాంటి ముఖంలో అలజడితో పెదవులు అదురుతుండగా ఆ తల్లి గట్టిగా వదరడం ప్రారంభించింది, నేనూ, మా బాసు, బిత్తరపోతుండగా, గట్టిగా ఏడుస్తూ, వొదురుతూ, చరచరా వెళ్ళిపోతోంది.

“ఈమె మొగుడు సచ్చినప్పట్నుంచీ యింతే సా, అప్పుడప్పుడు యిట్లా మెంటల్దాని మాదిరిగా వొదురుతుంటుంది, ఎక్కడెక్కడో తిరుగుగాడు తుంటుంది...” వొకతను అంటున్నాడు.

* * *

అంతే అలజడితో వేసవి కాలంలో పగుళ్ళుబారే రేగడినేల లాంటి ముఖంతో ఆ తల్లి అరుస్తోంది...

తన భర్తను బలి తీసుకున్న పోలీసుల్నీ, తన కొడుక్కు వుద్యోగమివ్వని ప్రభుత్వాన్నీ శపిస్తూ, తనను నియంత్రించాలని చూస్తున్న పోలీసు చేతుల్ని విసిరిసిరి కొడుతోంది. అంత శక్తి, అంత తెగింపు ఆమెకెక్కడిదో! వున్న వూరిని ముంచేసి గట్టు మీద యింకో వూరిని కట్టుకోమంటే, వున్న కాసింత భూమినీ మింగేసి పరిహారంగా కొడుక్కు ఉద్యోగమిస్తామని పెట్టిన ఆశ యేళ్ళ తరంబడీ శుష్కంగా మిగిలిపోతే, సర్వం కోల్పోయినా ఆమెకు, ఆమెలాంటి వాళ్ళకు అంత తెగింపు ఎక్కడ్నుంచి వస్తోందో?!

ఇద్దరు పోలీసుల్ని తోసేస్తూ, నోటికొచ్చినట్లు అరుస్తున్న ఆమెను చూసి పిచ్చి కోపం తెచ్చుకొన్న ఎస్సై, ఆమె జుట్టు పట్టి యీడ్చి డొక్కలో తన్నినాడు. విసురుగా పడ్డ ఆమె మీద లాఠీ ఝుళిపించినాడు.

ఆ దెబ్బలకు ఆమె మరింత గట్టిగా అడుగుతోంది.

"... ఏమడుగుతున్నామని మమ్మల్నిట్లా సంపుతున్నారయ్యా... యింటి కొగ వుద్యోగమిస్తామంట్రి. భూములు పోయినోళ్ళకు భూములు, యిండ్లు పోయినోళ్ళకు యిండ్లు, వోయబ్బా వొకటి గాదు, వూర్లు ఖాళీ చేసే వరకూ ఎంటబడి అరచేతిలో సొర్గం చూపితిరి, వూర్లు మునిగిన తర్వాతా, మీ చుట్టూతా మేమ్ దిరుగుతున్నామ్, ఆఫీసర్లు వొగరిమింద వొగరు చెప్పుకుంటా తిప్పుతుంట్రి. ఆ దుడ్లన్నా అన్నీ వొగసారిస్తిరా, కంతులు కంతులు, కోర్టు చుట్టూ తిప్పుకొని, యిప్పటికీ పూర్తీ యీలా. మమ్మల్ని బజార్ల పాలుజేస్తిరి. మీ వూర్లు ముంపులో మునిగితే తెలుస్తుందయ్యా, మీ పొలాలు పోతే తెలుస్తుందయ్యా. ముంపు పక్కన వూర్లు ఎత్తి కట్టుకుంటే, మీ కొంపల్లోకి పాములు, తేళ్ళు జొరబడితే తెలుస్తుందయ్యా. మీ బిడ్డల్నీ, మీ ముసిలోల్లనీ పాములు, తేళ్ళు పెరికితే తెలుస్తుందయ్యా. అయినా యిప్పుడు యేమడుగుతున్నామయ్యా. నా మొగుణ్ణి మింగితిరి. వాయన్ని బతికియ్యమని అడగడ్యం. వాయన సమాధి కావాలంటున్నా, అంతేనయ్యా. అదియ్యండి నాకు... గట్టిగా ఏడుస్తూ... ఏం రాజోమయ్యా మీది, దీనికి గత్తర దగలా..." హిస్టీరిక్‌గా అరుస్తూ, ఏడుస్తూ ఆమె స్పృహ తప్పి పడిపోయింది.

"మొగుడి సమాధి కావాల్నంటా సమాధి... పిచ్చిముండకి..." ఎస్సై ఆమెను చూస్తూ వెర్రిగా నవ్వుకుంటూ వెళ్తున్నాడు.

గుంపులోంచీ ఎవరో, "మంచినీళ్ళు, మంచినీళ్ళు..." అంటున్నారు.

ఆమె నుదుటి నుంచీ బొటబొటా కారుతున్న రక్తస్పర్శతో ఆమె వొరిగిన రేగడి నేల, ఆమె చుట్టూ నిలబడ్డ తల్లుల మనసులాగే కుతకుతమని వుడుకుతోంది. ఇరవైయేళ్ళకు పైగా ముంపులో బతుకులు మునిగి నేలకూ నీళ్ళకూ మధ్యా పడుబాట్లు పడుతున్న జనం ప్రశ్నలకు జవాబుల్లేక అందరి మనసుల్లాగే (చూస్తున్నవాళ్ళ) గాలీ బరువెక్కింది.

పులిచింతల, పోలవరం యింకా యిట్లాంటివెన్నో జలయజ్ఞాల్లో సమిధలు కాబోతున్న యిలాంటి ఎందరో తల్లుల్ని తలుచుకుంటూ నా గుండె అలజడితో నిండిపోతోంది

# ప్రజల మనిషి

- వట్టికోట ఆళ్వార్‌స్వామి

తెల్లవారుజామున మొదలై అప్పుడే వర్షం వెలిసింది. ప్రజలు ఇండ్లలో నుండి బయటికి వచ్చి తమ దైనందిన కార్యకలాపాల్లో లీనమయ్యారు. రైతులు తమ పశువులను దొడ్లో నుండి బయటికి వదిలి ఎత్తయిన ప్రదేశంలో నీరు నిలువని చోట ఎండుగడ్డి వేశారు. బాటనబోయే ఒక ఆవు గడ్డిలో మూతి పెట్టబోయింది. తన హక్కును హరించబోతున్నదనే కోపంతో గడ్డి తింటున్న ఎద్దు ఆవును కుమ్మపోయింది. చేతికర్రతో ఎండుగడ్డిని కింద మీదు చేస్తున్న కోటయ్య పరీక్షగా తన ఎద్దును చూచాడు. అందరికీ సంబంధించినదిగా తలచబడే వస్తువును ఇతరులు హరించబోతుంటే అడ్డుపడి రక్షించుకొనే ఆలోచన తన ఎద్దుకు కలిగి నందుకు, మానవుని ప్రవృత్తి తన ఎద్దుకు అలవడినందుకు ఆనందిస్తూ కోటయ్య కొట్టములోకి వెళ్ళాడు.

కొట్టములో గుంజకు కట్టివేసి యున్న ఆవును దీనంగా చూస్తూ కోటయ్య కొడుకు కొమరయ్య నిలబడ్డాడు. ఆ ఆవు తొక్కుతున్న కాళ్ళ వద్ద పేడ తీయటానికి అతనికి మనసొప్పటం లేదు. ఆవుదూడ అంబే అని అరిచింది. కోటయ్య కండ్ల వెంట నీరు కారింది. తండ్రిని చూడగానే కండ్లలో నీరును ప్రయత్నపూర్వకంగా ఇంకించుకొన ప్రయత్నం చేస్తూ, "దీనికి చొప్ప వేయల్నా అయ్యా?" అన్నాడు. తండ్రి అనంగీకారసూచకంగా కొమరయ్యను చూచి కొట్టంలో ఈతనార కట్టను పరీక్షిస్తున్నాడు.

"ఇక రోజు మేపంగద అయ్యా! ఇయాల ఒక రోజేగద! కడుపునిండ మేపుదాం," కొమరయ్య సందిగ్ధ« దోరణిలో అన్నాడు.

"ఇయ్యాళ్ళంతా అది ఉండబోతుందా? ఇప్పుడో ఇంకాసేపటికో సుంకరి పుల్లయ్య రానేవస్తాడు," అంటూ కోటయ్య విసుగుతో ఇంట్లోకి వెళ్ళాడు.

ఆవును రక్షించుకునే ఆలోచనేమన్నా ఉందేమో అడుగుదామని తండ్రి వెంబడే పోయాడు కొమరయ్య.

"ఇక మనకు ఆవు దక్కదా అయ్యా?" కొమరయ్య గంభీరంగా అడిగాడు.

"నీకెందుకురా ఈ తిప్పలంతా? కన్నబిడ్డనే ఇంకో అయ్యకిచ్చి రోజులు గడపటంలేదు? ఇక గొడ్డుకొచ్చింది," అన్నాడు కోటయ్య.

"అంబే," అని కొట్టంలో నుండి ఆవుదూడ అరుపు వినవచ్చింది. కొమరయ్య పెరట్లోకి వెళ్ళి, గోడ మీద నుంచి కొట్టంలో ఉన్న ఆవును, దూడను దీనంగా చూస్తూ నిలుచున్నాడు.

చేదబావి వద్ద పాచిపని చేసుకుంటున్న తల్లి వద్దకు వెళ్ళాడు. "ఆవును దొరకు ఇయ్యొద్దని నీవైనా చెప్పరాదే."

"నేనివ్వమంటేగా వద్దనటానికి?"

"అదికాదే. ఆవును దొర తోలుకపోతాడన్నప్పటి నుంచి నాకేమీ తోచడంలేదు. దాని కింద కుర్రదున్నను ఇస్తే తీసికోడా దొర?"

"అదంతా నాకేల తెలుసు నాయన. ఆ ఆవునే కావాల్నన్నాడట దొర. మీ అయ్యకు మాత్రం ఇయ్యాల్నని ఉందా? దొర ఆవును

అడిగిన్నాడు మీ అయ్య సరిగా బువ్వ కూడా తినలే," అంటూ పెరుగుకుండ గీకిన గోకును కొమరయ్య చేతిలో వేసింది తల్లి అన్నమ్మ.
"చూడు! బాయికాడికిపోయి వంగపిందెలు, ఆనగప్పిందెలు, మిరప కాయలు ఏమైనా ఎళ్లయేమో చూడు. నేను ఆవును దొరకాడ ఒప్పజెప్పి అటేవస్తా," అంటూ కోటయ్య నెత్తిరుమాలు చుట్టాడు.

కొమరయ్య గొంగడి భుజాన వేసుకొని కర్రను అడ్డంగా మధ్యగా పట్టుకొని కొట్టంలోకి పొయ్యాడు. ఆవు ముఖాన్ని దిద్దాడు. గంగడోలును దువ్వాడు. వెన్ను మీది నుండి రెండువైపుల రెండు చేతులు వేసి కౌగలించుకున్నాడు. ఆవు ఆప్యా యంగా కొమరయ్య వైపు తలతిప్పి నాకాలని నాలుక నాడించింది. కొమరయ్య ఆవు వెన్నుపై తలవాల్చాడు. ఉబికి వచ్చిన కంటినీరు తుడుచుకొన్నాడు. ఆవుదూడ వద్దకు వెళ్ళాడు. దూడ చిన్న అరుపు పెట్టి, కుప్పిగంతులు వేయ సన్నద్ధమవుతున్నది. పలుపువల్ల ఏర్పడిన ప్రతిబంధకాన్ని కండ్ల ద్వారా కొమరయ్యకు చెప్తున్నట్టు తల ఎత్తి చూచింది. తిరిగి చిన్న అరుపు అరిచింది. కొమరయ్య దూడ పలుపు విప్పాడు. దూడ కుప్పిగంతులేస్తూ తల్లిని చేరి పాలు చీకసాగింది. దూలం మీద ఉన్న గడ్డి మోపును చేతికర్రతో కిందపడేశాడు కొమరయ్య. మోపును ఈడ్చుకపోయి ఆవు ముందర వేశాడు. ఆనందంతో ఉబ్బిపోయాడు. బొటబొట కన్నీటిచుక్కలు రాలాయి.
'కడుపునిండా తాగు. అక్కడ నీ కడుపునిండ పాలు వదుల్తారో లేదో,' మనసులో అనుకుంటూ బావి దోవ పట్టాడు. వెనుకకు తిరిగి తిరిగి చూసుకుంటూ కష్టంగా ఒక్కొక్క అడుగూ వేస్తున్నాడు.

పెద్దవాన పడినప్పడల్లా ఊరి పక్క కాలువ నిండుగా పారుతుంది. దాన్ని దాటిపోవాల్సిన పిల్లవాండ్రకు ఇబ్బందిగా ఉంటుంది. కొమరయ్య కూడా ఎన్నోసార్లు భయంతో కాలువ దాటలేక ఇంటికి తిరిగి వచ్చాడు. కాని ఆరోజు కొమరయ్య ఒళ్ళు మరచి కాలువ దాటిపోతున్నాడు. కాలువ లోతుగాని, అతనికి ఎల్లప్పడూ కలిగే భయంగాని స్ఫురించలేదు. ఆలోచనలోనే కాలువ దాటి కొంత దూరం పోయాక వెనుకకు తిరిగి కాలువ ప్రవాహాన్ని తీక్షణంగా చూశాడు. మొలబట్ట, గొంగడి చివర భాగం తడిసి నీళ్ళు కారుతున్నాయి. అంత లోతు ఇంత తొందరగా, సులభంగా ఎట్లా దాటాడో ఆలోచిస్తూ నిలబడిపోయాడు. పక్క చెలకలో గొడుక కింద మూయబడియున్న గొరెపిల్లల అరుపులతో తెప్పరిల్లి తిరిగి బావి దోవ బట్టాడు. బావిగడ్డ మీద గుడిసెలో కూర్చొని ఎక్కి ఎక్కి ఏడ్చాడు. 'ఆవు బాగా పాలిచ్చేది. మంచి ఆవును వదులుకోవడానికి అయ్య ఎందుకు ఒప్పకున్నాడో,' అర్థంకాని తండ్రి అసహాయస్థితిపై కొమరయ్య ఆలోచించసాగాడు.

దూరం నుండి తండ్రి పిలుపు వినవచ్చింది. గుడిసెలో నుండి బయటికి వచ్చాడు. కోటయ్య వస్తూనే వంగతోటలో చెట్లను పరిశీలించాడు. "ఆనగపు తీగెను మళ్ళేసి చూడు. ఏమైన పిందెలు పడ్డయేమొ!" కొమరయ్య నుద్దేశించి అన్నాడు కోటయ్య.
కొమరయ్య తీగెలను మళ్ళేస్తూ, "ఎన్ని తెంపమంటవు," బిగ్గరగా తండ్రిని అడిగాడు.
"తెంపకు. నేను వచ్చి చూస్తా," అంటూ కోటయ్య తీగెవైపు వెళ్ళాడు. తీగెలకు అక్కడక్కడ ఉన్న పిందెలను చూస్తున్నాడు.

'ఆవును ఎందుకిస్తున్నావయ్య," బరువైన ధ్వనితో కొమరయ్య అడిగాడు.
కోటయ్య చకితుడై గంభీరంగా కొడుకును చూస్తూ- "కండ్లు ఉబ్బినయేం? ఏడ్చినావు? ఎందుకురా?" జాలిగా అడిగాడు.
"ఆవును ఇయ్యకయ్య," కొమరయ్య బ్రతిమిలాడినట్లు అన్నాడు.
"వద్దంటే ఆగుతదా, పిచ్చోడా. నాకు మాత్రం ఇయ్యాలని ఉంది? దొర అడిగిండు, ఇస్తున్న అంతే."
"ఇవ్వనంటే దొర ఊరుకోడా?"
"ఇయ్యన్ని నీకెందుకులే ఇప్పట్నుంచి. ఇంకో మంచి ఆవును తెచ్చుకుందాం."
"ఆ తెచ్చే ఆవును దొరకియ్యరాదే."
"ఇయ్యాల దొర అల్లుడొస్తున్నాడట. రేపు అల్లుడిని బిడ్డను సాగనంపుతారు. వాండ్లతో మన ఆవు కూడా పోతది. బిడ్డకు ఇస్తాడట, మన ఆవును," అంటూ కోటయ్య ఆనగపు తీగెలకున్న పిందెలను కొడుక్కు చూపాడు. "ఆ పిందెలు తెంపి, మిరపతోట్లో ఇన్ని మిరపకాయలు తెంపుతుండు. బిరాన దొరకు పంపాలె. పొద్దెక్కుతున్నది," అంటూ కోటయ్య వంగతోట వైపు వెళ్ళాడు.

కొమరయ్యకు గాయం మీద కారం చల్లినట్లయింది. 'మా అయ్యకు పిచ్చి లేశినట్టుంది. అన్నీ దొరకే కావాల్నట,' అన్నట్లు వింతగా తండ్రిని కొద్దిసేపు చూచాడు. ఆనగపు పిందెలు చేతపట్టుకొని మిరపతోట వైపు వెళ్ళాడు. కోటయ్య కూరగాయలు తీసికొని వెళ్ళిపోయాడు.
కొమరయ్య తిరిగి ఆలోచించ మొదలుపెట్టాడు. పక్కనే ఉన్న కంచె వైపు దిగాలుపడి చూస్తున్నాడు. ప్రతిరోజు ఆవును కంచెలో తోలి బావిగడ్డ మీద చూస్తూ నిలుచునే కొమరయ్యకు, ఆరోజు ఆవు లేకుండా కనబడ్తున్న కంచె జాలిగొలిపింది. 'ఇక ఆవు ఈ కంచెకు రాదు. ఈ ఊళ్ళోనే ఉండదాయె,' ఒక నిట్టూర్పు విడిచాడు. కంచెను దిగాలుపడి చూస్తున్నాడు.

కంచెలోని చెట్లలో ఎవరో పిల్లవాడు తిరుగుతున్నాడు. ఎవరా అని చూస్తు న్నాడు కొమరయ్య. ఆ పిల్లవాడు మోదుగుచెట్లలో అటు యిటు తిరుగుతున్నాడు. చేతిలోని గై కత్తిని అటూ ఇటూ తిప్పుతున్నాడు. కొమరయ్య కంచెదోవ పట్టాడు. కంచెలోని పిల్లవాడు కొమరయ్య రాకను కనిపెట్టాడు. అంగీతో కండ్లు తుడుచు కున్నాడు. కొమరయ్య వస్తున్నవైపు చూస్తూ నిలుచున్నాడు.

కొమరయ్య దగ్గరికి వెళ్ళి, "ఓ నువ్వా? ఎన్నడులేంది ఇయ్యాల ఇదేంపని? ఇయ్యాల బడికిపోలే? పంతులు నిన్నొదిలిండా?" ప్రశ్నలు కురిపించాడు.
ఆ పిల్లవాడు నిరుత్తరుడై దిగాలుపడి కొమరయ్యను చూస్తున్నాడు.

"ఆకులు తెంపుత," కొమరయ్య గై కత్తితో మండలు కోయసాగాడు. ఆ పిల్లవాడు ఉబికి వస్తున్న దు:ఖాన్ని ఆపుకోలేక బావురుమని ఏడ్చాడు. కొమరయ్య దిగాలుపడి గై కత్తి కింద పడవేసి, ఆదరంతో, "ఎందుకు ఏడుస్తున్నావ్," అన్నాడు.
"మా అమ్మ నన్ను బళ్ళోంచి బలవంతంగా తీసికొచ్చి ఇక్కడికి పంపింది," గద్గద స్వరంతో అన్నాడు ఆ పిల్లవాడు.
ఆ పిల్లవాడు వైష్ణవుడు. అతని పేరు కంఠీరవం. అతని గురించి బడిపిల్లల తల్లిదండ్రులంతా వింతగా చెప్పుకున్నారు. అక్షర స్వీకారం జరుగకుండానే అతని చదువు మొదలైంది. బడిపంతులు అతనంటే ప్రాణాల్ని వదిలేవాడు. కంఠీరవం బడిలో ఉన్నంతసేపు పంతులు ఒళ్ళోనో, కుర్చీ మీదనో, బడి లేనప్పుడు పంతులు ప్రక్కమీదనో, పంతులమ్మ ఒళ్ళోనో గడిపేవాడు. పంతులు కులానికి మహమ్మదీయుడైనా కంఠీరవం గ్రామ అగ్రజాతివాడైనా వారి పరస్పర ప్రేమ, వాత్సల్యాలు ఆ గ్రామంలో ఒక విశేషంగా చెప్పుకొనేవారు. ఇంట్లో తల్లిదండ్రులు కోప్పడినా, ఇష్టంకాని పని చెప్పినా చెప్పకుండా కంఠీరవం పంతులు వద్దకు చేరేవాడు.

ఆనాడు కంఠీరవం మామూలుగా బడికి వెళ్ళాడు. కాని పంతులు పరగ్రామం వెళ్ళినందున పిల్లలంతా ఆడుకొంటున్నారు.
కంఠీరవం తల్లి ఆండాళమ్మ బడికి వచ్చి, కంఠీరవానుద్దేశించి, "ఇటురా తండ్రి," అని పిలిచింది. బడి కడపలో నిలుచుండి, "ఎందుకే?" ప్రశ్నించాడు కంఠీరవం. "ఏమీలేదు నాయనా! ఇన్ని మోదుగు ఆకులు తెచ్చిపెట్టాలె కొడుక," ఆండాళమ్మ బ్రతిమిలాడింది.
"నేను రాను," అని కంఠీరవం, గిదగిద ఉరికి, పొయ్యివద్ద వంట చేసు కుంటున్న పంతులమ్మ వీపుపై పడ్డాడు. గట్టిగా కౌగలించుకున్నాడు.

మహమ్మదీయుల ఇంట్లో అడుగుపెట్టడమే ఆండాళమ్మకు కష్టంగా ఉంది. కాని ఏం చేస్తుంది? ఇరవై ఇస్తళ్ళు కుట్టి రామభూపాలరావు దొర ఇంటికి పంపాలె. దొర ఇంటికి చుట్టాలు వస్తున్నారు. అవసరమున్నపుడల్లా ఆ విధంగా కుట్టి ఇవ్వడం మామూలు. తోరణం ఆకుల్తో కుట్టి ఇస్తామంటే, పచ్చి ఆకులు దొరకుతున్నప్పుడు, తోరణం ఆకుల్తో వద్దని ఇస్తళ్ళు కావాల్నని చెప్పవచ్చిన ఆడబాపవాడు అన్నాడు.

ఆండాళమ్మ భర్త రఘునాథాచార్యులు, పెద్దకొడుకు వెంకటాచార్యులతో దేశ సంచారానికి వెళ్ళాడు. అందువల్ల ఆండాళమ్మ విధిలేక ఆరాటంతో బడికి వచ్చింది. కంఠీరవం రానంటున్నాడు. మహమ్మదీయుల ఇంట్లో, పైగా పొయ్యి వద్ద చేరాడు. ఆండాళమ్మ బహుకష్టంగా ఒక్కొక్క అడుగు వేసుకుంటూ పెరట్లో నుండి వంట ఇంటి

కడప వద్దకు వెళ్ళింది. పంతులమ్మ కోడిగుడ్లు పగులకొడ్తున్నది. ఆండాళమ్మ ముఖం తిప్పుకుని, మూతికి కొంగు అడ్డుపెట్టుకుని, "మా పిల్లవాడిని బయటికి పంపమ్మ కాస్త. ఇంట్లో ఎవరు లేరు," అన్నది.

"నీ కొడుకును నేను పట్టుకున్నానా!" నవ్వుకుంటూ పంతులమ్మ అన్నది.
"నేను పోవాలె తల్లి, చాలా పొద్దెక్కిపోయింది," అంటూ, "వస్తావా రావా?" గద్దించింది కొడుకును.
కంఠీరవం పంతులమ్మకు దూరంగా మంచం మీద చేరి, "నేను రాను," అన్నాడు. బోర్ల పడుకొని కొంటెగా తల్లిని చూచాడు.
"ఏం చెయ్యను వీడితో? పదిహేను, ఇరవై ఇస్తళ్ళు కుట్టివ్వాలె. ఎక్కడి పని అక్కడే ఉంది. ఇంట్లో ఒక్క ఆకు చింపు కూడా లేదు. వీడేమో మంకు చేస్తున్నాడు," ఆండాళమ్మ ఆరాటపడింది.

"పోరాదు నాయన, పంతులు పగటికి వస్తాడు. అందాకా ఇంటికి పొయ్యి అమ్మ చెప్పిన పని చెయ్యి," అంటూ పంతులమ్మ కంఠీరవాన్ని సమీపించ బోతుండగా, "కొంచెం చేయి కడుక్కొని పట్టుకరా అమ్మ," ఆండాళమ్మ పంతు లమ్మకు ఆచారవిధిని తెలిపింది.
పంతులమ్మ ముసిముసిగా నవ్వింది. ఆండాళమ్మను ఒరకంటితో చూచింది. చెయ్యి కడుగుకొని కంఠీరవాన్ని అమాంతంగా ఎత్తుకొని, "పోయిరా పో నాయనా," అని ముద్దు పెట్టుకొన్నది.
"బాగుంది గారాబం. దున్నపోతున్నట్టున్నాడు. ఎందుకెత్తుకున్నవు? కడుపు నొప్పి లేస్తుంది," అని పైకి మాత్రం అన్నది. కాని తన కొడుకుపై పంతులమ్మ చూపే ప్రేమకు లోలోన ఆనందించింది ఆండాళమ్మ.
"ఎందుకమ్మ దున్నపోతంటారు? బంగారంలాంటి కొడుకును? మాకిచ్చే యండి మేము సాదుకుంటాం," అని పంతులమ్మ కంఠీరవాన్ని కిందికి దింపింది. "అన్నం తినగానే పంపండి. వస్తావు కదు," పంతులమ్మ గారాబంగా కంఠీరవాన్ని చూచింది.
కంఠీరవం ముఖం మాడ్చుకొని, తల్లి చేయి పట్టుకొని ఇంటికి వెళ్ళాడు. ఆండాళమ్మ బస్తా సంచి పైకెత్తి ఇచ్చి విస్తరాకులకు పంపింది. పిల్లల సాయంతో, ఁన్నపోతు మీద ఎక్కించి, కాల్వ దాటిందాకా ఇవతలి ఒడ్డున నిలుచున్నది ఆండా ళమ్మ. కంచెకు వెళ్ళే వరకు అక్కడ కొమరయ్య సాహచర్యం దొరికింది. కొమరయ్య మండలు కోస్తున్నాడు. కంఠీరవం మండలు ఏరి ఒకచోట కుప్ప చేస్తున్నాడు. తర్వాత ఇద్దరూ కూర్చొని మండ నుంచి ఆకులు తుంచ మొదలుపెట్టారు.

"మా అయ్య మా ఆవును దొరకిచ్చిండు," కొమరయ్య అన్నాడు.
"మీకు మరి?" కంఠీరవం వెంటనే ఆవేదనతో అడిగాడు.
"మా అయ్య ఇంకోటి తెస్తానన్నాడు. కాని ఎన్నడులేంది నువ్వు ఇయ్యాల ఇస్తరాకుల కొచ్చినవెందుకు?"
"మా నాయనగారు, అన్నయ్య సంచారం పోయిన్రు. ఇవ్వాళ దొర యింటికి చుట్టాలొస్తున్నారట. మా అయ్య మిరపకాయలు, ఆనగపు పిందెలు, వంకాయలు తీస్కపోయిండు."

ఆలోచనాధోరణిలో- "ఊఁ మీరు కూరగాయలు, ఆవును ఇస్తున్నారు. ఇస్తళ్ళు మా అమ్మ కుట్టిస్తున్నది. వాండ్లింటికి చుట్టాలొస్తే అంతా మనకే వచ్చిందే!" అన్నాడు కంఠీరవం.

"అదే నిన్నడుగుదామనుకుంటున్న. దొరకు గతిలేదా యేం? ఆ చుట్టాల తోటి మా ఆవును పంపుతాడట."

"ఎందుకు?"

"మా ఆవును దొర తన బిడ్డకు ఇస్తాడట."

"మీ ఆవును దొర బిడ్డకు ఇవ్వడమేమిటి?"

"అవన్నీ అడుగొద్దంటాడు మా అయ్య."

"మనం ఏమీ అడుగొద్దంటే, మనతో ఆ దొరకు పని చేయించడమెందుకో! మరి అయితే ఇస్తళ్ళు కుట్టడానికి మా అమ్మను కూడా దొరబిడ్డ వెంట తోల్తారేమో!"

"ఏమో! మీ అమ్మను అడుగు."

"అడుగుత. మా నాయనగారు, మా అన్నయ్య కూడా ఊళ్ళోలేరు. మా అమ్మ కూడా లేకుండాపోతే నాకు అన్నం ఎట్ల?"

"బడిపంతులు ఉన్నాడుగా?" కొమరయ్య నవ్వుతూ అన్నాడు.

"ఛా! అతడు తురకనాయె. వాండ్లు గుడ్లు, చేపలు తింటారు. నేను తినకూడదాయె."

"వేరే వాండ్లతో వేరే ఏమన్న వండించి పెడ్తడు పంతులు."

"అవును. అది కూడా అమ్మను అడుగుత."

మాటల్లో మొత్తం ఆకులు తుంచారు. తర్వాత ఇద్దరు ఆకులను సంచిలో నింపారు. కంఠీరవం కాసేపు, కొమరయ్య కాసేపు కొంతదూరం సంచిని మోసు కుంటూ వచ్చారు. ఇద్దరూ అలసిపోయారు. ఆ సంచిని గైకత్తికి మధ్యన కట్టారు. కావడిగా చేసి ఇద్దరూ చెరొకవైపున భుజాన పెట్టుకొని కాల్వవరకు వచ్చారు. దున్న పోతుల సాయంతో కాల్వ దాటారు. మళ్ళా కావడిగా చేసుకొని కంఠీరవం ఇంటికి చేరారు.
ఇంటికి వచ్చేవరకు ఆండాళమ్మ విస్తరి పుల్లలు చీరుకు కూర్చున్నది. విస్తళ్ళు కుట్టడానికి సహాయానికై పిలిపించుకున్న సాతాని మంగమ్మ కూడా పుల్లలు చీరుతున్నది.

ఆండాళమ్మ లేచి, "తెచ్చినావు కొడుక," అన్నది. సంచి తెచ్చి మంగమ్మ కూర్చున్నచోట విప్పి ఆకులు కుమ్మరించింది. "నీకెవరో జంట దొరికిన్రే?" కొమ రయ్యను చూస్తూ, "ఎవరి కొడుకువు పిల్లగా," అడిగింది.

"మొదట బళ్ళో నాతోటే చదివిండే. ఇప్పుడు బడికి రావటం లేదు. బాయి దగ్గరికి పోతున్నడు," కంఠీరవం సమాధానమిచ్చాడు.

"మీ నాయన పేరేంది పిల్లగా?" సాతాని మంగమ్మ అడిగింది.

"గొట్టం కోటయ్య."

"మీ ఆవునేనా దొర తోలకపోయింది?" మంగమ్మ ఆతురతతో అడిగింది.

బిక్క ముఖంతో, "అవును," అన్నాడు.

కొమరయ్య, కంఠీరవం ఆకుల తొడిమలు తీస్తూ కూర్చున్నారు.

"నేను చెప్పలేదా? ఇదే సంగతి. పాపము! బిడ్డడు కడుపునిండా పాలు తాగిండో లేదో!! మొన్న మొన్ననే ఈనిందట. ఎవడి కంట్లో మన్ను పోసుకున్నడో, పాలు బాగా యిస్తుందని దొరకు తెలిసింది. ఇంకేముంది? కావాలన్నాడు," మంగమ్మ మూతి విరిచింది. తొడిమెలు తీసిన ఆకులు కింద మీదు చేస్తూ పెద్ద ఆకులు ఏరింది.

"అమ్మా! దొర బిడ్డ ఊళ్ళో ఇస్తళ్ళు కుట్టివ్వడానికి దొర నిన్ను పొమ్మంటే పోతావా? నాకు అన్నం ఎవరు పెడ్తారు? పంతులు తురకనాయె. ఆయనింట్లో తినకూడదాయె," కంఠీరవం అడిగాడు.

"మా ఆవును దొరబిడ్డతో పంపుతారట," కొమరయ్య అన్నాడు.

"అదా సంగతి? చూచావమ్మా? పోరడు గింత వున్నడో లేదో అన్నీ తెలుసు కున్నడు. బిడ్డకు అరణం ఇస్తున్నాడు గామాలు ఆవును," మంగమ్మ ఆశ్చర్యంగా అన్నది. విస్తళ్ళు కుట్టసాగింది.

"మరి నిన్ను గూడ రమ్మంటారా అమ్మ," తిరిగి కంఠీరవం అడిగాడు.

"పిచ్చితండ్రి! ఆ ఊళ్ళో ఇస్తళ్ళు కుట్టేవాండ్లున్నారు. నేనేం పోను," అని ఆండాళమ్మ తల నిమిరింది. "నీకు అన్నీ ఆదుకోవడానికి పంతులు, పంతులమ్మ లేరు? అక్కడే తిను," ముసిముసిగా నవ్వుతూ ఆండాళమ్మ అన్నది.

"అయితే, ప్రతి ఊళ్ళో ఇట్లా కుట్టేవాళ్ళుంటారా అమ్మ?"

"ఉంటారు, ఎందుకుండరు? మీ తాత కాలంలో ఈ దొర తండ్రిని ఆశ్ర యించుకొనే ఇక్కడికి వస్తిమి. ఆ దొర చచ్చి స్వర్గంలో ఉన్నాడు. మహారాజు చెరువు కింద నిక్షేపంలాంటి పొలమిచ్చిండె. ఓ అయ్యను ఆశ్రయించకుండా గుట్టుగా కాలం వెళ్ళేది. ఆ దొర చచ్చిండు. పొలం పోయింది. కాని మంగమ్మా! చాకిరి మాత్రం తప్పటంలేదు. అక్షరజ్ఞానం లేని పెద్దవాడిని వెంటేసుకొని పెద్దమనిషి ఇల్లనక, వాకిలనక, ఒళ్ళనక దేశాలు తిరిగితేగాని ఈమాత్రం సంసారం నడవటం లేదు. నీకు తెలియదా మంగమ్మ? ఆ దొర చచ్చిం తర్వాత ఒకటికొకటి విపరీతాలు పుట్టుకొస్తున్నాయి కాని," ఆండాళమ్మ అంటుండగా గుడ్లలో నీళ్ళు తిరిగాయి.

"నీకు ఎరికే ఉండొచ్చు. మొన్న కిస్తులో మా ఇంటాయనను ఫజీతా చేసి వసూలు చేసిన సంగతి," మంగమ్మ తన ఇబ్బందిని తెలుపుకొంది.

"చచ్చిన దొర రోజులలో గడీలో ఏది జరిగినా ఊరంతా పెండ్లి వోలె ఉండేది. ఆ మామూళ్ళు, మర్యాదలు ఇప్పడు లేకపోయినా సాగించుకోవడం మాత్రం తప్పడం లేదు," ఆండాళమ్మ అన్నది.

"అవును. అంతే. ఇంగువ కట్టిన గుడ్డ," మంగమ్మ తోడు పలికింది.

"చిన్న, పెద్ద విచక్షణ లేకుండా కూడా పోతున్నది మంగమ్మ. నీవేమన్నా అను, ఆ దొర లేమంటారో ఏమోకాని మధ్య ముండాకొడుకులున్నారే, ఒక్కొక్కడు మిడిసిపడిపోతున్నారు. ఇస్తళ్ళు కావాలని చెప్పవచ్చిన ఆడబాప రంగడు కూడా మాట్లాడే పద్ధతి చూస్తే నాకు ఒళ్ళు మండిపోయింది," ఆండాళమ్మ అన్నది.

మంగమ్మ, ఆండాళమ్మ సంభాషణ శ్రద్ధగా వింటూ కొమరయ్య, కంఠీరవం అప్పుడప్పుడు ఒకరి ముఖాలు ఒకరు చూచుకొంటున్నారు.
"వాండ్లనంటే ఏం లాభం? సాగే అవకాశముంటే సాగుతుంటుంది. పై వాండ్ల ఆసరా ఉంటేనే కింది వాండ్లు ఎగురుతుంటారు. ఇంతకు ఎన్ని అయినట్లు విస్తళ్ళు? మావాడు పొద్దున ఏమీ తినకుండానే పోయిండమ్మ బడికి. రోజు ఏం పెడ్తాం? ఎక్కడ నుంచొస్తాయ్. నోటిలో తడిలేని పుటకలు. ఇంకా అయిదు విస్తళ్ళు కుట్టి పోతానమ్మ," మంగమ్మ విస్తళ్ళు లెక్కపెడ్తూ అన్నది.

ఆకుల తొడిమెలు తీస్తున్న కంఠీరవం, "మడి ఎప్పుడే కట్టుకునేది," తల్లి నడిగాడు.
"ఇవి కావొద్ద కొడుక. కొడుకు ఎన్నడు లేంది ఆకులకు పోయిండమ్మ. కొడుకు ఎంత కష్టపడ్డడో," కంఠీరవం నెత్తిని నిమురుతూ తల్లి అన్నది.
"అయితే నేను పంతులు దగ్గరికి పోతా, పంతులు వచ్చుండొచ్చు. లే కొమరయ్య పోదాం రా," అని కంఠీరవం లేచి నిలుచున్నాడు.
"నేను బడికి రాను, పంతులు కోప్పడతాడు. మా అయ్య నన్ను బళ్ళోంచి తీసినప్పుడు మా అయ్యతో పంచాయితి పెట్టుకుండు.
"సరే అయితే, ఇంటికి పో," అని కంఠీరవం బడిదోవ పట్టాడు.
కొంతసేపట్లో ఆడబాప రంగడు విస్తళ్ళ కొరకు వచ్చాడు. గదిలోకి కావలసిన మొత్తం విస్తళ్ళు ఇరవై అయినా కుట్టి ఉన్న ఇరవై మూడు విస్తళ్ళు కూడా అవసరముందని తీసికెళ్లాడు. ఒక విస్తరి చేత బట్టుకపోదామనుకున్న మంగమ్మ నిరుత్సాహంతో ఏదో గొణుగుకుంటూ ఇంటికి పోయింది. "ఏదో వైపరీత్యానికే వచ్చింది," ఆండాళమ్మ తనకు తానే అనుకుంటూ ఇంటిలోకి వెళ్ళిపోయింది.

కంఠీరవం తండ్రి రఘునాథాచార్యులు తండ్రితోపాటు ఆ గ్రామం చేరుకొని ఎంతోకాలం అయింది. రామభూపాల్‌రావు తండ్రి భుజంగరావు బ్రతికి ఉన్న ప్పుడు, రఘునాథాచార్యులు చాలా మన్ననలు పొందాడు. రఘునాథాచార్యులు యొక్క పాండిత్య ప్రతిభను మిక్కిలి కొనియాడేవారు. భుజంగరావు మరణించిన తర్వాత రామభూపాల్‌రావు వ్యవహారం, పద్ధతి రఘునాథాచార్యులకు నచ్చలేదు. రఘునాథాచార్యుల అసంతృప్తికి ప్రబలమైన ఏ కారణం లేకపోయినా రామ భూపాల్‌రావు మాటల వైఖరి, ప్రజలతో వ్యవహరించే విధానం, వ్యక్తిగత జీవితం మొదలైన అతని దైనందిన జీవిత విధానమే రఘునాథాచార్యులకు ఏవగింపుగా తోచింది. ముఖ్యంగా భుజంగరావులో కనిపించిన విశాలభావము, ఠీవి, మర్యాద, మన్నన, విచక్షణా జ్ఞానము రామభూపాల్‌రావులో లేవని రఘునాథాచార్యులు తెలుసుకున్నాడు. దానితో రామభూపాల్‌రావు అంటే

రఘునాథాచార్యులకు ఒక విధమైన నిర్లక్ష్యము, నిరసన భావం ఏర్పడింది. రఘునాథాచార్యులకు చదువు కొన్నాననే ధీమా, గర్వము ఎక్కువ ఉందని రామభూపాల్‌రావుకు ఒక అభిప్రాయ మేర్పడింది. ఈ విధంగా పరస్పరం సుముఖత లేకుండా కొన్నాళ్ళు గడిచాయి. ఇట్టి వాతావరణానికి తోడు రామభూపాల్‌రావు బిడ్డ పెండ్లి సందర్భమున జరిగిన ఒక సంఘటనలో రామభూపాల్‌రావుకు, రఘునాథాచార్యులకు ఇంకా బెడిసి పోయింది.

పెండ్లి ఆడంబరం, అట్టహాసంతో ఊరి ప్రజలంతా ఉబ్బితబ్బిబ్బైపోయారు. పనిపాటలవాండ్లకు ఊపిరి మెసలకుండా అయిపోయింది. పెండ్లి అయిదురోజు లకు కావల్సిన కూరగాయలు అందించే బాధ్యత రైతులకు ఒప్పజెప్పబడింది. ప్రజలు తమ ఇండ్లలోని పాల నుండి వెన్నను భద్రపరచి నెయ్యి సిద్ధం చేయించి వీలున్న ప్రతిచోట మంచి నెయ్యి సేకరించి అందించే బాధ్యత, పెండ్లి రోజుల్లో సామానుగది నిర్వహించి తినుపదార్థాలను అందించే బాధ్యత గ్రామవైశ్యుల నెత్తిన బడ్డది. గ్రామంలో ఉన్న బల్లెపీటలు, మంచాలు అతిథుల అవసరాలకై ప్రత్యేకించ బడ్డవి. అతిథుల పశువులకు మేత కొరత రాకుండా చూచే బాధ్యత కొందరి రైతులకు అప్పగించబడ్డది. వీధుల పరిశుభ్రత, గుర్రాలను అరుచుకొనే భారం బేగారివాండ్లపై బడ్డది. ముఖ్యంగా ఆ పెండ్లి దిగ్విజయంగా జరిగి, రామభూపాల్‌రావు ఘనతకు ఏలాటి లోటు రాకుండా చూచే బాధ్యత గ్రామ ప్రజల కర్తవ్యంగా నిర్ణయించబడ్డది. ఆ పెండ్లిని గురించి, అందుకై చేస్తున్న సన్నాహాలను గురించి, జరుగబోయే వినోదాలను గురించి, చుట్టుపట్ల పది గ్రామాల వరకు ప్రజలు వింతగా చెప్పుకున్నారు. మంగళగిరి నుండి సన్నాయిమేళాన్ని, బెజవాడ నుంచి ప్రవీణులైన సంగీత పాటకు లను, కూచిపూడి భాగవతుల వాండ్లను, హైద్రాబాదు నుండి బ్యాండువాండ్లను, నౌబత్‌వాండ్లను భోగం మేళాన్ని పిలిపించాడు. తోటలో ఉన్న బంగళా అధికారులకు అతిథిగృహంగా ఏర్పాటు చేయబడ్డది. విశాలమైన ధర్మశాల భోగంవాండ్లకు నివాస స్థలంగా మార్చబడ్డది. రఘునాథాచార్యుల యింటి ముందర, పెరట్లో పందిళ్ళు వేయించి వైష్ణవులకు, గడి వెనుకనున్న తోటలో శైవులకు వసతి, భోజన ఏర్పాట్లు చేయబడ్డవి. రామభూపాల్‌రావు ఇంటి నుండి తోట వరకు వెళ్ళే మార్గంలో ఇండ్ల వాండ్లందరూ వారివారి ఇండ్లకు అలుకులు, సున్నాలు, తోరణాలతో అలంకరిం చాలని రామభూపాల్‌రావు ఆజ్ఞాపించాడు. ఇండ్లలో నుండి బయటికి నీరు రాకుండా జాలార్లు మూసివేయబడ్డవి. రామభూపాల్‌రావు స్నానము నీటివరద ఆ ఊరివారికి గడియారంవలె పనిచేస్తుంది. రామభూపాల్‌రావు స్నానముచేస్తే ఇండ్ల ముందర నుండి ప్రవహించే నీటివరద వడినిబట్టి ఆయా ఇండ్ల వాండ్లు ప్రొద్దు యొక్క గమనాన్ని అర్థము చేసుకుంటారు. ఇంచుమించు అరఫర్లాంగు వరకు ఆ విధంగా ప్రవహించే ఆ కాల్వ తోటమార్గాన్నే ఉండడంబట్టి, ఆ ప్రవాహాన్ని తాత్కాలికంగా వేరే సందులోకి మలిపివేసినారు.

పెండ్లినాడు పెండ్లికొడుకును ఎదుర్కొని వచ్చేటప్పుడు ఊరంతా పిల్లజల్ల, అడమగ కదిలిపోయారు. చుట్టుపట్ల గ్రామాల నుండి కూడా వందలకొద్ది ప్రజలు వచ్చారు. మొదట వరుసలో డప్పులవాండ్లు, కొమ్ములవాండ్లు, తర్వాత చుట్టుప్రక్కల గ్రామాలకు చెందిన సన్నాయివాండ్లు, పిమ్మట ప్రత్యేకంగా పిలిపించబడిన

సన్నాయివాండ్లు, ఆ తర్వాత బ్యాండువాండ్లు చుట్టూ రామభూపాల్‌రావు బంధువులైన యువకులు తమ గుర్రాలను బ్యాండు చప్పుడుకు అనుగుణంగా, నాట్యం చేస్తూ వలయాకారంగా తిరుగుతూ మెల్లమెల్లగా ముందుకు సాగు తున్నారు. వారి వెనుక నౌబత్ వాయిద్యము, దాని తర్వాత భోగం వారి పాటలు, కూచిపూడి భాగవతుల కీర్తనలు, ఆ తర్వాత బంధువులు, పరివారం, ప్రత్యేకా హ్వానితులు, వారి ననుసరిస్తూ వైష్ణవులు, శైవులు, సాతానివాండ్లు, భట్రాజులు- ఈ విధంగా ఊరేగింపు బయలుదేరింది. ఊరేగింపుకు రెండువైపుల ప్రజలు క్రిక్కిరిసి నిలబడి చూస్తున్నారు. అక్కడక్కడ అప్పుడప్పుడు రకరకాల మందులు కాల్చబడుతున్నాయి. ఆ ఊరేగింపు వల్ల ఒకవైపు ప్రజలకు ఆనందం కలుగు తున్నది. రెండోవైపు అంతమంది దొరల హడావుడిని చూచి భయం కూడా కలుగు తున్నది. ఆరోజు రాత్రి వివాహం చాలా వైభవంగా జరిగింది.

ప్రత్యేకంగా ఆహ్వానించబడిన మోహనాచార్యులు ఫిడేలుతో బెజవాడ నుండి లగ్నం అయిన మరునాడు మధ్యాహ్నం వరకు చేరుకున్నాడు. భోజనాల వేళైంది. ఇతర వైష్ణవులతోపాటు మోహనాచార్యులకు రఘునాథాచార్యుల ఇంటిలోనే బస ఏర్పాటు జరిగింది.మోహనాచార్యులు కనీకనబడనట్టు తిరుమణి చూర్ణముతో బొట్టు పెట్టుకున్నాడు. ఆయనా, అతని వేషం, ఆ క్రాపింగు ఆ మొత్తం వైష్ణవుల్లో వేరేసినట్టు కనుపించింది. భోజనానికై ఆయత్తపడుతున్న ఇతర వైష్ణవులు వింతగా మోహనాచార్యులను చూచారు. కొందరు గుసగుసలు సాగించారు. కొందరు కోపానికి వస్తున్నారు. వారిలో ఒకడు వస్తున్న కోపాన్ని పట్టలేక, "ఆ అప్రాచ్యుడితో పంక్తి భోజనానికి నేను ఒప్పుకోను. నేను కాదు, మీరెవ్వరూ కూడా ఒప్పుకోవద్దని నా అభిప్రాయం," అధికార ధ్వనిలో శాసించాడు. వడ్డన పనులలో లీనమైయున్న రఘునాథాచార్యులు ఆ నిర్ణయం సక్రమమైందేనని ఒప్పుకొన్నాడు.

"ఒక్కని గురించి అందరం మాదుగుల్లో కలవాల్నా?" ఇంకొకడు చేయూత నిచ్చాడు.
"సరే! బాగానే ఉంది, కాని మరి ముందు కర్తవ్యం ఏమిటో తేల్చివేయండి," ఇంకొకడు అందుకొన్నాడు.
ఒక్కొక్కరు ఇంటి వెనుక భోజనం పందిరి కింద తలా ఓ తీరు మాట్లాడు తున్నారు.
"దొరవారు పిలిపిస్తే వచ్చినవాడు కదా! మన వైఖరితో దొరవారికి కోపం రాదా?" ఒకడు ఆలోచనలో పడ్డాడు.
"అయితే? ఇందులో తిండి లేక పొట్టచేతబట్టుకొని వచ్చిందెవరూ లేరు. ఎవరి ఆచారాలు, గౌరవమర్యాదలు వాండ్లకున్నవి. మన కట్టుబాట్లు, సంప్రదా యాలు మంట కలిసింతర్వాత బ్రతికినా ఒక్కటే, చచ్చినా ఒక్కటే," రామభూపాల్ రావు ఆచార్యులైన తిరువేంగడాచార్యులు గట్టిగా అన్నాడు.
అతని ధోరణితో అందరికీ ఆత్మవిశ్వాసం కలిగింది.

"తిరువేంగడాచార్యులవారు సాయించింది చాలా బాగుంది. భ్రష్టులు కావ డానికి ఎవడు ఒప్పుకుంటాడు?" గుంపులో నుండి ఒకడన్నాడు.

"నే నిప్పుడే దొరవారిని పిలుపించుతాను. ఇందులో మనం చేస్తున్న తప్పేమీ లేదు. మంచిని మంచిగా చెడ్డను చెడ్డగా హితవు చెప్పుతూ, వర్ణాశ్రమ ధర్మాలు కాపాడబడేట్టు చూడాల్సింది మనం. రఘునాథాచార్యులవారు! మీరే వెళ్ళి దొరవారిని పిలుచుకు వస్తే బాగుంటుంది," తిరువేంగడాచార్యులు అన్నాడు.
రఘునాథాచార్యులు ఆతురతతో బయలుదేరాడు. యింటి ముందర పందిట్లో కూర్చుని ఉన్న మోహనాచార్యులను అసహ్యంగా చూస్తూ గడీ వైపు వెళ్ళాడు.

కొద్దిదూరాన ఉన్న ధర్మశాలలో భోగంవాండ్లు పాడుతున్న పాటలకు తన ఫిడేలుకు స్వరాన్ని తన మనస్సులో కలుపుకుంటూ మోహనాచార్యులు పగలు జరుగాల్సియున్న పాట కచ్చేరిలో ప్రదర్శించాల్సిన ప్రావీణ్యతకై పథకం వేసు కుంటున్నాడు.
రఘునాథాచార్యులు గడీలోకి వెళ్ళేవరకు దొరలంతా విస్తళ్ళ మీద కూర్చుని ఉన్నారు. వడ్డన జరుగుతూ వుంది. మెల్లగా రామభూపాల్‌రావును సమీపించి, "మిమ్ములను తిరువేంగడాచార్యులుగారు అందాక రమ్మంటున్నారు," అన్నాడు.

"ఇంకా మీరు ఇక్కడే ఉన్నారే. ఇంకా సాపాట్లు కాలేదన్నమాట. అప్పటి నుంచి ఏం చేస్తున్నారు?" అని రామభూపాల్‌రావు బయలుదేరాడు.
"ఆ సాపాట్ల విషయమే మిమ్ములను రమ్మనడం," రఘునాథాచార్యులు నడుస్తూనే సమాధానమిచ్చాడు.
మోహనాచార్యులు ఒక్కడే పందిట్లో కూర్చుని కూనిరాగాలు తీయడం రామభూపాల్‌రావుకు వింతగా తోచింది.
"మీకు సాపాటుకు చాలా పొద్దుపోయింది. చాలా దూరం నుండి వచ్చినారు. అలసి వుంటారు. వంట ఎప్పుడో అయింది కదా! ఇంకా ఆలస్యం ఎందుకవు తున్నదో అర్థం కావడంలేదు," మోహనాచార్యులతో అన్నాడు ఆరాటంతో. రఘు నాథాచార్యులను అనుసరిస్తూ పెరట్లోకి వెళ్ళాడు. మోహనాచార్యులు కూడా వెంట వెళ్ళాడు.

రామభూపాల్‌రావు సమీపించగానే తిరువేంగడాచార్యులు ఆచార్య పురుషుని ధీమాతో- "అయ్యా! నా కండ్ల ముందరే ఇట్టి భ్రష్టత్వం సంభవిస్తే చూచి వూరుకోలేను. అనుకోకుండా ఒకటి మా నెత్తి మీద తెచ్చిపెట్టి మమ్ములను పరీక్షిస్తున్నారా? పరీక్షించడానికి సమయం ఇప్పుడే దొరికిందా? (మోహనాచార్య లను చూపుతూ) వారు గొప్ప ప్రవీణులు కావచ్చును. వారి కళాకౌశలం మెచ్చుకో తగ్గది. కాని వారు జుట్టు పెంచడం, వారితో సహపంక్తి భోజనం చేయడం మాత్రం మేము ఒప్పకోం. ఇందులో మీరు బాధపడాల్సిందేమీ లేదు. నేను మీకు ఆచా ర్యుణ్ణి. దైవసమానుణ్ణి. ఆచార్య పురుషుడుగా మీకు హితవు చేయడం నా విధి. ఆ ప్రకారం మీరు నడవడం, శిరసావహించడం మీ కర్తవ్యం. ఇదీ సంగతి," గుక్క తిరగకుండా రౌద్రముతో ఏకరువు పెట్టాడు.

మోహనాచార్యులకు తల కొట్టినంత బాధ కలిగింది. ముఖం వెలవెల బోయింది. అతని జీవితంలో అలాంటి సంఘటన ఎన్నడూ జరగలేదు. వెంటనే ఊరు విడిచి వెళ్ళిపోదామన్నంత బాధపడ్డాడు. కాని

రామభూపాల్‌రావు అధికార బలాన్ని ఆసరా చేసుకొని నిలుచున్నాడు. ఫలిత మేమవుతుందో తెల్సుకుందామని నిర్ణయించుకుని ఓపిక పట్టాడు.
రామభూపాల్‌రావు మొత్తం వైష్ణవులను, మోహనాచార్యులను గంభీరంగా ఒకసారి చూచి, తల నేలకు వేశాడు. కండ్లలో నుండి నిప్పులు కురుస్తున్నాయి. కోపంతో వణికిపోతున్నాడు. "అయితే ఇప్పుడేమంటారు?" అధికార ధ్వనిలో అన్నాడు.

"ఇంకేమనమంటారు? జరుగవలసిన శుభకార్యం జరిగిపోయింది. సంతోషం. ఇక భోజనాల సంగతే కదా! ఈ ఒక్కపూట తినకపోయినంత మాత్రాన ప్రాణాలు పోతాయా? ఎవరి ఇండ్లకు వాండ్లు చేరుకుంటారు. సిద్ధం చేసిన వంట పనివాండ్లకో, కుక్కలకో వేయించండి," రఘునాథాచార్యులు అన్నాడు.
రామభూపాల్‌రావు కోపము మించిపోయింది. "ఆలోచించకుండ, ఆవేశం లో మాట్లాడుతున్నారా? శుభకార్యాలలో మీరన్నట్టు జరగడం మంచిదంటారా?" గుడ్లు మిటకరించి రఘునాథాచార్యులను ఉరిమి చూచాడు.

"మీ శుభానికేమి లోటు జరిగింది. మా ఖర్మ కాలింది కాని," రఘునాథా చార్యులు వెంటనే అందుకున్నాడు.
"నా శుభం మీ శుభంగా తలవని మీ మాటలు, నాకేమీ నచ్చటంలేదు," రామభూపాల్‌రావు గొంతు చించుకుని అరిచాడు.
"తనవాడిని పరాయివాడుగా తలచే ఈ వైష్ణవులతో తినడం కంటె మర్యాదగా మీ పంక్తిలో భోజనం చేయడమే ఉత్తమమనుకొంటాను," మోహనా చార్యులు రామభూపాల్‌రావు నుద్దేశించి అంటూ గిరుక్కున అక్కడి నుండి బయలుదేరాడు. రామభూపాల్‌రావు దెబ్బతిన్న పాము వలె బుసకొట్టుకొంటూ గడికి చేరుకొని మోహనాచార్యులకు ప్రత్యేకంగా ఒక గదిలో వడ్డన చేయించాడు. వైష్ణవుల పట్టుదల, మోహనాచార్యుల నిర్ణయం ఎంతవరకు సవ్యంగా ఉందో దొరలెవరూ వెంటనే నిర్ణయించలేక ఆలోచనలో పడ్డారు. వైష్ణవులంతా విజయో త్సాహంతో అయిదు రోజులు హాయిగా కాలం గడిపారు.
నాటి సంఘటన రామభూపాల్‌రావు అధికార గర్వానికి గొడ్డలిపెట్టుగాను, తన ఆచార్యత్వానికి అమోఘ విజయంగాను తలచి రాఘునాథాచార్యులు ఉబ్బిపోయాడు.

పెండ్లి సందడి ముగిసిన తర్వాత, రామభూపాల్‌రావు రఘునాథాచార్యు లను పిలిపించాడు. "మేమిచ్చిన భూమి మీద ఇక మీదట మీకేమీ జోక్యం ఉండబోదు. ఆ విషయం చెప్పుదామనే పిలిపించింది. ఇక వెళ్ళవచ్చు," అన్నాడు.
(మిగతా వచ్చే సంచికలో)

# ఆలోచనలు, అవగాహన: ముందుమాట

- కొడవటిగంటి రోహిణీప్రసాద్

( 'ఆలోచనలు, అవగాహన' అనే శీర్షిక తో కొడవటిగంటి రోహిణీప్రసాద్ గారు రాసిన శాస్త్రీయ వ్యాసాలు ప్రచురణ ప్రారంభిస్తున్నాం. ఈ సంచిక లో ముందుమాట మరియు 'బుద్ధి – భౌతికవాదం' అనే మొదటి వ్యాసం ప్రచురిస్తున్నాం. )

చాలా ఏళ్ళ క్రితం "చందమామ"లో రక్షరేకు అనే ఒక కథ చదివాను. అందులో ఒక కుర్రవాడు పిరికివాడని గ్రహించిన సహవిద్యార్థులు వాణ్ణి ఎప్పుడూ కొట్టి ఏడిపిస్తూ ఉంటారు. రోజూ ఏడుస్తూ ఇంటికొచ్చే కొడుకుకు సాహసం నూరిపొయ్యటానికని వాడి తల్లి తమ వంశపు శౌర్యప్రతాపాలను గురించి గుర్తుచేసి వాడి చేతికొక తాతలనాటి రక్షరేకు కడుతుంది. దాన్ని ధరించినంతకాలమూ తననెవరూ ఓడించలేరని నమ్మిన కుర్రవాడు అకస్మాత్తుగా సాహసవంతుడైపోయి అందరినీ చితకబాదెయ్యగలుగుతాడు. నిజానికి ఆ రక్షరేకులో మహత్తు ఏమీ లేదనీ, ధైర్యమనేది మనలో పుట్టుకురావాలనీ కుర్రవాడు చాలా రోజుల తరవాత గ్రహిస్తాడు. ఈ కథవల్ల రక్షరేకులవంటివి బూటకమని మనకు తెలుస్తుంది. అయినా వాటివల్ల కలిగే మంచిని నిరాకరించడం ఒక్కొక్కప్పుడు కష్టం. పై కథలో జరిగినదంతా కూడా మన మనసుల్లో ఉత్పన్నమైన భావాల ఫలితమే. విజ్ఞులైనవారికి ఎటువంటి "రక్షరేకుల" అవసరమూ లేదని నా ఉద్దేశం. తమను తాము మభ్యపెట్టుకోవటానికో, ఇతరులను మభ్యపెట్టటానికో ఇలాంటివి పనికొస్తాయి కాని వాటిలో అతీంద్రియశక్తులేవీ లేవని మాత్రం గుర్తుంచుకోవాలి.

ఈ నాడు ప్రపంచంలోనూ, విశ్వంలోనూ మన స్థాయి ఎటువంటిదో అందరికీ తెలుసు. రకరకాల జీవాలతో లుకలుకలాడే భూమి మీద మనంకూడా అన్నిటితోనూ సహజీవనం చేస్తున్నాం. ఎటొచ్చీ మనుషులకున్న భావనాపటిమ దృష్ట్యా తక్కిన ఏ ప్రాణికీ లేని శక్తులు మనకున్నాయి. పంటలను నాశనం చెయ్య ప్రయత్నించే పక్షుల్లాగా మనం దిష్టిబొమ్మలను చూసి బెదరం. నిజమేమిటో, కనుకట్టేమిటో పసికట్టగలం. సైన్సూ, టెక్నాలజీ ఊహించలేనంత స్థాయికి ఎదుగుతున్నాయి. అయినప్పటికీ చాలామందికి వాస్తవప్రపంచాన్ని గురించిన సరైన అవగాహన ఉన్నట్టుగా కనబడదు. మతాల పేరుతోనో, సంప్రదాయాల పేరుతోనో మధ్యయుగంలో జీవిస్తున్నవారే ఎక్కువ. ఎవరి నమ్మకాలు వారివి అని మర్యాదగా ఒప్పుకుంటాం కాని ప్రతి బుడబుక్కలవాడికీ దైవికశక్తులున్నాయని నమ్మేవారిని చూసి చాటుగా నవ్వుకోవడమూ కద్దు. ఈ నమ్మకాల్లో కొన్ని గుడ్డివనీ, తక్కినవి కొన్ని మాత్రం వివరించరాని, అతీంద్రియ శక్తులకు సంబంధించినవనీ అనుకునేవారున్నారు. నా లెక్కన అన్నీ ఒకటే. అంతకన్నా ఇబ్బంది కలిగించే విషయమేమిటంటే వాటి గురించిన ప్రత్యేక జ్ఞానమేదో తమకుందని చెప్పుకునేవారికీ లోటులేదు. వివరించలేని సమస్యలు లేవనికాదు. ఈనాటి మిస్టరీయే రేపటి సైన్సు అవుతుంది. ప్రస్తుతం అర్థం కాని విషయాలను గురించి పరిశోధించవలసి ఉందని చెప్పటానికి నిజమైన

శాస్త్రవేత్తలెవరూ సంకోచించరు. అన్నీ తమకే తెలిసినట్టు జ్ఞానోపదేశాలు చేసేవారే ప్రమాదకరంగా అనిపిస్తారు. వారిలో చాలామందికి సైన్స్ రంగంలో ప్రస్తుతం ఏం జరుగుతోందో కూడా తెలియదు.

అటువంటి భేషజాలకు పోకుండా ఆధునిక పరిశోధనలద్వారా బైట పడుతున్నవీ, అందరూ తెలుసుకోదగినవీ అనిపించిన కొన్ని విషయాలను ఈ వ్యాసాల్లో చర్చించే ప్రయత్నం చేశాను. ముఖ్యంగా మన జీవితాలను బలంగా తీర్చి దిద్దే ఆలోచనా ప్రపంచం గురించీ, మెదడును గురించీ గత పది, పదిహేనేళ్ళుగా విస్తృతమైన పరిశోధనలు జరుగుతున్నాయి. నేను శరీరశాస్త్రం వగైరాలేవీ చదువుకోలేదు. నా ఆసక్తి కొద్దీ సేకరించిన వివరాలను పాఠకులతో పంచుకుందామనే ప్రయత్నించాను. మరొకటేమిటంటే ప్రత్యేకంగా ఏ సంస్కృతినీ కించపరిచే ఉద్దేశం నాకు లేదు. ప్రస్తుత కాలంలో హేతువాద, భౌతికవాద దృక్పథం మనకు అత్యవసరమైనదని నా ఉద్దేశం. దీనితో అందరూ ఏకీభవించకపోవచ్చునని నాకు తెలుసు.

ప్రజాకళ సాహిత్య పత్రిక. దేశ విదేశాల్లో విద్యాధికులందరూ చదివే పత్రిక. వివేచనా, అవగాహనా వారికే ఎక్కువగా ఉంటాయి. ఈ వ్యాసాల్లోని విషయాలు అటువంటివారిని ఉద్దేశించి రాసినవే. మన సాహిత్యంలో సామాజిక సమస్యలను స్పృశించని రచన అంటూ ఉండదు. వీటిలో ఊహలకు సంబంధించిన సమస్యలు కూడా కలగలిసి ఉంటాయి. వ్యక్తిగతంగా నిరపాయకరంగా అనిపించే నమ్మకాలు సామూహికంగా ఎంత ప్రమాదకరంగా పరిణమిస్తాయో రోజు ప్రపంచమంతటా జరుగుతున్న మతహింస నిరూపిస్తూనే ఉంది. అందుచేత ఇటువంటి వ్యాసాలకు సాహిత్య పత్రికల్లో కాస్తంత చోటు లభించాలనే నా ఉద్దేశం. దీనికి అంగీకరించిన ప్రజాకళ సంపాదక వర్గానికి నా కృతజ్ఞతలు.

# బుద్ధీ, భౌతికవాదమూ

- డా. కొడవటిగంటి రోహిణీప్రసాద్

మన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని మనం పంచేంద్రియాల ద్వారా పరికిస్తాం. దానివల్ల జ్ఞానం పొందుతాం. మనం పుట్టినప్పటి నుంచీ బుద్ధి క్రమంగా వికసిస్తుంది. అనుభవాలు మనకు ఎన్నో విషయాలు నేర్పుతాయి. ముఖ్యం అనిపించినవి పెద్దవారి నుంచి నేర్చుకుని, చిన్నవారికి నేర్పుతాం. కనీసం 50 వేల సంవత్సరాలనుంచి మనకు అలవాటయిన సామాజిక జీవితం ఈ సంప్రదాయన్ని బలపరుస్తూ వస్తోంది. దీనికి తిరుగులేదు.

ప్రకృతి సహజంగా మనకు ప్రత్యక్షంగా నేర్పేది తక్కువే. అయితే పుట్టినప్పుడు మనకు సంక్రమించేదల్లా "అన్నీ" నేర్వగలిగిన మెదడు. అది కూడా మన ఆయుర్దాయంలో నాలుగోవంతు గడిచేదాకా ఎదుగుతూనే ఉంటుంది. మనిషి మనుగడకు అపారమైన తెలివితేటలూ, అనుభవమూ తప్పనిసరి కనక ప్రకృతిలో ఈ ఏర్పాటు కలిగింది. ఏ జంతువైనా పుట్టినప్పుడు నిస్సహాయంగానే ఉంటుంది కాని మనుష్యులు అపరిపక్వదశలో గడిపినంత కాలం మరే జంతువూ గడపదు.

మన ఇంద్రియాల్లో ముఖ్యమైనవి కళ్ళు. కేమెరాలాగా మన కన్ను కనబడే మూడు కొలతల ప్రపంచాన్ని రెండు కొలతల "తెర"పై చూపుతుంది. మనకు కనబడే వస్తువులు అన్నీ ఒకే దూరంలో లేవని శిశుప్రాయంలోనే మనకు తెలుస్తుంది. ఉయ్యాలలో ఉన్న పిల్లలు అదేపనిగా తమ చేతి వేళ్ళకేసి చూసుకుంటూ ఉంటారు. లేచి నడవలేకపోయినా వస్తువుల మధ్య దూరాన్ని పసికట్టడం క్రమంగా వారికి తెలుస్తుంది. "నేను", నా శరీరం" అనే భావనకూడా చాలా నెమ్మదిగా ఏర్పడుతుంది. ఈ "అహం" భావనే తరవాత "ఆత్మ" వగైరా అయోమయానికి దారితీస్తుంది. ఆటవిక దశలో సమష్టి జీవితం తప్పనిసరిగా ఉన్నప్పుడు మనిషుల భాషలో నేను అనే మాట ఉండేదికాదనీ, మేము, మనం అనే పదాలు మాత్రమే ఉండేవనీ పరిశోధకులు అంటారు.

వయసు పెరిగేకొద్దీ ఆలోచనలు రానురాను సంక్లిష్టమౌతాయి. ఊహ ప్రపంచానికీ యదార్థానికీ తేడా లేదేమో అన్నంతగా భావాలు "ఎదుగుతాయి". వీటివల్ల కొన్ని "ఆధ్యాత్మిక" భావనలు కలుగుతాయి. (ప్రకృతి మాయ. పురుషుడే యదార్థం). సామాజిక పరిణామంలో మార్పులు జరిగి, శరీరశ్రమ చెయ్యడానికి ఇతరులు దొరికినప్పుడు, ప్రకృతికి దూరంగా చేతికి మట్టి అంటకుండా బతకగలిగిన ఒక వర్గం ఏర్పడింది. రోజువారీ శ్రమ తప్పిన ఈ వర్గం ఆలోచనలనూ, మేధస్సునూ పెంపొందించుకుని, తాత్వికచింతనలో పడింది. దీనివల్ల గొప్ప వేదాంత తత్వాలూ, సాంఘిక దురన్యాయాలూ కూడా జంటగా మొదలయాయి. పరిపక్వత చెందిన మెదడు ఒక ఆదర్శం. దాన్ని మించిన యదార్థం లేదు. మనుగడ ఎంత ముఖ్యమో అవగాహనా అంతే ముఖ్యం.

ఈ నాటి విజ్ఞానం మరేదో చెపుతుంది. ఈ చైతన్యమూ, అవగాహనా నాడీమండలం ఉన్న కొన్ని ప్రాణులకే పరిమితం. ఇటువంటి గొడవలేవీ లేకుండా హాయిగా బతికేస్తున్న జీవాలు కొల్లలుగా కనిపిస్తాయి. "బుద్ధిలేని" ఈ ప్రాణులన్నీ మనకన్నా హీనమైనవి అనుకోవడానికి ఆస్కారం లేదు. అసలు బుద్ధి అవసరమా?

మన ప్రగతికే కాక అయోమయానికి కూడా ముఖ్యకారణం మన బుద్ధీ, నాడీవ్యవస్థా అనడంలో సందేహం లేదు. డార్విన్ సిద్ధాంతం చెప్పినట్టుగా సాగిన జీవపరిణామంలోని కొన్ని దశల్లో బుద్ధి వికాసం "తలవనితలంపుగా" జరిగింది. ఆలోచనల ప్రపంచంలో లేనిపే లేవు. దీనికి మన జీవితానుభవం నేర్పే కొన్ని విషయాలు తోడవుతాయి. మొదటిది కార్యకారణ సంబంధం. కుమ్మరి ప్రమేయం లేకుండా కుండలు వాతంటత అవే తయారవవు. ప్రపంచాన్ని "ఆడించి, శాసించే శక్తి" లేకుండా ఏదైనా ఎలా జరుగుతుంది?

తక్కిన ప్రాణులతో పోలిస్తే మనిషికి గల ప్రత్యేక లక్షణం తనను గురించిన స్పృహ, వివేకమూ. మతి భ్రమించినవారిని వదిలేస్తే తక్కినవారందరికీ అవగాహనా, మానసిక చైతన్యమూ సహజంగానే ఉంటాయి. మనకు కనబడి, వినబడుతున్నదంతా ఈ అవగాహనకు లోనవుతూ ఉంటుంది. ఎటొచ్చీ ఈ బుద్ధి అనేది మనుష్యులవంటి జీవరాశికే పరిమితమైనదా, లేక విశ్వంలో దీనికొకస్థానం ఉందా అనేది మాత్రం తేలని విషయమే. విశ్వాంతరాళంలో జరుగున్న సంఘటనలకు "ప్రేక్షకులు" ఉండవలసిన "అవసరమేమీ" కనబడదు. బుద్ధీ, అవగాహనా అనేవాటి అగత్యమేమీ లేదనిపిస్తుంది.

రిచర్డ్ ఫేన్‌మన్ చెప్పినట్టు ఎవరూ లేని అడవిలో ఒక చెట్టు కూలినప్పుడు చప్పుడయిందా లేదా? వినేవాడే లేనప్పుడు శబ్దానికి అసలు అర్థం ఉందా? ఉందంటాడు ఫేన్‌మన్. ఆ అదురు ఫలితంగా ఒకానొక ముల్లు మీద ఆనుకుని ఉన్న ఒకానొక ఆకు మీద గీతలు పడే అవకాశం ఉంది. ఆ క్షణంలో చప్పుడు విననివారు కూడా తరవాత ఆ ఆకు మీద పడిన గీతలను చూసి అక్కడేదో కంపించి ఉంటుందని ఊహించవచ్చు. మరీ బాగా పరిశీలిస్తే దానికి కారణం చెట్టు కూలడమే అని కూడా నిర్ధారించవచ్చు. భౌతిక సంఘటనలకు భౌతికమైన ఫలితాలు ఉంటాయి. తమ "అవసరం" కొద్దీ వాటిని పసిగట్టగలిగిన జీవాలు ఏవైనా ఉంటే అది యాదృచ్ఛికంగా జరిగిన సంఘటన మాత్రమే. అవి పసిగట్టడం అంటూ జరిగితే అది వాటి అవసరం వల్లనే. అలా పసిగట్టకపోయినా ప్రకృతికి కలిగే నష్టం ఏమీలేదు.

ఈ వ్యాసాల ఉద్దేశం మన కళ్ళెదుట జరిగిన, జరుగుతున్న పరిణామాలన్నీ యాంత్రిక, భౌతిక కారణాల వల్ల జరిగినవేనని గుర్తు చెయ్యటానికే. అద్భుతం అనిపించే విషయాలన్నీ కూడా చెట్టు నుంచి పండు రాలినంత స్వాభావికంగా జరిగినవేనని మనకు వెంటనే తట్టకపోవచ్చు. "అస్వాభావికంగా", "అసాధారణంగా" జరిగినట్టు నమ్మకంగా తెలిసిన విషయాలేవీ లేవు. మనం కనే అద్భుతమైన కలలూ, వినే "అతీంద్రియ" ధ్వనులూ,

“మనో నేత్రాలకు” కనబడే దృశ్యాలూ కేవలం మెదడు కలిగిస్తున్న గందరగోళం మూలంగా ఏర్పడినవి కావనేందుకు రుజువేమీ లేదు.
ఆధునిక విజ్ఞానం మిస్టరీలను విడగొట్టి పారేస్తోంది. తెలియనివాటి గురించి మిథ్యావాదులలాగా సిద్ధాంతాలను ప్రచారం చెయ్యదు. ఇటీవలి దాకా మన ఆత్మ శరీరం నుంచి వేరయి తన శరీరాన్ని తానే చూసిన సంఘటనల గురించి తర్జన భర్జన జరిగింది. ఔట్ ఆఫ్ బాడీ అనుభవాలనేవాటికి అర్థంలేదనీ, మెదడులోని ఒక భాగాన్ని స్పృశించినప్పుడు అటువంటి భావనలు కలుగుతాయనీ సర్జరీలో వెల్లడయింది. ప్రత్యక్షంగానో, పరోక్షంగానో మన మెదడు నేర్చుకున్న విషయాలే మరొక రూపంలో అప్రయత్నంగా మన అనుభవంలోకి వచ్చినప్పుడు ఏదో అద్భుతం జరిగిందన్న భావన కలగడంలో ఆశ్చర్యం లేదు. “పూనకం” వచ్చినవారికి ఒకరకమైన మూర్ఛరోగం ఉందని వైద్యులు చెపుతారు. సకాలంలో చికిత్స పొందకపోతే అలాటివారు రోగగ్రస్తులైపోతారు.

ఇప్పటి పరిస్థితులు ఎలా ఏర్పడ్డాయో వెనక్కు వెళ్ళి తెలుసుకోవడం ఈ వ్యాసాల ఉద్దేశం. ఉదాహరణకు మనిషికి మెదడే ప్రత్యేకం. ఇది ఎలా రూపుదిద్దుకుందో తెలియాలంటే ఇతర వానరాల, క్షీరదాల, జంతువుల గురించీ వాటి పరిణామం జరిగిన పద్ధతి గురించీ తెలుసుకోవాలి. ఇంకా వెనక్కు వెళ్ళి, మొదటి జలచరాలూ, బహుకణ ఏకకణ జీవులూ ఎలా పుట్టాయో అన్వేషించాలి. చివరకు భూమీ, సూర్యుడూ, నక్షత్రాలూ ఎలా ఏర్పడ్డాయో తెలుసుకోవాలి. మనకు తెలిసిన భౌతిక సూత్రాలేవీ అతిక్రమణకు లోనవకుండా జరిగిన ఈ పరిణామదశలన్నీ చూసినప్పుడు ఈ విశ్వం గురించిన “ఉద్దేశం” ఏదీ లేదనీ, ఇది ఎవరి “లీలా” కాదనీ అనిపించకమానదు. “పచ్చి” భౌతికవాదానికి తగిన ప్రత్యామ్నాయం లభించేదాకా హేతువాదులకు అది తప్ప మరో దారిలేదు.

# ‘కక్క’ నవల: పది దళిత మార్క్సిస్టు సూత్రీకరణలు

-జిలుకర శ్రీనివాస్

2000 లో ‘కక్క’ నవల వచ్చింది. ఆ ఏడు ఒక సహస్రాబ్దికీ ఒక శతాబ్దానికీ ముగింపు. ఈ నవల, ఆ వెయ్యేళ్ల జీవన పోరాటాల మీద ఒక తెలంగాణా తీర్పు. రానున్న శతాబ్దపు భవిష్యత్తుకు ఒక రాజకీయ కార్యక్రమం (పొలిటికల్ ప్రోగ్రామ్). మనకి రాజకీయ కార్యక్రమాల వంటి నవలలు ఉన్నాయి. కాల్పనికమైన రాజకీయ కార్యక్రమాలు ఉన్నాయి. మొదటి రకంలో జీవితం ఉండదు. రెండో రకంలో జీవం ఉండదు. ఈ రెండూ ఉన్న దమ్మున్న నవల కక్క.

అది దళిత సాహిత్యం ఆగిపోయినట్టుగా కనిపిస్తున్నదన్న ఆరోపణ ఊపు అందుకుంటున్న తరుణం. సరిగ్గా ఆ సమయంలోనే ‘కక్క’ , ‘అంటరానివసంతం’ వెలువడినాయి. ఇవి రెండూ వందేళ్ల దళిత సాహిత్యానికి వెయ్యేళ్ళ తెలుగు సాహిత్యానికి పరిపక్వ ఫలాలు. గడిచిన శతాబ్దం న్యాయంగానే శ్రీశ్రీది. కాకపోతే అది జరిగిపోయిన కథ కాదు. ఇంకా జరగాల్సిన కథ! అయితే, ఈసారి ఈ శతాబ్దం ఏ ఒక్కరికో చెందదు. అందులో అందరికీ జాగా ఉంటుంది. శ్రీశ్రీ మహదానందంగా అదే కరెక్టు అంటూ నేను సైతం అంటూ వంతపాడతాడు. ఆ అనామక శతాబ్దాన్ని చాటే మాదిగ డప్పు – కక్క నవల.

2

‘గుర్తింపు’ ఒక వ్యక్తికి గానీ సమూహానికి గానీ ‘ఉండే’ ఒక ధర్మం కాదు. గుర్తింపు ఒక సంబంధం. అందువల్లనే, అది వ్యక్తిగత లేదా ఆ బృందపు సొంత ఇష్టాయిష్టాలకి లోబడే విషయం కాదు. వ్యక్తులూ బృందాలూ తమని తాము ఫలానా అని నిర్వచించుకున్నంత మాత్రాన అది వారి గుర్తింపు అయిపోదు. సంబంధిత వ్యక్తులనో సమూహాలనో సంప్రదించకుండా అంటగట్టే లేబిళ్ళు కూడా గుర్తింపులు కాబోవు. అలాగని గుర్తింపులు స్వాభావికమైనవి కావు. స్థిరమైనవి అసలే కావు. అవి, సంబంధాల ఫలితాలు. కాబట్టే, సంఘర్షణల పోరాటాల వేదికలు కూడా. ‘గుర్తింపు’ కి నిర్దిష్టతని ప్రత్యేక లక్షణంగా ప్రధాన లక్షణంగా చూపడం మనకు బాగా అలవాటు అయిపోయింది. కానీ, భారీ గుర్తింపులని ( అంటే ఎక్కువమందినీ ఎక్కువ రకాలనీ ఇముడ్చుకోగలిగిన ) ‘ఐక్యత’ అనీ చిన్నవాటినీ బలహీనమైన వాటినీ గుర్తింపులనీ సూచించడం ప్రబలంగా ఉంది. గుర్తింపులు నిశ్చలమైనవి కావనే విషయం చాలామంది గుర్తించిన విషయమే. ఒకే వ్యక్తికి ఏకకాలంలో అనేక గుర్తింపులు ఉంటాయన్నది కూడా అందరికీ అనుభవమే. కాకపోతే, గుర్తింపు రాజకీయల తరుపున గానీ వ్యతిరేకంగా కానీ చేసే చాలా వాదనలు కుదింపువాదాలు. అవి, జీవితాచరణలో ఒక బృందం మరొక బృందంతో వ్యవహరించేటప్పుడు ఏర్పడే బహుముఖ అల్లికల సంక్లిష్టతలని అర్థం చేసుకోలేవు. వేముల ఎల్లయ్య నవలలో కనిపించే బహుళత్వం, వైవిధ్యం, అనేకత వంటివి ఇంద్రధనుస్సులాంటి అందం కాదు. తీవ్ర వ్యక్తివాదపు

‘పరస్పర పట్టనితనం’ కూడా కాదు. ఆయనది సమాంతర సహజీవనాల స్వప్నం కాదు. జీవిత అనివార్య మనుగడ మార్గం.

3

తెలంగాణ జాతీయ ఉద్యమాన్ని ‘ప్రాంతీయ’ చైతన్యమని పిలిచే అహంకారులూ దానిని బాంచెన్ అని నిర్విమర్శగా స్వీకరించే మందబుద్ధులూ మనకి చాలామందే ఉన్నారు. దేశమంటే మనుషులే గానీ తెలంగాణా అంటే మాత్రం మట్టేనని వీరిభావం. వేముల ఎల్లయ్యకి మాత్రం తెలంగాణా అంటే నిరంతర చలనంలో ఉండే మనుషులు. వారి మధ్య మారుతూ ఉండే సంబంధాలు, వాటికి రూపాన్ని యిచ్చే సంస్థల, సంప్రదాయాల, చైతన్యాల, ఆస్తి సంబంధాల, పోరాటాల మూసలు. అంతేకాదు, ఎల్లయ్యకి తెలంగాణ అంటే మట్టి కూడా. కాకపోతే అది అనిర్దిష్టమైన ‘ప్రాంతం’ కాదు. అల్పమైన మట్టి కాదు. భూమి.

స్థిరత్వానికి, సంప్రదాయానికి, కరుడుగట్టుకుపోవడానికి, మార్పులేనితనానికి, గిరిగీసిన తనానికి పేరుమోసిన ‘గ్రామం’ లో నిరంతరప్రాయమైన చలనాలని ఈ నవల చూపిస్తుంది. గతం గమ్మున నిలుచుండిపోదనీ దానిని అలా నిలబెట్టుకోవడానికి ఎంతో శక్తివెచ్చించాల్సి వస్తుందనీ ఎల్లయ్యకి బాగా తెలుసు. కథలని నేలయే ఈ సమస్త సంచలనాలకి కుదుపులకీ కేంద్రంగా సాధనంగా ఆఖరుకి లక్ష్యంగా కూడా వేముల ఎల్లయ్య చూపెడతాడు.

4

మనకి విప్లవ సాహిత్యం పేరిట చాలా సైనిక సాహిత్యం వచ్చింది. కానీ విప్లవం అంటే అన్నిటికన్నా ముఖ్యంగా ఉత్పత్తి సాధనాలకీ అధికారానికీ సంబంధించిన విషయం. ఆ రకంగా కక్క నవలని తొలి విప్లవ నవలగా చెప్పుకోవచ్చు. కథాంతంలో బాధితపాత్రల చేతుల్లో ఆయుధాలని చొప్పించడమే విప్లవమనే విరసవాద పరిమితిని అధిగమించడం కక్క నవల పరిణితి.

5

గతంలో కూడా ఒకటి రెండు దఫాలు తెలంగాణా ఉద్యమం వచ్చింది. ఇప్పటి ఉద్యమంలో ఆనాటి స్థాయి ఉద్వేగం లేదు. ఇంతకుముందు వేరుతెలంగాణా అవసరమా అనవసరమా అనేవి మాత్రమే ప్రశ్నలు. కానీ ఇప్పుడు అది అపాయకరమా కాదా అనే ప్రశ్న కూడా వేసుకోవాల్సిన అవసరం దాపురించింది.

తెలంగాణా గుర్తింపుని నిజాం వ్యతిరేక గుర్తింపుగా ఏకపక్షంగా నిర్వచిస్తున్నారు. దీని వలనాది ముస్లిం వ్యతిరేక గుర్తింపుగా దిగజారేందుకు అనువుగా మారుతున్నది. జీవితాచరణకి అర్థాన్ని వ్యాఖ్యానాన్ని కల్పించుకునే సహ- ఆచరణే సంస్కృతి అనుకుంటే తెలంగాణా ప్రాతినిధ్యంలో అనేక ప్రమాదాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

పేదరికం, వెనకబాటుతనం, భూస్వామ్య విధేయత, క్రూరత్వం, సెంటిమెంట్ వంటి అంశాలని పరిహరించుకొనే వనరులు, స్వయం ప్రతిపత్తి, సాధనాలు, సమయం, సంస్కరణోద్యమాలు, ప్రయోగాలకి వీలు వంటివేవీ తెలంగాణా జాతీయ వాదానికి సమకూరలేదు. కానీ ఆంధ్రాధిపత్యానికీ నిరంకుశ ఐక్యతావాదానికీ వ్యతిరేకంగా సొంతగుర్తింపుని అసెర్ట్ చేసుకోవాల్సిన స్థితిలోకి నెట్టబడింది. ఇంకా నిర్మించుకోవాల్సిన ఎన్నిటినో ఇప్పటికే తయారుగా ఉన్నాయని వాదించాల్సిన చిక్కుస్థితిలో తెలంగాణ ఉద్యమ సాంస్కృతిక విభాగం చిక్కుకున్నది.

6

ఈ ఇరుకైన పరిస్థితిలో తెలంగాణా జాతీయ నవల కక్క పుట్టింది. కక్క నవల తెలంగాణా జీవితానుభవ బహుళత్వాన్ని సంఘటిత పరిచే నిర్మాణాత్మక నవల. అంతేకాదు, తెలంగాణా గాయాలకి పట్టిన సెప్టిక్ ని నయం చేసే ముందుకూడా. ప్రపంచమంతటా జాతీయవాద సాహిత్యమంతా ఘనమైన గతాల ప్రశంసలే. లేదా విలాపగీతాలే. ప్రపంచ జాతీయ వాద సాహిత్యంలో వేముల ఎల్లయ్య కక్క అనన్యత ఏమంటే తన జాతీయవాదాన్ని గతకీర్తి మీద కాక భవిష్యత్తు మీద లగ్నపరచడం. అలాగని కక్క ఉటోపియా కాదు. సాహిత్యంలో ఊహాస్వర్గాలు కొత్తకాదు. కానీ అవి వాస్తవాల వర్ణనలు కావు. ఆకాంక్షల దృశ్యీకరణలు. ఈ నవలలో జీవిత వాస్తవాలని త్యజించని ఉటోపియా ఉన్నది.దీనికి తోడు గతాన్ని పట్టుకువేళ్లాడని జాతీయవాదం ఉంది.

ఇవిరెండూ కలసి రావడంతో పాటు ఎక్కడా మార్మికతకి సందు ఇవ్వకపోవడమనే విశేషం కూడా అమిరింది. ఈ లక్షణాలు అన్నీ కలపి కక్క నవలని ప్రపంచ మహా సాహిత్య శ్రేణిలో సగర్వంగా నిలుపుతాయి.

సామాజిక ఉద్యమాలని నిర్వహించే సంస్థలూ కదిలించే ఉద్వేగాలూ వాటి లక్ష్యసాధనకి సాధనాలూ వాటిని అణిచివేసే యంత్రాంగాలూ వక్రీకరించే ప్రచారాలూ ఎప్పుడూ ఉంటాయి. కానీ 'కొలిచే' పరికరాలు సమకాలంలో దొరకవు. దశాబ్దాలూ కొన్ని సార్లు శతాబ్దాలూ ఆగాలి. ఈ విషయంలో తెలంగాణా ఉద్యమానిది అదృష్టమే. దానికి ఒకకొలమానం, గీటురాయి దొరికింది. అన్ని గొంతులకీ స్థానం ఉన్న అన్ని స్థానాలకీ చలనం ఉన్న సమగ్ర సిలబస్ ఈ నవల. దీనిని ఇప్పటికీ తెలంగాణా ఉద్యమం తన జాతీయ నవలగా ప్రకటించకపోవడం అనుమానించదగ్గ విషయం.

7

'నవల' భౌతిక స్వరూప స్వభావాలు సైతం ప్రజాస్వామికమైనవి. నవలని కొద్దిమందికోసం (వార్తాకథనంలో వలె) బతుకులోని బహుళ స్వరాలని ఏకసూత్రంలోకి ఇరికించే అవసరమూ అవకాశమూ నవలా ప్రక్రియ స్వభావంలోనే లేదని మార్క్సిస్టు సాహిత్య సిద్ధాంతవేత్త మిహయిల్ భక్తిన్ చెప్పాడు. ఆ ప్రక్రియా ప్రత్యేకతని సందర్భోచితంగా సద్వినియోగం చేసుకున్న నవల కక్క.

8

దళితవాదంలోని రెండు ప్రధాన స్రవంతుల పరిమితులని కక్క అధిగమిస్తుంది. ఒకటి: బిఎస్పీ ప్రేరిత స్వల్పకాలిక అధికార భాగస్వామ్యవాదం. రెండోది: వాస్తవ వైరుధ్యాల స్పృహలేని (ఒకరకం) అంబేద్కరీయ ఆదర్శవాదం. మొదటిది మైనారిటీలని గాలికి వదిలి బిసిలకి అధిపత్య శూద్రకులాలకి వ్యతిరేకంగా బ్రాహ్మణబనియా వర్గాలతో జంటకట్టాలని అంటుంది. రెండోది విద్యావంతుల, మేధావుల, ప్రధాన స్రవంతి రాజకీయాలలో లేని దళిత కార్యకర్తల కార్యక్రమరహిత కులనిర్మూలనావాదం. ఈ రెండు స్రవంతులలోనూ ఉమ్మడిగా ఉన్న మరొక పెడధోరణి ఉంది. దానికి విరుగుడు కక్క నవలలో దొరుకుతుంది. ఆ ధోరణి దళితులకి ఎదురయ్యే అవమానాల అణిచివేతల సూటిరూపాలని మాత్రమే పట్టించుకుంటూ వాటి చుట్టూరా మాత్రమే దళిత గుర్తింపుని నిర్మించే బాధితవాదం. ఈ వాదాలలో లోపించిన దీర్ఘకాలిక సానుకూల కార్యక్రమాత్మక స్వభావం కక్కలో పుష్కలంగా ఉంది. కక్క నవల అనుభవంలో కూరుకుపోదు. ఆకాంక్షలలోనూ తేలిపోదు. జీవితంలోనే జీవిత సమస్యలకి సమాధానం వెతుకుతుంది. పరిష్కారాలని "కల్పించదు". అలాగని యథాస్థితివాద నిష్క్రియలోకి నిష్క్రమించదు.

9

చుండూరులో రెడ్లూ కారంచేడులో కమ్మలూ దళితమేధాలకి పాల్పడితే బ్రహ్మణిజాన్ని విమర్శించి లాభంలేదని గుర్తించిన దళిత శ్రేణుల్లో ఒక భాగం బియస్పీ విజయాలతో చాలా స్ఫూర్తి పొందింది. ఇప్పుడు అధిపత్య శూద్రకులాలూ వెనుకబడిన కులాలవారే తమని ప్రత్యక్షంగా అడుగడుగునా అణిచివేస్తున్నారనే నిష్ఠురనిజాన్ని అది నిష్కర్షగా ముందుపెట్టింది. అందువల్ల కమ్యూనిస్టులనీ మైనారిటీలనీ బీసీలనీ వదిలేసి 'అగ్ర'వర్ణాలతో చేతులు కలుపుదామని అన్నది. మరి కులనిర్మూలన గురించీ బ్రాహ్మణీయ విలువల వ్యతిరేకపోరాటం సంగతీ ఏమిటని అడిగితే, దానికి అధికారం కావాలి ముందు అని జవాబిచ్చింది. దళిత బహుజన ఐక్యతకు పునాది లేదని తెగేసి చెప్పింది. మరో దళితవాదానికి విద్యే సర్వస్వం. అధికారం గురించి వనరులగురించి కార్యక్రమం కాదు కదా కనీస ధ్యాసయినా ఉండదు. ఈ విద్యార్జనా వాదం నుంచి దళితవాదాన్ని ఎల్లయ్య భూమ్మీదకు దించుతాడు. విద్యాధిక దళిత శ్రేణుల నుంచి దళారీలు తప్ప పోరాటయోధులు పుట్టడం లేదనే చేదుని చూసే కాబోలు ఎల్లయ్య నవలలో చదువుకున్న దళితులకి స్థానమే లేదు. ఈ రెండు రకాల శత్రువులు మరో సందర్భంలో కలిసిరావడానికి ఆస్కారమే లేదు. వేముల ఎల్లయ్య చూపిన జీవితం ఈ రెండు అతి(పరిమిత) వాదాలలో ఉన్న ఉమ్మడి లోపాన్ని బయట పెడుతుంది. ఒక అంటరానితనం, అవమానం వంటి దళితజీవితపు నిత్యవాస్తవాలను కూడా పక్కకుపెట్టి అధికారపోరాటం, వనరుల కోసం ఆరాటాలని ముందుకు తీసుకువచ్చాడు. రాసిన విషయాలలోనే కాదు వదిలేసిన విషయాలలో సైతం ఎల్లయ్య వివేచన స్పష్టంగా కనబడుతుంది. ఇది అన్నలు లేని తెలంగాణా నవల. బ్రాహ్మణులు లేని దళిత నవల. కానీ ఈ 'ప్రాంతీయ'నవలలో ఆంధ్ర వలసవాదులు మాత్రం ప్రముఖ పాత్రనే పోషిస్తారు.

10

వేముల ఎల్లయ్యది రిలేషనల్ దృష్టి. ఆయన జీవితాన్ని చూసే తీరు దళిత మార్క్సిజానికి సన్నిహితమైనది. మిగతావాదాలలోని లోపాలని ఎల్లయ్య అధిగమించాడంటేనూ వాటిలో లేని సుగుణాలనీ లోచూపునీ ప్రదర్శించాడంటేనూ ఆయనేదో 'సరైన'సమాజానికి బ్లూప్రింట్‌ని ఏదో రూపొందిచాడని వాదిస్తున్నట్టుగా ఎవరైనా పొరపడవచ్చు. జీవిత వాస్తవాల నుంచి దానికి అనుగుణమైన లక్ష్యాలని ఏర్పరచుకోకుండా ఆదర్శాల ఆధారంగా వాస్తవాలని మానిప్యులేట్ చేసేవారిని మార్క్స్ ఒకసారి స్కౌండ్రల్స్ అని అన్నడు. పూర్తిగా జీవితం ఆధారంగానే లక్ష్యాలని రూపొందిస్తాడు ఎల్లయ్య. అయినా ఆ లక్ష్యాలు నిరాశాజనకంగా గానీ అత్యాశలుగా గానీ కనిపించకపోవడం ఆయన ప్రతిభ కాదు. పరిస్థితులలో ఎదురుచూస్తున్న ఆశాజనక వనరుల సుభిక్షత.

(కక్క నవలను ఆంధ్రామాండలికంలోకి అనువాదం చేస్తున్నందుకు సహచరుడు చిట్టిబాబుకి ఈ థీసిస్ అంకితం)

## ప్రత్యామ్నాయ స్త్రీపురుష సంబంధాల అన్వేషణే అరి సీతారామయ్య కథలు



స్త్రీల సమస్యల పట్ల స్పందించడం ఇంకా అరుదైన మన ప్రవాస సమాజంలో, వారి పట్ల సానుభూతితో రచనలు చేసే అరి సీతారామయ్యది ప్రత్యేక ముద్ర.' స్త్రీ పురుషులు సమానులుగా, పరస్పర గౌరవంతో బతగ్గలగటమే ప్రత్యామ్నాయం' మనేది ఆయన శైలి. అలాగే, తెలుగు'డయస్పోర' కర్ర విరగకుండాపాము చావకుండా ఉండేలాంటి సాహిత్యాన్ని దాటి జనజీవనానికి అద్దం పట్టాలని ఆశించే ఆయనతో 'ప్రజాకళ' ఇంటర్వ్యూ .

మీ బాల్యం, నేపథ్యం, కుటుంబం, జీవనయాత్రల గురించి చెప్పండి?

పుట్టి పెరిగింది ప్రకాశం జిల్లాలో తిమ్మనపాలెం అనే చిన్న గ్రామంలో. మాది వ్యవసాయ కుటుంబం. ఒంగోలూ చీరాలల్లో కాలేజీ చదువు, లక్నోలో ఎం ఎస్సీ, పి హెచ్డీ లూ, తర్వాత జర్మనీ ఫ్రాన్సుల్లో పోస్టాక్టరల్పెలోగా పనిచెయ్యటం. 76లో అమెరికా వచ్చాను. 79లో తిరిగి ఇండియా వెళ్ళి ఉస్మానియా యూనివర్సిటీలో ఒక సంవత్సరం పనిచేశాను. 1980లో మళ్ళా అమెరికా వచ్చాను. అప్పటినుంచీ ఇక్కడే ఉన్నాను. ప్రస్తుతం మిషిగన్లో ఓక్లాండ్ యూనివర్సిటీ eye research institute లో ప్రొఫెసర్ గా పనిచేస్తున్నాను. మా కుటుంబంలో నేనూ, ఉషా గారూ, ఇద్దరు అమ్మాయిలూ. ఒకమ్మాయి కాలిఫోర్నియాలో ఉంటుంది, ఒకమ్మాయి వర్జినియాలో.

మీ రచనలకి స్ఫూర్తినిచ్చిన, మిమ్మల్ని ప్రభావితం చేసిన  అంశాలు ఏమిటి? భారతదేశంలో కంటే కూడా,అమెరికాలోనే ఎక్కువ రచనలు చేశారు. అంటే, ఇక్కడి  జీవితం మిమ్మల్ని రచయితగా మార్చిందా ? ఇంత వరకు చేసిన రచనల వివరాలు?

ఇండియాలో ఉండగా నేను రాయలేదు. 74లో ఇండియా నుంచి జర్మనీ పోవటంతో తెలుగు సాహిత్యం చదవటం కూడా వీలుకాలేదు. అమెరికా తిరిగొచ్చి ఫిలడెల్ఫియాలో ఉంటున్న రోజుల్లో ఆ ప్రాంతం తెలుగు సంఘం తరఫున ఒక చిన్న news letter వీలైనంత వరకూ తెలుగులో ప్రచురించేవాళ్ళం. తెలుగులో రాయటం దాంతోనే మొదలయింది.

కథలు రాయటం మొదలుపెట్టింది 1997లో. మేము ఫిలడెల్ఫియా లో ఉంటున్న రోజుల్లో (1980-1992) ఉషా గారూ ఆమె మిత్రులు కొందరూ కలిసి 'సేవా' (Service and Education for Women Against Abuse) పేరుతో ఒక సంస్థను ప్రారంభించారు. దాని ద్వారా ఇండియా, పాకిస్థాన్, బంగ్లాదేశ్ ల నుంచి వచ్చి,ఇక్కడ ఉంటూ, కుటుంబ హింసకు గురి అయిన స్త్రీలకెంతో మందికి సహాయం చేశారు. అలాగే డిట్రాయట్ వచ్చింతర్వాత కూడా ఉషా గారూ నేనూ ఇక్కడి సంస్థల్తో కలిసి పనిచేశాము. అందువల్ల నాకు చాలామంది స్త్రీల కథలూ, వాళ్ళు పడిన కష్టాలూ, వాటినుండి బయట పడటానికి వారు చేసిన ప్రయత్నాలూ, తర్వాత వాళ్ళ జీవితాల్లో వచ్చిన మార్పులూ - వీటి గురించి తెలుసుకోవటం వీలయ్యింది. వీళ్ళలో చాలా మందికి తమ అనుభవాల గురించి ఇతరులకు తెలియజెయ్యాలనే కోరిక బలంగా ఉండేది.వీరే కథలు రాయటానికి నాకు స్ఫూర్తినిచ్చిన వ్యక్తులు. అయితే వ్యక్తుల పేర్లూ, ఊళ్ళూ, సంఘటనలూ మార్చుతూ ఎవ్వరి confidentiality కీ లోపం రాకుండా కథలు రాశాను. 2005వ సంవత్సరంలో డెట్రాయిట్ తెలుగు లిటరరీ క్లబ్ వాళ్ళు "గట్టు తెగిన చెరువు" పేరుతో నా కథాసంకలనాన్ని ప్రచురించారు.

**రచనలు చేయడం మీ అభిరుచా , జీవన విధానమా, లేక భావోద్వేగమా? ఈ ప్రక్రియతో సంబంధం లేకుండా ఉండగలరా?**

ఏదో ఒక సంఘటన జరిగినప్పుడో (మళ్ళా నాలుగేళ్ళకి), ఒక వ్యక్తిగురించి తెలిసినప్పుడో (కొత్త ఊపిరి), ఓ వ్యక్తి పరిచయం అయినప్పుడో (సుచిత్రాచంద్ర) ఒక కథ రాయాలనే బలమైన కాంక్ష కలుగుతుంది. కానీ ఒక్కొకసారి రాయాలని ఉన్నా సరైన కథనం చెయ్యలేక పోవటం వల్లో, పాత్ర చిత్రణ సరిగ్గా కుదరక పోవటం వల్లో కథ రాయటం మానేసిన సందర్భాలు ఉన్నాయి. కథలు రాయకుండా ఉండగలను, కానీ, ఒక కథ రాయాలని మొదలుపెట్టింతర్వాత దాన్ని రాయలేకపోయినప్పుడు ఓ వెలితి మిగిలిపోతుంది.

**మీ కథావస్తువు, శిల్పాలవెనుక ఉండే ఆలోచనా స్రవంతిని వివరిస్తారా?**

నా కథల్లో వస్తువులు ముఖ్యంగా రెండు రకాలు - స్వతంత్రులుగా బతకటానికి ప్రయత్నిస్తున్న స్త్రీల జీవితానుభవాలు; రాజకీయంగా నా అనుభవాలూ, పరిశీలనలూ. శిల్పం గురించి నేను పెద్దగా ఆలోచించను. వీలైనంతవరకు పాత్రలను సహజంగా చిత్రించటానికి ప్రయత్నిస్తాను.

**మీ రచనల ద్వారా ఏదైనా ప్రయోజనం ఉందనుకుంటున్నారా? రచయితగా ఏం ఆశిస్తున్నారు?**

ప్రతి రచనకూ ఏదో ప్రయోజనం ఉంటుందని నా నమ్మకం. నా కథలు చదివినవారిని కొంచెం ఆలోచించేట్లు చెయ్యగలిగితే సంతోషిస్తాను. ఇబ్బందుల్లో ఉన్న వాళ్ళకు నా కథలు కొంచెం ధైర్యం ఇవ్వగలిగితే చాలు.

‘’గట్టు తెగిన చెరువు” లో  ఒక యధార్ధగాధను చిత్రించారు.  ఈ కథలోని శారద సమస్య ఒక వ్యక్తిది కాదు ఒక ఫ్యవస్థది  మరి ఇలాంటి సమ స్యలకు పరిష్కారం ఏమిటి, ప్రత్యామ్నాయం ఏమిటి?

సమస్యలకు పరిష్కారాలు చూపించటం రచయితల బాధ్యత కాదని నా అభిప్రాయం. అసలు సమస్య ఏంటో, దాని మూలకారణాలేంటో ఆలోచించగలిగితే ఎవరి సమస్యలను వారు పరిష్కరించుకోగలరని అనుకుంటాను. గట్టు తెగిన చెరువు కథలో వస్తువు కుటుంబ హింస. నూటికి దాదాపు 25 మంది స్త్రీలు ఏదోవిధమైన కుటుంబ హింసకు గురౌతున్నారు. కారణాలు రకరకాలు. కానీ, భార్యను కొట్టో, తిట్టో, బలవంతం చేసో తన మార్గాన నడిపించే హక్కు తనకుందని భర్తా, అతను భర్త కాబట్టీ, తను అతనిమీద అధారపడి ఉంది కాబట్టీ, కొట్టే అధికారం అతనికి ఉందని అనుకునే భార్యా -  వీళ్ళున్నంతకాలం అక్కడక్కడా చెరువు గట్లు తెగుతూనే ఉంటాయి. “భార్యా భర్తలు” లేకుండా పోయి, స్త్రీ పురుషులు సమానులుగా, పరస్పర గౌరవంతో బతగ్గలగటమే ప్రత్యామ్నాయం.

మీ రచనల్లో స్త్రీ ఎందుకు ముఖ్య భూమిక అవుతోంది?  ఈమె, తెలుగుదేశ స్త్రీ వాద కథలోని స్త్రీకి ఏ విధంగా భిన్నం?

చదువుకోవాలని ఆశగా ఉన్న అమ్మాయిలకు పెళ్ళిళ్ళు చెయ్యటం, ఇంటికి వచ్చిన కోడలిని తల్లిదండ్రుల దగ్గర నుంచి డబ్బు తీసుకురమ్మని వేధించటం నేను ప్రత్యక్షంగా చూశాను. ఇలాంటి సమస్యలకు ముఖ్య కారణం పెళ్ళి. ఆడవాళ్ళకు మన సమాజంలో పెళ్ళికి మించిన గమ్యం లేదు. ఇది మారాలి. పురుషుడి మీద ఆధార పడకుండా, ఆర్ధికంగా స్వతంత్రురాలైన స్త్రీ తనకు నచ్చిన పురుషుడితో కలిసి బతికితే ప్రస్తుతం ఉన్న జాడ్యాలు చాలా వరకు పోతాయని నా నమ్మకం. అలాంటి స్త్రీ పాత్రలతో కథలు రాయటం నాకిష్టం. కథల్లో నేపథ్యం వేరు కావచ్చుగాని, నా కథలకూ తెలుగు దేశ స్త్రీవాద కథలకూ పాత్రల్లో పెద్ద తేడా లేదేమో.

అమెరికాలోని తెలుగు సమాజంలో కుటుంబహింస ప్రధాన సమస్య అయినప్పటికీ, చెప్పుకోతగ్గ స్థాయిలో స్త్రీ వాద రచన లుఇక్కడి నుంచి రాలేదు.దీనికి కారణాలేమంటారు?

కల్పనా రెంటాల గారు కూడా ఈ విషయం గురించి ఒక సారి మాట్లాడారు. కారణాలు చెప్పటం కష్టం. స్త్రీవాదులైనా కాకపోయినా ప్రస్తుతం ఇక్కడ తెలుగులో కథలు రాస్తున్న స్త్రీలు చాలా తక్కువ మంది. వారి సంఖ్య పెరిగితేగాని వస్తువైవిధ్యం పెరగదేమో. అదీగాక హింసకు గురౌతున్న స్త్రీలకు తమ సమస్యల గురించి రాయటం సులభం కాదు. రాసేదంతా తమ గురించే అని పాఠకులు అనుకుంటారేమోననే భయం ఉంటుంది. అమెరికా రావటం అంటే తల్లిదండ్రులు ఎంతో ఖర్చుపెట్టి పెళ్ళి చేసి పంపించి ఉంటారు. వాళ్ళు నిరాశ పడకుండా

ఉండాలంటే తను సమస్యలను దాచి ఉంచాలి. తన సమస్యలకు కారణం తనేనేమో అన్న అనుమానం కుటుంబ హింసకు గురౌతున్న ప్రతి స్త్రీకీ ఉంటుంది. బయటికి ఎవ్వరికైనా చెప్పటానికి సిగ్గుపడుతుంది. ఇలాంటి నేపథ్యం లో ఇక్కడ స్త్రీవాద కథలు రావటం అంత సులభం కాదు.

"డయస్పోర" సాహిత్యం పట్ల మీ అభిప్రాయం? తెలుగులో ఈ సాహిత్యపు గమనంఎటు వైపు మళ్లితే ఇంకా మంచి రచనలు వొచ్చే అవకాశం ఉంది? ఏ ఏ కథావస్తువులను స్వీకరించవచ్చు?

దాదాపు పది సంవత్సరాలుగా ఇక్కడి వారు రాస్తున్న కథలు చదువుతున్నాను. చాలామంది మంచి కథలు రాస్తున్నారు. అయితే ఇక్కడి వారి కథల్లో జ్ఞాపకాలూ, సాంప్రదాయప్రీతి, ఇక్కడి జీవన విధానానికి వ్యతిరేకతా ముఖ్య వస్తువులుగా కనబడతాయి. ఇంకా కొన్నాళ్ళు పోతేగానివస్తువైవిధ్యం పెరగదేమో.

ఆఫీసులో ఉన్నంతసేపూ అమెరికాలో ఉంటూ, సాయంత్రం వారాంతాల్లో ఇండియాలో ఉంటారు మనవాళ్ళు అన్నారెవరో. అది చాలా వరకు నిజం. ఇక్కడ ఎన్ని సంవత్సరాలనుంచి ఉంటున్నా బయటి ప్రపంచంతో సంబంధం లేని వారు చాలా మంది ఉన్నారు. ఇక్కడి వారితో స్నేహసంబంధాలు ఏర్పరుచుకున్నవారూ, వారి జీవన విధానాన్నీ పైపైన కాకుండా లోతుగా పరిశీలించిన వారూ కథలు రాస్తే బాగుంటుంది.

"డయస్పోరిక్" కోణంలో తెలుగు కథ దాని గమనం , సమకాలీన తెలుగు సాహిత్యంతో పోల్చినపుడు అగుపించే తేడాలను చెప్పండి?

సమకాలీన తెలుగు కథలు ఎక్కువగా చదివే అవకాశం నాకు లేదు. చదివినంతలో ఈ కథల్లో గ్రామాల్లో వస్తున్న మార్పులూ, మధ్యతరగతి జీవితాలూ ఎక్కువగా కనిపిస్తాయి. ఇక్కడి వారు రాస్తున్న కథల్లో జ్ఞాపకాలూ, తెలుగుదేశంలో ఉన్న బంధువులతో ఇక్కడివారి సంబంధాలూ, ఇక్కడకొచ్చినవారి జీవితాల్లో మార్పులూ - ఇవీ ముఖ్యంగా కథా వస్తువులు. ఇండియా నుంచి వచ్చిన మొదటితరం వారికి జ్ఞాపకాలు ముఖ్యం కావటంలో విశేషం లేదు. కానీ, ముందు ముందు మంచి కథలు రావాలంటే జ్ఞాపకాల వలయం నుంచి బయటపడాలి. తెలుగుతనాన్నీ, సాంప్రదాయ ప్రీతినీ దాటి రావాలి.

'ఉద్యమ' నేపథ్యాలతో సాగే సాహిత్యానికి అమెరికాలో బలమైన 'వాయిస్' ఏర్పడే ఆస్కారం ఉందా? లేదా ఇటువంటి వాతావరణం తెలుగు నేలకే సరిపడుతుందా?

అమెరికా సాహిత్యం వ్యాపార సాహిత్యం. ప్రచురణ సంస్థలు పాము చావకుండా కర్ర విరక్కుండా ఉండేకథలను మాత్రమే ప్రచురించటానికి ఇష్టపడతారని అనిపిస్తుంది. Best American Short Stories 2005 సంకలనం చదివాను. దాంట్లో కథలకీ ఇక్కడి జన జీవనానికీ ఏంటీ సంబంధం అనిపించింది. దేశం అంతా మూడు సంవత్సరాలుగా ఇరాక్ యుద్ధం గురించి చర్చిస్తుంటే, దాని మీద ఒక్క కథకూడా లేదు ఈ సంకలనంలో. అంటే ఎవ్వరూ అలాంటి కథలు రాయటం లేదా? లేక వాటిని ఎవ్వరూ ప్రచురించరా? రెండు మూడు సంవత్సరాలక్రితం ప్రెసిడెంట్ గారి శ్రీమతి వైట్ హౌస్ లో ఒక poetry reading ఏర్పాటు చెయ్యాలని నిర్ణయించింది. కానీ, దానికి ఆహ్వానించిన కవుల్లో చాలా మంది యుద్ధవ్యతిరేక కవితలు చదువుతారని తెలిసింతర్వాత ఆ ప్రోగ్రాం రద్దు చేసిందామె. దీన్నిబట్టి నాకనిపిస్తుందేమిటంటే ప్రస్తుత సమస్యలగురించి కథలు రాసే వారు ఉండేవుంటారు. వారి కథలు బయటకు రావటం లేదు. అంతే. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ దేశంలో మట్టి మనిషి, అంటరాని వసంతం లాంటి రచనలు వచ్చే అవకాశమే లేదు. ఇక్కడి సాహిత్యం కంటే సమకాలీన తెలుగు సాహిత్యమే ఆరోగ్యంగా ఉందని నా అభిప్రాయం. అంటే అక్కడ ఇబ్బందులు లేవని కాదు. కథనం, పాత్రచిత్రణలకంటే ఏదో చెప్పాలనే తాపత్రయం ఎక్కువ సమకాలీన తెలుగు కథలో. కథ రాసింతర్వాత దాన్ని నలుగురు మిత్రులకిచ్చి, వారి అభిప్రాయలను సేకరించి, వాటికనుగుణంగా కథలో మార్పులు చేర్పులు చేసి ఆ తర్వాతే ఏదో పత్రికకు పంపించే అలవాటు మన రచయితలకు ఇంకా అలవడలేదు. ఇది నాగోడవ గాని మీప్రశ్నకు సమాధానం కాదు.

తెలుగు సాహిత్యాన్ని అంతర్జాతీయంగా తీసుకువెళ్లే ప్రక్రియ ప్రారంభం అయింది కదా! ఈ ప్రక్రియని ఎలా తీసుకుపోగలిగితే బాగుంటుంది. ముఖ్యంగా అనువాదాలకి సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏమిటి ?

నేను శరత్ సాహిత్యం చదివాను చిన్నప్పుడు. కానీ, కాలేజీకెళ్ళిందాకా శరత్ తెలుగువాడుకాదని నాకు తెలియదు. దానికి ముఖ్య కారణం నేను చదివిన శరత్ నవలలు తెలుగునవలల్లా ఉండటం. తెలుగు సాహిత్యానికి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు రావాలంటే అలాంటి మంచి అనువాదాలు రావాలి. ఇంగ్లీషు మాతృభాష అయిన వారు అనువాదాలు చేస్తే బాగుంటుంది. అమెరికాలో ఉంటున్న రెండవ తరం తెలుగువారుగనక అనువాదాలు చేసేటట్లయితే మంచి అనువాదాలు వచ్చే అవకాశం ఉంది. వీరు ఇంగ్లీషు సులభంగా రాయగలరు. భాష మెళుకువలు వీరికి బాగా తెలుస్తాయి. ఇక రెండవతరం వారిని ఎలా ప్రోత్సహించాలో, ప్రస్తుత వాతావరణంలో అది సాధ్యమో కాదో నేను చెప్పలేను.

# కథ రాయడం కష్టం...

\- గాబ్రియెల్ గార్సియా మార్కెజ్

తొలినాళ్ళలో నేను రాసిన కథల్లో బుద్ధి బులపాటం అధికం అనిపిస్తుంది. జీవితానికి పుస్తకానికి మధ్య ఎంతో ఎడం ఉండేది. తర్వాత్తర్వాత ఆ విషయం గ్రహించాను.నేను కథనం నేర్చింది మా అవ్వ దగ్గర! మహత్తర విషయాన్ని మామూలుగా చెప్పడంలో దిట్ట ఆమె.



(గాబ్రియెల్ గార్సియా మార్కెజ్ నవల నూరేళ్ళ ఒంటరితనం ముఖచిత్రం)

ఒక నవలను రచించడం కన్నా కథా సంకలనం తేవడం కష్టం. మొదటిపేరా నా వరకు అంత తేలికగా రాదు. చాలా కష్టపడాలి. అందులోనే కథకు అవసరమైన శైలీ..గమనం వచ్చేస్తాయి,కాబట్టి, అదే కీలకం. ప్రతీ కథలో, ఈ ఇబ్బంది పడాలి; నవల ఒక్కసారి మొదలయిందా అంతే. ఆసాంతం రాసుకుపోవచ్చు. అందుకే భారీ నవల కన్నా పలు కథలను రాయడం బహు కష్టం.

వాస్తవానికి దూరం కారాదు. అలాగని చెప్పి వాస్తవాలే రాస్తే అది జర్నలిజం. జర్నలిజంలో ఒక అబద్ధం నీపై ఇతరులకు గల విశ్వాసాన్ని కూలుస్తుంది. తద్భిన్నంగా నవల/కథా రచనలో ఒక వాస్తవమున్నా అది రచనకు బలాన్నిస్తుంది. జర్నలిజంలో ప్రతిపదం మీద శ్రద్ధ ఉండదు. మంచి రచన అలా కాదు. ఐనా, జర్నలిజం, నుండి రచయిత గ్రహించవలసినవి అనేకం.

విమర్శకులు సిద్ధాంతాలు పుచ్చుకొని బయల్దేరుతారు. వాటిలో రచయితలను ఇరికించడానికి అవస్థలు పడతారు. నా మట్టుకు నాకు విమర్శకుల అవసరం లేదు. పాఠకుల మనసుకెక్కేలా రాయగలను.

అనువాదం అతి కష్టం. అందరి వల్లా అయ్యే పని కాదు. మంచి రచయితకు కఠోరమైన దీక్ష, క్రమశిక్షణ అవసరం. నా వరకు, ఇతర భాషల్లో పుస్తకాలు చదవడానికి ఇబ్బంది. స్పానిష్ లో నాకు అన్ని లోతులు తెలుసు, కాబట్టి, ఎంత చెత్త అనువాదమైనా మొదట మాతృభాషలోనే, హాయిగా చదువుతాను. నేను ఆంగ్లం, ఫ్రెంచి, ఇటాలియన్ భాషలను పటిష్టంగా నేర్చినవాడినే.

వలసపాలన వల్ల స్పానిష్ రచయితలు, ఇతరులు చెప్పే దాకా తమ గొప్పతనాన్ని గ్రహించలేక పోయారు. కీర్తి చెడ్డది. అదీ ఎంతో చెరుపు చేస్తుంది. దాన్ని దూరంగా ఉంచకపోతే రచయితగా రాణించలేవు. అది సర్వాన్ని హరించి వేస్తుంది. నా మరణానంతరం నా పుస్తకాలు వచ్చి వుంటే మరీ ఆనందించేవాణ్ణి. అప్పుడు కీర్తి ప్రతిష్ఠ ఈ గొడవలు ఉండవు కదా…

తెలిసిన విషయాలు, జీవితానుభవాలు రచనకు పునాది. బుద్ధి ఆలోచనలది పెడదోవ; చిన్న వయసులో అందరూ తొక్కినదే !

రచయిత పూర్తి ఆరోగ్యంతో, చక్కటి స్థితిలో చేసిన రచనలు నిలబడతాయి. మనసుకు పట్టిన రచనలు చదివినవే చదువుతుంటాను. కాల్పనిక సాహిత్యం మరీ ఎక్కువ చదవను. నానా పత్రికలు తిరగేస్తుంటాను. వార్తలు చదువుతుంటాను. లోకంతో సంబంధం పోగొట్టుకోరాదు. కీర్తి, అధికారం పెరిగే కొద్దీ ఏకాకితనం ఎక్కువైపోయి, చివరికి ప్రపంచంతో ఉన్న బంధం తెగిపోతుంది; రచయితకు
అది ప్రమాదకరం. నాకు కూతురు లేని లోటు తెలిసి వస్తోంది…

త్వరలో గొప్ప రచన చేయబోతానేమో అని నిరీక్షణ. అది ఫలించి, ఉత్తమ రచన నన్ను వరిస్తుందేమో…

గేబ్రియల్ గార్సియా మార్క్వెజ్, నోబెల్ బహుమతి పొందిన **'One Hundred Years of Soliltude'** నవల ద్వారా ప్రపంచ వ్యాప్తంగా మంచి పేరు సంపాదించాడు. **Living to tell a tale** ను బృహత్తర రచనగా కొనియాడారందరూ. (**Cancer** కబళిస్తుందేమోనని తనకై తాను విధించుకొన్న ప్రవాసం **,** ఏకాంతంలో పూర్తి గావించిన రచన. పలు నగరాల్లో ఇది విడుదలైన రోజు**…** చెలరేగిన అలజడి అంతా ఇంతా కాదు!)

**Paris Review** లో వచ్చిన **interview** నుండి సంగ్రహితం. **(05.06.04 )**

అనువాదం : తమ్మినేని యదుకుల భూషణ్

# సతీష్‌చందర్ 'చంద్రహాసం' ఆవిష్కరణ

- ప్రశాంత్

ప్రెస్ క్లబ్, సోమాజిగూడ

29 అక్టోబర్ 2006 సాయంత్రం 6 గంటలకు

అధ్యక్షత : దాసరి శ్రీనివాసులు, కమీషనర్, మార్కెటింగ్ శాఖ

ఆవిష్కర్త : డా॥ ఎన్. గోపి

ఆత్మీయ అతిథి : శ్రీ కొత్తపల్లి సత్యశ్రీమన్నారాయాణ, కవి

అతిథి : వేణుగోపాల్ రెడ్డి, ప్రెసిడెంట్, ఏకలవ్య ఫౌండేషన్

సమీక్షకులు : సీతారాం, కవి

'చంద్రహాసాన్ని' ఆవిష్కరిస్తూ ఆవిష్కర్త డా॥ ఎన్. గోపిగారు మాట్లాడుతూ,

"మన గురించి మనం ఆలోచించడం కంటే ఎక్కువగా లోకం గురించి ఆలోచించేవాళ్ళు రచనలు చేస్తారు. సతీష్‌చందర్ ఆ కోవలోకి వస్తాడని నా నమ్మకం. సతీష్‌చందర్ హృదయాలకు, స్నేహాలకు, మానవ సంబంధాలకు లొంగిపోతాడు. విశ్వవిద్యాలయాల కంటే విశ్వం చాలా పెద్దది. సతీష్‌చందర్ విశ్వాన్ని చదువుకొన్నాడు. 'పంచమవేదం' చూసిన తర్వాత నాకు సతీష్‌చందర్‌ది 'చైల్డ్ ప్రాడిజి' అనిపించింది. ఎందుకంటే వయసులో చిన్నవాడే కాబట్టి. ఆయన ప్రతిభను చూస్తే కొన్నిసార్లు నాకు అసూయగా ఉంటుంది. ఈ ప్రతిభలో కూడ అప్రయత్నత ఉంటుంది. మంచి 'వచనం' చాలా కష్టం. ముఖ్యంగా శ్రీపాద, రావిశాస్త్రి, పతంజలి లాంటి ప్రోజ్. అది సతీష్‌చందర్ వల్ల అయ్యింది. సతీష్‌చందర్ నవ్వించడమే కాదు నవ్వులో ఉండే విషాదాన్ని చెబుతాడు. శ్రీశ్రీ అన్నాడే 'రసన,' అది ఉంటుంది.

సీతారాంగారు సమీక్షిస్తూ,

ఈ పుస్తకాన్ని 'చంద్రహాసం' అనటం కంటే 'చండ్రహాసం' అనాలేమో. ఈ సంపుటి ద్వారా సతీష్‌చందర్‌గారు సృజన దారిని చూపారు. ఆలోచనను, దృష్టిని ఇచ్చారు. ఇటీవలి కాలంలో జీవితం గిట్టుబాటు లేనిదిగా మారుతున్న కాలంలో ముఖ్యంగా 90ల తర్వాత జీవితం అనూహ్యంగా మారిపోయి మానవ సంబంధాలు అంతరించిపోయాయి. ఈ రచన మొత్తంలో అంతస్సూత్రం ఏమిటి అని చూస్తే, 'నిన్ను వలె నీ పొరుగువారిని ప్రేమించు' అన్న గొప్ప మాట గుర్తొచ్చింది. ఈనాటి స్థితి ఇది. సతీష్‌చందర్‌గారు బతుకు శకలాన్ని తీసుకున్నారు. ఈ శకలాలు సకలం, సాకల్యం కూడా అయ్యాయి. ఒక కొత్త ప్రక్రియలో మానవ ప్రవృత్తుల్లోని మూల ప్రవృత్తుల గురించి రాశాడు. సతీష్‌చందర్ గత రచనలతో పోలిస్తే ఈ పుస్తకంలో కారుణ్యదృష్టి బలంగా

ఉందనిపించింది. ఇందులో హాస్యం మాత్రమే కాదు ఆరోగ్యకరమైన హాస్యం ఉన్నది. ఆలోచన, సృజనలకు సంబంధించిన విలువైన పుస్తకం. ఈ పుస్తకం చదువుతున్నప్పుడు ఇంటర్మీడియట్ విద్యార్థులకు పాఠ్యాంశంగా పెడితే బాగుంటుందనిపించింది. 1960ల్లో వచ్చిన నూతన సామాజిక ఉద్యమాల క్రమంలో వచ్చిన 'బ్లాక్ హ్యూమర్' రచయితలకోవలోనికి సతీష్‌చందర్ వస్తారేమో అనుకొన్నాను. సతీష్‌చందర్‌ది అసితహాస్యం కాదు. ప్రజాస్వామ్యం మీద గౌరవం ఉంది. నవ్వట్లేదు అంటే ఎదుటివాణ్ణి నమ్మట్లేదు అనేటువంటి కాలంలో ఒక మానవీయ పార్శ్వాన్ని చెప్పిన సతీష్‌చందర్‌గారికి అభినందనలు.భాషకు ఉన్న అన్ని అవకాశాల్ని సతీష్‌చందర్‌గారు ఉపయోగించుకొన్నారు. ఇది సౌహార్ద్రమైన బ్లాక్ హ్యూమర్.

శ్రీ కొత్తపల్లి సత్యశ్రీమన్నారాయాణ
దశాబ్దకాలం పైబడ్డ మార్పుల వల్ల గ్రామీణ జీవితానికి, నగర జీవితానికి జీవితంలో, మానవ సంబంధాల్లో, అనుబంధాల్లో అనేక మార్పులొచ్చాయి. ఒక సంస్కృతిలో పుట్టి, పెరిగి, ఇంకో సంస్కృతిలో బతుకుతున్న కాలం. దీన్నే డయస్పోరా అంటున్నాం. జీవితం చాలా వేగవంతమైంది. ఉపాధి వల్ల, ఒక భౌతిక ఆగత్యం వల్ల కోల్పోతున్న హ్యూమన్ బాండేజస్‌ని చెప్పాడు.

జీవితాల్లాగా ఈ రచన కూడా ప్రణాళికబద్ధంగా జరగలేదు. ఎండిపోయిన నదుల్లాగా మానవ సంబంధాలున్న రోజుల్లో ఈ రచన చాలా అవసరం. జీవితంలో హృదయాన్ని రంజించే కళాత్మకత లేదు. దాన్నే సతీష్‌చందర్ 'పని ఉంది పాట లేదు' అన్నాడు. పల్లెటూళ్ళలో సైతం సామూహికంగా పండగలు చేసుకొనే స్థితి లేదు. కలెక్టివ్ స్పిరిట్ లేదు. విజువల్ ఎనర్జీ వల్ల క్రియేటివిటి పోయింది. ఏదైనా పరోక్షంగా ఉన్నప్పుడు ఉండే సృజన ప్రత్యక్షమైనప్పుడు ఉండదు. ప్రయోజనాతీతమైన స్నేహం లేని కాలమిది. ఈ సందర్భంలో సతీష్‌చందర్, 'చంద్రహాసం' ఉత్కృష్టమైనది.

## కె. గీత 'శీతసుమాలు' ఆవిష్కరణ

- ప్రశాంత్

కె. గీత 'శీతసుమాలు'

కవితా సంపుటి ఆవిష్కరణ

నిర్వహణ: సాహితీ స్రవంతి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం మినీహాలు, 31 అక్టోబర్ 2006 సాయంత్రం 6 గంటలకు

అధ్యక్షత : తెలకపల్లి రవి, జర్నలిస్ట్,

ఆవిష్కర్త : అబ్బూరి ఛాయాదేవి

ఆత్మీయ వాక్యం : శిలాలోలిత, కవయిత్రి

వక్తలు : కె. శివారెడ్డి, కవి

సమీక్షకులు : సీతారాం, కవి

సభాధ్యక్షులు తెలకపల్లిరవిగారు మాట్లాడుతూ,

మామూలుగా బియ్యం తింటే పెళ్ళిరోజు వర్షం పడుతుందంటారు. మరి పుస్తకావిష్కరణ రోజు వర్షం పడితే ఏమనాలో. గీతగారికి వర్షం ఇష్టం. 'శీతసుమాలు'లో వర్షంపై చాలా కవితలే ఉన్నాయి. ఇవి 'ద్రవభాష' కంటే భిన్నమైన కవిత్వం. 'శీతసుమాలు' ఇలాంటి వర్షం వస్తున్న వాతావరణంలో ఆవిష్కరింపబడటం ఆహ్లాదంగా ఉన్నది. 2001లో 'ద్రవభాష' వచ్చింది. తార్కికత, ద్వైదీభావం, ఒక తప్పనిస్థితి అందులో ఉంది. రెండు సంపుటాల్లోనూ పుష్కలమైన జీవితం ఉన్నది. అంతేకాదు ఆలోచింపజేస్తుంది కూడా.

ఆవిష్కర్త అబ్బూరి ఛాయాదేవిగారు మాట్లాడుతూ,

పుస్తకావిష్కరణకు నన్ను ఆహ్వానించడం ఆశ్చర్యంగాను, ఇబ్బందిగాను ఉన్నది. అయితే వచన కవిత్వం వచ్చిన తర్వాత కవిత్వం రాసేవాళ్ళ సంఖ్య చాలా ఎక్కువైంది. నేనూ ఒకటి రెండు కవితలు రాశాను. ఆ అభిమానంకొద్దీ, ప్రేమకొద్దీ వచ్చాను. స్త్రీవాద కవయిత్రిగా అందరికీ పరిచయమైన గీత ఆ తర్వాత భావ కవయిత్రిగా రూపుదిద్దుకొంది. 'ద్రవభాష' ఘనీభవించి 'శీతసుమాలు'గా పరిణామం చెందిందనుకుంటాను. ఇందులో అనుభూతి కవిత్వం, మాతృత్వంపై కవితలు ఉన్నాయి. ముఖ్యంగా కంప్యూటర్ వచ్చిన తర్వాత భార్యాభర్తల సంబంధాల్లో వచ్చిన మార్పుకు సంబంధించినవి. కవిత్వంలో ఇంగ్లీషు వాడకం ఈమధ్యకాలంలో పెరిగింది. అది గీతలో కూడా కనిపిస్తుంది. గీత శిల్పాన్ని ఇంకా పదును పెట్టుకోవాలి. వచన కవిత్వంతో బాటు గేయ కవిత్వం కూడా రాస్తే బావుంటుంది.

వక్త కె. శివారెడ్డిగారు మాట్లాడుతూ,

‘శీతసుమాలు’ కవిత చదివి కళ్ళు మూసుకుంటే పచ్చని వెన్నెల పరచినట్టూ, వెచ్చని వెన్నెల కాంతి స్పృశించినట్టుననిపించే అనుభూతి పొందాను. ‘ద్రవభాష’లో లేని లాలిత్యం, ప్రకృతి కవిత్వం ఇందులో చూడొచ్చు. మెటఫర్స్ అన్నీ అక్కడివే. భావ కవిత్వ ఛాయలు బలంగా ఉన్నాయి. చాలా కాలంగా నా అభిప్రాయం భావ కవిత్వాన్ని సరిగ్గా అంచనా వేయలేరేమోనని. తెలుగు భావ కవిత్వానికి, ఇంగ్లీషు భావ కవిత్వానికి చాలా తేడా ఉన్నది. ప్రకృతి నుంచి అసమానాల్ని స్వీకరించడం మళ్ళీ శివసాగర్ తీసుకొచ్చాడు. ‘శీతసుమాలు’లో చాలా ఎక్కువ కవితలు వెన్నెల మీద, వాన మీద ఉన్నాయి. ఈ కవిత్వం చదివిన తర్వాత నాకనిపించిందేమిటంటే ఈ కవితల్ని ప్రశాంత మానసిక స్థితిలో రాసిందేమో అనుకొన్నాను. ‘ద్రవభాష’లోని కవిత్వం బాగా డిస్టర్బ్‌డ్ కవిత్వం. ఇది అట్లా లేదనుకున్నా. ఎన్నుకున్న పదజాలం, మెటఫర్స్ వల్ల ఈ కవితల్ని చదివి బాగా ఆనందించాను.

సమీక్షకులు సీతారాంగారు మాట్లాడుతూ,

ముగ్గురు సాహిత్య అకాడమి గ్రహీతలున్న సభలో మాట్లాడడం ఆనందంగా ఉన్నది. శివారెడ్డిగారు, ‘ప్రశాంత మానసిక స్థితి నుంచి ఈ కవిత్వం వచ్చింది,’ అన్న తర్వాత నాకు మాట్లాడ్డానికి భయమేస్తున్నది. శివారెడ్డిగారు చాలా అద్భుతంగా ప్రెజెంట్ చేశారు. ఎందుకో నేనట్లా చదవలేకపోయాను. ఎందుకంటే నేను చదివిన పద్ధతి, ఇప్పుడెందుకో కొత్త పద్ధతిలో చదవాలేమో అనిపిస్తున్నది. అయినా నేను చదివిన పద్ధతిని వదులుకోవడం ఇష్టం లేదు. నా అభిప్రాయంలో ఈ కవిత్వం ప్రశాంత మానసికస్థితి నుంచి వచ్చింది కాదేమో అనిపిస్తున్నది. తెలుగు కవిత్వంలో ఇవ్వాళ స్త్రీవాదానంతర కవిత్వం వస్తున్నదా అనిపిస్తున్నది. ఇంకోటేమిటంటే స్త్రీవాదులు ఉన్నా, స్త్రీవాదం కొనసాగుతున్నదా! అన్నది నా అనుమానం. ఈ మాట అంటున్నందుకు మన్నించాలి. తెలుగు కవిత్వంలో ఇవ్వాళ ఇకో ఫెమినిజం రావాలి. మన స్త్రీవాదులు పురుషాధిక్యత, గృహహింస దగ్గరే ఆగిపోయారేమో. అందువల్లే విస్తరణ ఆగిపోయిందేమో. ఆర్థిక సరళీకరణల రెండోదశ ముగింపు దశలో ఉన్నాం. రైతుల ఆత్మహత్యలు జరిగిపోయాయి. ఈ దశలో మన దృక్పథం ఏమిటి? ప్రశ్న రావాలి. ఆర్థిక సరళీకరణల లక్ష్యం ఇప్పుడు మధ్య తరగతి. గీతగారు ఈ సందర్భంలో ప్రాకృతిక కవిత్వంలోకి వెళుతున్నారు. ‘శీతసుమాలు’ తనదైన ముద్ర వేస్తూనే, ఈ కవిత్వాన్ని అభినందిస్తూనే చాలా చర్చ మొదలుపెట్టాలని నా అభిప్రాయం. ఎలాంటి విస్తరణ లేకుండా మళ్ళీ అక్కడి నుండి మొదలుపెట్టడం స్త్రీవాద సాహిత్యంలో జరగకూడదు. గత పదేళ్ళకాలంగా బ్యాంకుల దివాళాతో మధ్య తరగతి సంక్షోభం తీవ్రమైంది. జీవితం గిట్టుబాటు కానిదిగా తయారైంది. ఈ ఫ్రస్ట్రేషన్‌ని పట్టించుకోవాలి. దృక్పథ నైశిత్యం పెరగాలి. నా అభిప్రాయంలో ‘శీతసుమాలు’ రాబోయే మరణాలకి ముందుమాట లాంటిది. ఇంకా విమర్శనాత్మకంగా చెప్పాలంటే ఫైట్ చేయాల్సినచోట ఇలాంటి కవిత్వం ఎందుకు రాసింది అనుకున్నాను. ఉపద్రవాన్ని దృష్టిలో ఉంచుకొని గీతలాంటి వారు అటువైపుగా రాయాలని ఆశించాను. చాలామంది అనొచ్చు, ‘నెరుడా ప్రేమ కవిత్వం రాశాడు కదా’ అని. కాని ఆయనకున్న నేపథ్యం వేరు, మన పరిస్థితులు వేరు. ఇక్కడ ఆత్మహత్యలు జరుగుతున్నలాంటి సంక్లిష్ట స్థితి ఉన్నది. ఈరోజు హెచ్ఐవి వల్ల ఎంతమంది తల్లులు, పిల్లలు చనిపోతున్నారు.

వాళ్ళ గురించి రాయాల్సిన అవసరం లేదా! పురుషాధిక్య ప్రపంచంలో ఒక స్త్రీ పురుషుణ్ణి కండోమ్ వాడమని నెగోషియేట్ చేసే స్థితి ఉందా? ఇలాంటి సందర్భంలో స్త్రీ ఉందంటే భయం వేస్తుంది.

నిలువెత్తు మనుషులు, మన అమ్మల్లాంటి అమ్మలు మరణిస్తుంటే వాళ్ళ గురించి రాయాలి. ఇకో ఫెమినిజాన్ని రాయాలి. ఈ బాధ వల్లే ఇట్లా మాట్లాడాను.

## కిరణ్ దేశాయి నవల 'లాస్ ఆఫ్ ఇన్ హెరిటెన్స్' కు బుకర్ బహుమతి

ఈ సంవత్సరం బుకర్ బహుమతి కిరణ్ దేశాయి రాసిన నవల ' ఇన్ హెరిటెన్స్ ఆఫ్ లాస్' కు ప్రదానం చేసారు. ము ప్పయిదేళ్ళ కిరణ్ దేశాయి ఇప్పటిదాకా బుకర్ బహుమతి వచ్చిన రచయితల్లో కెల్లా పిన్న వయస్కురాలు. కిరణ్ దేశాయి ప్రఖ్యాత నవలా రచయిత అనిత దేశాయి కూతురు. ' తన అమ్మకు మూడు సార్లు రాబోయి తప్పిపోయిన బహుమతి అతి చిన్న వయసులోనే తనకి రావడం గొప్ప విషయం ' అని పలువురు వ్యాఖ్యానించారు.

అయితే కిరణ్ దేశాయి ఈ నవలను తన అమ్మకే అంకితం ఇచ్చింది. 'ఇన్ హెరిటెన్స్ ఆఫ్ లాస్' నవల, ప్రపంచీకరణ విషాదాల్నీ, భారతదేశం పల్లెల్లో సజీవంగా వున్న అన్యోన్యత, ఆత్మీయతల సంతోషాల్నీ అత్యంత ప్రతిభావంతంగా చిత్రించింది. 'ఈ నవల బలమల్లా దాని మానవతా స్వభావమే ' అనీ, ' గొప్ప మానవతా విస్తృతీ వివేకాల తోనూ, మృదువైన హాస్యంతోనూ, బలమైన రాజకీయ తీక్షణత తోనూ నిండి వున్న ఈ నవల ను బహుమతికి ఎంపిక చేయడం అన్ని రకాలుగా సమంజసం' అనీ , 'బహుళ సంస్కృతుల ప్రతిధ్వనులని సున్నితమైన కల్పనతో చిత్రించిన ఇన్ హెరిటెన్స్ ఆఫ్ లాస్ ప్రపంచీకరణ చెందుతున్న ప్రపంచానికి ప్రపంచీకరణ చెందిన నవల' అనీ పలువురు న్యాయనిర్ణేతలు వ్యాఖ్యానించారు.

కిరణ్ దేశాయ్ ఈ నవలలో ఒక తరం నుండి మరో తరానికి అందించబడే చిన్న చిన్న వైఫల్యాలని చిత్రించింది. తూర్పు పడమర ల మధ్య జీవించడం ఎలా ఉంటుందో , పడమర కాని దేశంలో పడమటి అంశం ప్రవేశపెట్టడం వలన జీవితాల్లో సమాజంలో ఎటువంటి మార్పులు వస్తాయో ఈ నవల చాలా ప్రతిభావంతంగా చిత్రించింది. బ్రిటిష్ వలస పాలన లో జరిగిన , ప్రస్తుతం అమెరికా తో మన దేశపు కొత్త సంబంధాల వల్ల జరుగుతున్న ఈ మార్పులని నవల చిత్రిస్తుంది. అమెరికా లో ఇమ్మిగ్రెంట్ల జీవితాలను, భారతీయ దృక్పథం నుండి చూసే ప్రయత్నం చేసింది. భారత దేశం నుండి 14 ఏండ్ల వయసులో ముందు ఇంగ్లాండు కు తర్వాత అమెరికాకు తన అమ్మతో వలస వచ్చిన కిరణ్ దేశాయి న్యూయార్క్ నగరంలో ఇమ్మిగ్రెంట్ల ఇక్కట్లను స్వయానా అనుభవించింది. ' భారతీయ కోణంనుండి కాక మరోలా నేను రాయలేను ' అని ప్రకటించిన కిరణ్ ఇంకా అమెరికా పౌరసత్వం తీసుకోలేదు. ' అమెరికా పౌరసత్వం తీసుకోవాలా వద్దా అనే మీమాంసలో ఉన్న నాకు బుష్ వచ్చాక ఇంక తీసుకోవాలనిపించలేదు. ' అంటుంది కిరణ్ . కొలంబియా విశ్వవిద్యాలయంలో 'సృజనాత్మక రచన' ను అధ్యయనం చేసిన కిరణ్ తనకు అమెరికా రచనా పద్ధతి నచ్చలేదంటుంది. తన మొదటి నవల అట్లా రాసినా తర్వాత కొత్తగా రాయాలన్న తపనతో ఈ నవల రాసినట్టు చెప్పకుంది. ఈ నవల రాయడానికి తనకి ఏడేళ్ళు పట్టింది. నవల రాస్తున్నప్పుడు తాను డబ్బుల కోసం చాలా ఇబ్బంది పడింది. కష్టకాలంలో తనకు అండ దండగా నిలిచి, తన రచనకు అన్ని రకాలుగా స్ఫూర్తీ ప్రేరణా అయిన తన అమ్మ అనితా దేశాయిదే ఈ నవల అంటుంది కిరణ్ .

# నేటివ్ అమెరికనుల చరిత్ర

- మమత

"తెల్లవాడు మాకు ఎన్నో వాగ్దానాలు చేశాడు. ఇచ్చిన మాట ఏదీ నిలబెట్టుకోలేదు,

మా భూమిని ఆక్రమించుకుంటానన్నది తప్ప." - వాపిల లోత (Wahpila – Lotha: Red Cloud).

అమెరికాకు వచ్చిన కొత్తలో పబ్లిక్ లైబ్రరీలో ఒక పెద్దాయన నన్ను చూసి "నేను కూడా ఇండియన్నే " అని అన్నాడు. అతని తెల్లటి ముఖంపైపు విచిత్రంగా చూశాను. అతను గట్టిగా నవ్వి "నువ్వు ఈస్ట్ ఇండియనువి, నేను వెస్ట్ ఇండియన్ని .. మీరనే రెడ్ ఇండియన్ని". అమెరికన్ ఆదివాసుల గురించి పుస్తకాల్లో చదవడం తప్ప ఎప్పుడు ఇలా ఎదురుపడలేదు.

నాకు సంతోషంగానూ , విచిత్రంగానూ అనిపించింది . అతను పుస్తకాల్లోని బొమ్మల్లో, సినిమాల్లో చూపించే రెడ్ ఇండియనులా పొడవాటి నల్లటి జుట్టులో ఏ పక్షి ఈకలు పెట్టుకునో , జింక చర్మంతో చేసిన దుస్తులువేసుకునో లేడు . అదే అన్నాను అతనితో. గట్టిగా నవ్వి "మీ దేశ సంస్కృతిని, మా దేశ సంస్కృతిని కలుషితం చేసిన మహానుభావుడు ఒకడే.. తెల్లవాడు.. తెల్లవాడు వెళ్ళిపోయిన తరువాత మీరు మీ ఇష్టప్రకారంగా మీ వేషభాషల్ని మార్చుకున్నారు. మేము గత్యంతరంలేక మమ్మల్ని మేము మార్చుకున్నాము" చెరగని చిరునవ్వుతో అన్నడతను. వాపిల లోత అన్న పై వాక్యం నాకు అప్పుడు గుర్తుకువచ్చింది. నా స్నేహితులతో అమెరికా చరిత్ర గురించి ఎప్పుడు మాట్లాడుకున్నా "అమెరికాకేం చరిత్ర? అంతా కలిపి కొలంబస్ కాలం నుంచి ఇప్పటిదాక ఉన్న ఐదు వందల ఏళ్ళ చరిత్ర తప్ప." అని అనుకునేవాళ్ళమేగానీ ఎప్పటినుండో ఈ ప్రదేశంలో నివసిస్తున్న ఆదివాసీ ప్రజల గురించి ఎప్పుడూ తెలుచుకోలేదు. ఈ ఐదు వందల ఏళ్ళ చరిత్రనిండా తెల్లవాడి ప్రసక్తే. ఏ డచ్ దేశస్తుడు ఏ ప్రదేశాన్ని కనుక్కున్నాడు? ఏ స్పానిష్ జనరల్ ఏ కోట ఎక్కడ కట్టాడు? ఏ ఫ్రెంచి ఆర్మీ ఏ ఇంగ్లండు ఆర్మీపై గెలించింది? అమెరికా సంయుక్త రాష్ట్రాలకు స్వాతంత్ర్యం ఎప్పుడు వచ్చింది? అనే చరిత్రపాఠాలేగాని ఇక్కడ ఎన్నో వేల ఏళ్ళనుంచీ ఉంటున్న ఆదివాసీల గురించి ప్రపంచానికి తెలిసింది చాలా తక్కువ.

ఉత్తర, దక్షిణ అమెరికా ఖండాల్లో ఎన్నో వేల సంవత్సరాలనుంచే జన జీవనం ఉంది. వీరి మూలాల గురించి ఎన్నో సిద్ధాంతాలు ఉన్నాయి. మంచుయుగంలో ప్రకృతి సహజంగా ఏర్పడిన మంచు వంతెన (Bering Strait) మీదుగా ఆసియా నుంచి అమెరికా ఖండంలోకి వచ్చారన్న వాదం ప్రాచుర్యంలో ఉంది. ఈ వాదాన్ని బలపరిచే సైంటిఫిక్ ఆధారాలు కూడా ఉన్నాయి.

ఏమైనప్పటికి 1498లో కొలంబస్ దారితప్పి అమెరికా ఖండాల్లో అడుగుపెట్టేనాటికి ప్రకృతిలో మమేకమై వెయ్యికిపైగా ఆదివాసీ తెగలు ఇక్కడ ఉండేవి .

అన్ని తెగలవారు ఇంచుమించు ఒకేలాంటి ఆచారాలు పాటించేవారు. కొన్ని తెగలు సంచార జీవులయితే మరికొన్ని తెగలు స్థిరనివాసాలు ఏర్పరుచుకున్నాయి . కొన్ని తెగలు కొద్దిపాటి వ్యవసాయం చేసినా దాదాపు అన్ని తెగలూ వేటమీదే ఆధారపడేవి . ఆదివాసులు ఏ జీవినీ అనవసరంగా చంపేవారుకాదు. తాము చంపిన జంతువులోని ఏ భాగాన్నీ వృథా చెయ్యకుండా ఆహారంగానో, దుస్తులుగానో , పనిముట్లుగానో ఉపయోగించేవారు. తమకు తిండిగా, దుస్తులుగా, ఇళ్ళులుగా ఉపయోగపడే జంతువులను, పక్షులను, చెట్లను పవిత్రమైనవిగా భావించేవారు. నదులకు, సముద్రాలకు దగ్గరగా నివసించిన ఆదివాసీ తెగలు చేపలను, తిమింగిలాలు మొదలగు సముద్రపు జంతువులను వేటాడేవారు. ఇందుకు అవసరమైన పడవలుకూడా తయారుచేసుకునేవారు. ఈ పడవలు దాదాపు వారికి అప్పటికి తెలియని బయటి ప్రపంచపు పడవలలాగానే ఉండడం గమనించదగిన విషయం. జంతువులను, పక్షులను వేటాడడానికి విల్లంబులను, వడిసెలలను ఉపయోగించేవారు. ఉత్తరంవైపు తెగలు జింక, అడవిదున్న చర్మాలను దుస్తులుగా, దుప్పట్లుగా, గుడిసెలు కట్టుకోవడానికి ఉపయోగించేవారు. దక్షిణంవైపు తెగలు కాటనుతో చేసిన దుస్తులను ధరించేవారు, గుడిసెలను గడ్డితో , చెట్టు బెరడుతో వేసుకునేవారు. కొన్ని తెగలు సుద్దతో చేసిన ఇళ్ళను కూడా కట్టుకునేవారు.

దాదాపు అన్ని తెగలవారు తమజుట్టును పొడవుగా పెంచుకుని జడలుగా కట్టుకునేవారు. కొన్ని తెగలవారు జుట్టులో గద్ద ఈకలను అలంకరించుకునేవారు. ఇతరులకు నిస్వార్థంగా సహాయం చెయ్యడంవల్లనో , యుద్ధంలో ఏదైనా సాహసకృత్యం చేయడంవల్లనో గద్ద ఈకలు బిరుదుగుర్తులు లభించేవి . వీటిని ధరించినవారిని గౌరవనీయులైనవారిగా భావించేవారు. గద్ద ఈకల్ని సంపాదించుకున్నట్లే వీరు తమ పేర్లను కూడా ఆర్జించుకునేవారు. పుట్టినప్పుడు ఏ పేరు ఉన్నా, వారు చేసిన కొన్ని పనులవల్ల వారికి "పేరు" వస్తుంది. ఉదాహరణకు, లకోట తెగకు చెందిన వీరుడు తాషుంక వీట్కో పుట్టినపేరు ఏమైనప్పటికి, గుర్రాలంటే అతనికి ఉన్న ఇష్టం వల్లనేకాక , అరాపహొ తెగపై వీరోచితంగా పోరాడి, వారి గుర్రాలను గెలుచుకొచ్చిన సదర్భంలో అతనికి తాషుంక వీట్కో (Crazy Horse) అని పేరు వచ్చింది. దీన్నిబట్టి వీరి పేర్లలో నిగూఢమైన అర్థం ఉందని తెలుస్తోంది. కొన్నిసార్లు తెగల మధ్య పోరాటాలుకూడా జరిగేవి. యుద్ధాల్లో గెలిచినప్పుడు , మంచివేట దొరికినపుడు, పెళ్ళిళ్ళ సందర్భాల్లో తెగలోని అందరూ కలసి ఉత్సవాలు చేసుకునేవారు . వేటను అందరూ కలిసి తిని, చలిమంటల చుట్టూ నృత్యాలు చేసేవారు. సంచారజీవనం చేసే కొన్ని తెగలు ఏదైనా ఒక ప్రదేశంలో విడిది చేసినపుడు తాత్కాలికంగా గుడిసెలు కట్టుకునేవారు. గడ్డిని అణగదొక్కి , నేలను చదును చెయ్యడంకోసం గడ్డిపై నాట్యం (Grass Dance) చేసేవారు. తెగలోని యువకులందరూ డప్పు శబ్దానికి అనుగుణంగా నృత్యం చేసి నేలను చదును చేసిన తరువాత తెగలోని పెద్దవాళ్ళ సలహాలమేరకు గుడిసెలు

కట్టేవారు .   వారు ఉన్న ప్రదేశాన్ని బట్టి గుడిసెవెయ్యడానికి కావలసిన సరంజామాను సమకూర్చుకునేవారు. మొక్కలగురించి కూడా వీరికి మంచి అవగాహన ఉండేది . కొన్ని మొక్కల ఆకులనుంచి, పువ్వులనుంచి రంగులు తయారు చేసుకుని డప్పులకు, దుస్తులకు, గుడిసెలపై అందమైన బొమ్మలు వేసుకునేవారు. యుద్ధానికి వెళ్ళినప్పుడు , పెళ్ళిళ్ళ సమయాల్లో ముఖానికి కూడా సందర్భాన్ని బట్టి రంగులు పులుముకునేవారు. ఎన్నో మొక్కలను ఔషధాలుగా వాడేవారు. పొగాకు, సేజ్ (ఒక సుగంధపు ఆకు పత్రి) వంటి మొక్కలను పవిత్రమైనవిగా భావించేవారు. వీరు ప్రకృతినే  దేవుడిగా, పరమాత్మగా భావించేవారు. ఈ పరమాత్మకు ఎలాంటి రూపం లేదు. పరమాత్మను పూజించేటప్పుడు పొగాకు లేదా సేజ్ మొక్కలకు నిప్పు అంటించి ఆ పొగను నలుదిక్కులకు  సమర్పించుకునేవారు. తెగలోని పెద్దవారిని కలవడానికి వెళ్ళినపుడు ఈ పవిత్రమైన మొక్కలను కానుకగా తీసుకెళ్ళేవారు. ఆలోచన సభలను పొగాకు ధూపం వేసి, ఆ పొగ అందరూ తాగినతరువాతే ప్రారంభించేవారు . పొగ తాగడంద్వారా అందరూ నిస్వార్ధంగా, మనసులో ఎలాంటి దురుద్దేశాలు లేకుండా , ఆలోచన సభల్లో పాల్గొంటున్నారని నమ్మేవారు.  తెగలోని ప్రతిఒక్కరూ తెగ మంచికోసం ఏదోవిధంగా తమవంతు సహాయం చేసేవారు . చిన్నప్పటినుండే వీరికి పెద్దలనుంచి యుద్ధవిద్యలు, గుడిసెలు కట్టడం, దుస్తులు తయారు చెయ్యడం లాంటి విషయాలను నేర్చుకునేవారు. తెగలోని వయసుమళ్ళినవారు చిన్నపిల్లలను చూసుకోవడంతోపాటు వారికి విద్యాబుద్ధులు నేర్పేవారు. తెగలోని పిల్లలనందరిని చుట్టూ కూర్చోబెట్టుకుని కథలరూపంలో వారికి బోధనలు చేసేవారు.  కథచెప్పటం అనేది ఒక వినోదంలాగానేకాక పెద్దలనుంచి వారి అనుభవాలనుపాఠాలుగా నేర్చుకునే సాధనంగా భావించేవారు .

తెల్లవాడు అమెరికాల్లో అడుగుపెట్టేనాటికి  అక్కడ ఎన్నో  తెగలు నాగరికంగా   అభివృద్ధి చెంది ఉన్నాయి . కొన్ని  తెగలవారు సమిష్టి వ్యవసాయం    చేసుకోవడమేకాక సామూహిక గృహాల్లో నివసించేవారు. దాదాపు అన్ని తెగలూ వారి  వారి తెగలకు సంబంధించిన శాసనాలకు కట్టుబడి ఉండేవారు.  తెగకు సంబంధించిన విషయాలపై  తెగ నాయకుడు ఒక్కడే నిర్ణయాలు తీసుకోకుండా ఆలోచన సభలలో  చర్చించుకునేవారు . తెగ ముఖ్య నాయకుడిని ఎన్నుకోవడంలో  కూడా  ప్రజాస్వామిక విలువలను  పాటించేవారు.  ఇరక్వా (Iroquois)   తెగది మాతృస్వామిక  సంఘం.   పాలనలో మహిళలే ముఖ్య పాత్ర నిర్వహించేవారు.  ఈ తెగకు చెందిన  పాలనాసూత్రాలను  కొన్నిటిని  , ప్రస్తుత    అమెరికా సంయుక్త రాష్ట్రాల  (USA) రాజ్యాంగంలో పొందుపరిచారు.

కొలంబస్ దారితప్పి అమెరికా ఖండంలో అడుగు పెట్టి కొత్త ప్రదేశాన్ని కనుగొన్నాడని  చరిత్ర పుటల్లోకి ఎక్కాడు .  కాని అతడిరాకమునుపే ఎంతో  అభివృధిచెందివుండిన   ఈ తెగలన్నీ ఇప్పుడు ఏమయ్యాయి ? వారి సంస్కృతి ఏది? ఎప్పుడో, ఏ షాపింగు కాంప్లెక్సులో ఏమూలో తమ  చేతికళలను అమ్ముకునే ఆదివాసులు మాత్రమే కనిపిస్తారు. వీరిలో చాలవరకు ఆదివాసి వస్తువులు అమ్ముతున్న తెల్లవాళ్ళే ఎక్కువగా ఉంటారు.

వీళ్ళు అమ్మే వస్తువులు కూడా ఎక్కువగా చైనాలో తయారై వస్తాయి. మరి ఐదు వందల ఏళ్ళ క్రితం లక్షలసంఖ్యల్లో ఉండిన ఆదివాసులంతా ఏమయ్యారు?

కొత్తగా వొచ్చిన వారికి తమ ప్రపంచంలో చోటు ఇవ్వడానికి ముందుకు వచ్చిన ఆదివాసులను చూసి తెల్లవాడు నవ్వుకున్నాడు. వేల ఏళ్ళ నుంచి ప్రకృతిలో మమేకమై జీవిస్తూ తమను ఆప్యాయంగా ఆహ్వానించిన వారిని సంస్కారహీనులకింద జమకట్టి, వారిని, వారి సంస్కృతిని నాశనం చెయ్యడమేకాక వారి ఉనికినే సమూలంగా నిర్మూలించడానికి సమకట్టాడు. కొలంబస్ కాలంనాటి నుండి ఇప్పటి వరకు, అంటే ఈ ఐదు వందల ఏళ్ళల్లో ఎన్నో తెగలు అంతరించిపోయాయి. ఎన్నో తెగలు తెల్లవాడు తన వెంట తెచ్చిన మశూచి(Small Pox) వంటి రోగాల బారిన పడి సమూలంగా నాశనం చేయబడ్డాయి. వందల వేల సంఖ్యల్లో ఆదివాసులు , తెల్లవాడు నిర్ధాక్షిణ్యంగా జరిపిన నరమేధానికి బలయ్యారు .

ఆదివాసులు ఏ పోరాటాలూ చెయ్యకుండానే తెల్లవాడికి దాసోహమనలేదు . ఎన్నో తెగలు తెల్లవాడి దురాశకు అడ్డుకట్ట వెయ్యడానికి ఏన్నో ప్రయత్నాలు చేశాయి. అట్లాంటిక్ నుండి పసిఫిక్ దాకా అమెరికా సంయుక్త రాష్ట్రాలు ఏర్పడిన క్రమంలో తెగల పెద్దలకు రెండే రెండు మార్గాలు కనిపించాయి. మొదటి మార్గం : తాము , తమ పూర్వీకులు తిరిగిన భూములపై తమకున్న ప్రకృతి సహజమైన హక్కులన్నీ వదిలేసి నిర్బంధ రిజర్వేషన్లలో చేరడం . రిజర్వేషన్లంటే తెల్లవాడు , ఆదివాసులకు ఎంత స్థలం అవసరమవుతుందో తానే నిర్ధారించి తెగలకు వాటాలుగా ఇచ్చిన కొద్దిపాటి ప్రదేశం . భూమి, ఆకాశం, చెట్లు , పుట్టలూ అన్నీ అందరికీ చెందినవని ఆదివాసుల విశ్వాసం. భూమి మీద హక్కులు అనేది వీరికి కొత్త విషయం. రెండవ మార్గం : స్వేచ్ఛగా తిరుగాడే హక్కును గెలుచుకోవడం. కొన్ని తెగలు తెల్లవాళ్ళకు ఎదురు నిలువలేమని యోచించి , తమ తెగల ఉమ్మడి మేలును దృష్టిలో ఉంచుకొని త్వరలోనే రిజర్వేషన్లలో చేరిపొయ్యాయి . దాదాపు అన్ని తెగలూ, ముఖ్యంగా ఉత్తర కోస్తాకు(East Coast, Atlantic Ocean) దూరంగా ఉన్నవారు, పోరాట మార్గాన్నే ఎంచుకున్నారు. తెల్లవాడు తమదాకా రాడని, వచ్చినా తమను ఎదిరించే బలగం వుండదని అనుకున్నారు. కానీ ఇసుక వెల్లువలా అట్లాంటిక్ మహాసముద్రాన్ని దాటి వచ్చిపడుతున్న తెల్లవాడిది ఎల్లలు లేని దురాశ అని ఊహించలేకపొయ్యారు. 1860లనుంచి 1890లదాకా ఆదివాసులు చేసిన ఈ పోరాటాలను "ఆదివాసుల ఆఖరి పోరాటాలు "గా పరిగణిస్తారు. అంతరించిపోకుండా మిగిలిన అన్ని తెగలూ చివరకు తెల్లవాడి కుటిల యుద్ధనీతి ముందు నిలువలేక మొదటి మార్గాన్నే ఎంచుకున్నారు . అటుతరువాత వారి ఆచారవ్యవహారాలను నాశనం చెయ్యడానికి తెల్లవాడు బోర్డింగు పాఠశాలలు ఏర్పరచాడు. తెగలోని పిల్లలను బలవంతంగా ఈ పాఠశాలల్లో చేర్చుకుని, మొదట వారి వేషాలను మార్చేవారు. పిల్లల పొడవాటిజుట్టును కత్తిరించేవారు. వారి సాంప్రదాయదుస్తుల బదులు కోటు, ప్యాంట్లు, బూట్లు వేసేవారు. ఆ పిల్లలు తమ మాతృభాష మట్లాడకుండా ఇంగ్లీషు మాత్రమే మాట్లాడాలని కట్టడి చేసేవారు. ఎపుడైన ఎవరైన వారి మాతృభాష మాట్లాడితే వారి నోళ్ళను సబ్బుతో కడిగేవారు. ఇంతాచేసి ఆ పిల్లలు పెద్దయినతరువాత

వాళ్ళని మళ్ళీ రిజర్వేషన్లలోనే వదిలేవారు. తెల్లవాడి జాత్యాహంకారంవల్ల తెల్లవాడి ప్రపంచంలో వీరికి ఉద్యోగాలు దొరికేవి కావు. పనిలేక , తెల్లవాడు రిజర్వేషన్లకు విరివిగా సరఫరాచేసే ఆల్కహాలుకు అలవాటుపడేవారు. అటు తమ పూర్వీకుల ఆచారాల్లో కలువలేక, ఇటు తెల్లవాడి ప్రపంచంలో నిలువలేక చాలవరకు కొట్లాటల్లో దిగి, దొంగతనాలు చేసి జైళ్ళపాలయ్యేవారు. రిజర్వేషన్లలో సరైన సౌకర్యాలుకూడా వుండవు. తాగేందుకు నీళ్ళు ఎన్నోమైళ్ళనుంచి తెచ్చికోవలసిన దుస్థితిలో, కరెంటు లేని , సరైన రోడ్లులేని రిజర్వేషన్లు ఇప్పటికీ ఉన్నాయి . ఎంతోమంది ఆదివాసులు ఈ రిజర్వేషన్లనుండి బయటపడి ఇప్పుడిప్పుడే తెల్లవాడి ప్రపంచంలోకి అడుగుపెడుతున్నారు. అలా బయటికి వచ్చినవారిలో కొంతమందికి మాత్రమే తమ ఆచారవ్యవహారాలపై అవగాహన ఉంది. 1970వ దశకందాకా ఆదివాసులు తమ మాతృభాష మాట్లాడడానికి, తమ ఆచారాలను పాటించడానికి సంకోచించేవారు. వీరిలో చాలామందికి బోర్డింగు స్కూలులో బోధనలవల్ల తమజాతిపై తమకే చిన్నచూపు ఏర్పడింది . ఇదంతాచూసి సహించలేని కొంతమంది యువకులు 1970వ దశకంలో ' అమెరికన్ ఇండియన్ మూవ్ మెంటు ' (AIM – American Indian Movement) అనే సంస్థను స్థాపించారు. ఈ సంస్థను యువకులు ప్రారంభిస్తే , తమ జాతి గౌరవాన్ని మరువలేని పెద్దలు ఎంతోమందివీరికి బాసటగా నిలిచారు. ఈ సంస్థ తమ జాతి ప్రజల్లో పోయిన ధైర్యాన్ని, ఆత్మగౌరవాన్ని తిరిగి సంపాదించుకునేందుకు ఎంతో కృషి చేసింది. తొందరలోనే ఎంతోమంది ఆదివాసులు తమ ఆచారాలను బహిరంగంగా పాటించడం మొదలుపెట్టారు. ఇప్పుడు ప్రతిసంవత్సరం , మార్చినెల నుంచి నవంబరు దాకా దేశంలోని ఎన్నో ప్రదేశాల్లో జాతరలను జరుపుకుంటున్నారు . దీనిద్వారా తమ ఆచారాలను, సంస్కృతినిపాటించేందుకు, తమ ముందుతరాలవారికి చేరేందుకు కృషి చేస్తున్నారు . అమెరికన్ ఇండియన్ మూవ్ మెంటు తమ ప్రజలు పడుతున్న పాట్లను గవర్నమెంటుకు తెలియజెయ్యడానికి ఎన్నో ప్రయత్నాలు చేసింది. కొన్ని హక్కులను సాధించుకుంది కూడా. ఎన్నోసార్లు దేశరాజధాని అయిన వాషింగ్టను డి.సి లో ఎన్నో పాదయాత్రలను, బహిరంగ సభలను నిర్వహించింది. అమెరికన్ గవర్నమెంటు అమెరికన్ ఇండియన్ మూవ్మెంటు నాయకులను ఎంతోమందిని ఎన్నోసార్లు జైళ్ళో పెట్టింది . ఈ నాయకులలో ముఖ్యుడైన లియొనార్డ్ పెల్టియరు ఎఫ్ .బి. ఐ పెట్టిన తప్పుడు హత్యకేసులో ఇరుక్కుని దాదాపు ముప్పై ఏళ్ళనుంచి జైల్లో మగ్గుతున్నాడు.

ఇంతాచేసి అమెరికను ఆదివాసుల గురించి బయట ప్రపంచానికి తెలిసింది చాలా తక్కువ. ఇవాళ్టి గందరగోళ పరిస్థితులలో ఆదివాసులనుంచి ఎన్నో విషయాలు నేర్చుకునే అవసరం ఉంది. వీరు ఆచరించే సూత్రాలలో ముఖ్యమైనది : "ఈ భూమిని మనం మన పూర్వీకులనుంచి వారసత్వంగా పొందలేదు.

మన పిల్లలనుంచి, వారి పిల్లలనుంచి అప్పుగా తీసుకున్నామంతే".

కొంతమంది ఆదివాసుల నుంచి, వారి చరిత్ర గురించి, ఆచారాలగురించి యదార్థంగా రాసిన పుస్తకాలనుంచి నేను తెలుసుకున్న, నేర్చుకున్న విషయాలను మీతో పంచుకోవాలని నా ప్రయత్నం . ఒక్కొక్క నేటివ్

అమెరికను  తెగ ఆచారాలు, కళలు, సాహిత్యాల గురించి, వారి బ్రతుకు పోరాటాల గురించి వచ్చే ప్రజాకళ సంచికలలో   ధారావాహికంగా  మీకు అందిస్తాను.

** అమెరికను ఆదివాసులను ఒక్కొక్క చోట ఆదివాసులని, నేటివ్ అమెరికనులని రాశాను. మన ప్రపంచంలో అన్ని దేశాల్లో ఆదివాసీ తెగలు ఉన్నయి. కాని ఈ వ్యాసాల్లో అమెరికా సంయుక్త రాష్ట్రాలకు చెందిన తెగల గురించి మాత్రమే తెలియజేస్తున్నాను కనుక ఇకపై వీరిని నేటివ్ అమెరికనులనే అంటాను.

# ఆమె పాల పళ్ళు పోతున్నాయి...

అతనెవరమ్మా ఆ ఫోటోలో
మామ తో?

అతనా బంగారూ – అతను నీ నాన్న

మరి నాన్న నన్ను చూడ్డానికి
ఎప్పుడూ
యింటికి రాడెందుకమ్మా?

యెందుకా – యెందుకంటే రాలేడు గనక

నాన్న చనిపోయాడా అమ్మా?
అందుకే యింటికి రావట్లేదా?

నాన్న బతికున్నాడని తనకు
చెపితే
నేను అబద్ధం చెప్పినట్టవుతుంది
నాన్న చనిపోయాడని చెప్పినా
అబద్ధమే

కాబట్టి అబద్ధం కానిదేదైనా
చెప్పగలిగితే
అది ఒక్కటే

నాన్న ఎప్పటికీ యింటికి రాడు
యెందుకంటే రాలేడు గనక!

(మూలం: ఏరియల్ డార్ఫ్ మేన్ – చిలీ దేశపు కవి )

# ఆశ

నా కొడుకు
పోయినేడాది
మే 8 నుండీ
కనబడుత లేడు.

యిదిగో
యిప్పుడే పంపిస్తం
యేవో రొటీన్ ప్రశ్నలడిగి ...
అంటూ తీసుకపోయిన్రు

లైసెన్సు ప్లేటు లేని
ఆ కారు వెళ్ళిపోయినంక
మాకు మల్ల వాడి గురించేమి తెల్వలేదు.

కానీ యిప్పుడు
పరిస్థితి మారిపోయింది.
ఐదు నెల్ల తర్వాత
బయటికొచ్చిన
ఒక కామ్రేడు తోటి తెలిసింది
వాడిని విల్లా గ్రిమాల్డి లో
చిత్రహింసలు పెడుతుండ్రని,

సెప్టెంబర్ చివర్లో
గ్రిమాల్డిల ఎర్ర యింట్లో
వాడిని ప్రశ్నిస్తుండ్రని.

వాడి గొంతునీ ,
బాధతో వాడు పెట్టిన కేకల్నీ
గుర్తు పట్టినమని

చెప్పిన్రు.

యెవరైనా నాకు
 నిజంగ  చెప్పండ్రి …
యేమి  రోజులివి
యేమి ప్రపంచమిది
యేమి దేశమిది?

నేనొక్కటే అడుగుతున్న …
వాళ్ళ కొడుకుని
చిత్రహింసలు
పెడుతుండ్రు
అని తెల్సి
యే అమ్మయినా
యే నాయనైనా
యెట్లా సంతోషంగ
వుంటరు ?

ఐదు నెల్లయినంక
వాడు యింక బతికే వున్నడు,
వాడు వచ్చే యేడాది కూడ
బతికే వుంటడనే ఆశ !
ఎనిమిది నెల్లయినంక
అట్లే చిత్రహింసలు
పెడుతున్రు కొడుకును ….
వాడు బహుశ  …
యేమో ….
బతుక గలుగుతడేమో?
బతికి వుంటడేమో?

(మూలం : ఏరియల్ డార్ఫ్ మేన్ – చిలీ దేశపు కవి)

# యుద్ధోన్మాద పాలకుల్లారా! - బాబ్ డిలాన్

( మంగళ వారం నవంబర్ 7 2006, న జరిగిన మధ్యంతర యెన్నికల్లో అమెరికన్ ప్రజానీకం పెద్ద సంఖ్యలో డెమోక్రాట్లనెన్నుకుని యుద్ధోన్మాది బుష్ కు గుణపాఠం చెప్పారు. 12 యేండ్ల తర్వాత వుభయ సభల్లో డెమోక్రాట్లకు తిరిగి పట్టు దొరికింది, అయితే బాగ్దాద్ లోని ఒక సామాన్య పౌరుడు మాత్రం ' డెమోక్రాట్లైతేంటి, రిపబ్లికన్లైతేంటి అమెరికా సామ్రాజ్యవాద విధానం ఏమీ మారదు – అంతా వొకటే ' అంటూ యీసడించుకున్నాడు. ఏమైనా అమెరికా ప్రజలు తమ యుద్ధ వ్యతిరేకతనీ, యుద్ధోన్మాది బుష్ పట్ల అసహ్యాన్నీ యీ యెన్నికల్లో స్పష్టంగా ప్రకటించారు. యెన్నికల పరాభవం నుండి ముఖం చెల్లడం కోసం బుష్, ఇరాక్ దురాక్రమణ సూత్రధారి ప్రస్తుత రక్షణ మంత్రి రమ్స్ఫెల్డ్ ని తొలగించి ఆ స్థానంలో మాజీ సి ఐ ఏ డైరెక్టర్ గేట్స్ ని నియమించాడు. గతంలో ఇరాన్ కాంట్రా సూత్రధారి , ఇరాన్ ఇరాక్ యుద్ధ వ్యూహకర్త అయిన గేట్స్ నిర్వాకాల గురించి ప్రస్తావిస్తూ 1986 లో అతనికి వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పిన మెల్ గుడ్ మేన్ తోనూ, గేట్స్ దుర్మార్గాలను పరిశోధించి వెలికితీసిన జర్నలిస్టు బాబ్ పేరీ తోనూ 'డెమోక్రసీ నౌ' లో యింటర్వ్యూ చేసిన ఏమీ గుడ్ మేన్, మధ్యలో బాబ్ డిలాన్ రాసిన యీ పాటను ప్రసారం చేసింది)

**యుద్ధోన్మాద పాలకుల్లారా!**

- బాబ్ డిలాన్

రండి ఓ యుద్ధోన్మాద పాలకుల్లారా !

తుపాకులని తయారుచేసేది మీరు -
మృత్యువిమానాలని తయారుచేసేది మీరు -
భూతాల్లాంటి బాంబులు తయారు చేసేది మీరు -
గోడలవెనుక దాక్కుంటున్నరా
అందమైన ఆఫీసు డెస్కులవెనుక దాక్కుంటున్నరా
మీకు తెలుసో లేదో
నేను మీ ముసుగులని చీల్చి చూడగలను!

మీరిప్పటిదాకా ఏంచేసారు
విధ్వంసం చేయడానికి నిర్మించడం తప్ప -

అదేదో బొమ్మ అయినట్టు

నా ప్రపంచంతో ఆడుకుంటున్నరు

నా చేతిలో తుపాకిపెట్టి
నా కళ్ళనుండి దాక్కుంటరు -
బుల్లెట్ల పెనువేగానికి జడిసి
వెనుదిరిగి దూరంగా పారిపోతరు !

జూడాస్ లా నిరంతరం
చెప్తరు యెన్నో అబద్ధాల్ని
చేస్తరు పచ్చి మోసాన్ని -
గెలువగలమంటూ ప్రపంచ యుద్ధం
నమ్మమంటరు నన్ను -

చూసినట్టు మురికికాల్వలోని నీటిలోంచి
చూడగలను మీ కళ్ళలోంచి -
చూడగలను మీ కుత్సితపు మనసుల్లోకి !!

యితరులు పేల్చడం కోసం
మీరు ట్రిగ్గర్ లాగి పెడతారు –
కుప్పలు కుప్పలుగా చావులు పెరుగుతుంటే
వినోదిస్తరు మీరేమో వెనుకకు వాలి -
నవయువకుల విగత దేహాల్నుండి
నెత్తురు ప్రవహిస్తూ మట్టిలో యింకిపోతుంటే
మీరు విలాసాల మేడల్లో దాక్కుంటారు!

చిన్నారులు యీ ప్రపంచంలోకి
అడుగుపెట్టడానికి కూడా బెదిరే
దుర్మార్గమైన భయాన్ని
విసురుతారు గాల్లోకి మీరు -

యింకా పుట్టని నా అనామక పాపని
భయపెట్టి బతికే మీ

నరాల్లో ప్రవహించేది రక్తమేనా!
మీ బతుకులే వృధా కాదా!!

మమ్మల్ని యెదిరించేందుకు నువ్వెంత –
తీసిపారేయొచ్చు నన్నో చిన పిల్లగాన్నని
యేమీ తెలియని అజ్ఞానినని -

చిన్నోణ్ణయినా మీకన్నా
నాకో పచ్చి నిజం తెలుసు !
మీ క్రూరమయిన దుర్మార్గాల్ని మాత్రం
క్షమించడేనాడూ ఆ జీసస్ !
నేను మిమ్మల్నో ప్రశ్ననడుగనా -
మీ సంపాదన అంత గొప్పదా
పెడుతుందనుకున్నరా క్షమాభిక్ష
చేతనవుతుందా దానికి మీ రక్ష !

గుర్తుంచుకోండి ఒక్క విషయం -
అప్పు చెల్లించమని అడుగుతూ
మృత్యువు మీ దగ్గరకు వచ్చినప్పుడు
కోల్పోయిన ఆత్మలని మళ్ళీ కొనడానికి
యెంతయినా సరిపోదు మీ డబ్బు !

మీరు చచ్చిపోవాలని కోరుకుంటున్నా -
అతి తొందరగా మీకు చావు రావాలని
యెంతగానో ఆశపడుతున్నా!

పాలిపోయిన ఒక మధ్యాహ్నం పూట
శ్మశానం దాకా నడుస్తా మీ శవపేటికల వెంట!

చూస్తా మృత్యు శయ్య మీదికి
మిమ్మల్ని దించుతుంటే -
నిలబడుతా మీ సమాధివద్ద

మీరు చచ్చి పోయిండ్రని ఖరారయ్యేదాక !!!

(బాబ్ డిలాన్ రాసిన మాస్టర్స్ ఆఫ్ వార్ కు స్వేచ్ఛానుసరణ)

-------------------------- ముగింపు ------------------------